

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 57

శుక్రవారం 19-5-2023



కోహ్లి ధమాకా...

సెంచరీతో బెంగళూరును గెలిపించిన ఓపెనర్. -12లో



అడవి రాసిన కవిత్వం

కొలామ్ భాష కోసం ఆత్రం మోతీరామ్ చేస్తున్న సాహిత్య సేవ.. -13లో


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తహవుర్‌ను అప్పగించండి

ముంబై ఉగ్రవాద దాడిలో ప్రధాన నిందితుడైన తహవుర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా కోర్టు అంగీకరించింది.

వివరాలు 6లో ▸



ముంపు బారిన న్యూయార్క్

వాతావరణ మార్పుల వల్ల న్యూయార్క్ నగరం ఏటా 2 మిల్లీమీటర్ల మేర కుంగిపోతున్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది.

వివరాలు 6లో ▸



జల్లికట్టుకు జై

ఎద్దులు, దున్నలు, గేదెలతో నిర్వహించే జల్లికట్టు, ఎడ్ల పందేలువంటి జంతు క్రీడలకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది.

వివరాలు 6లో ▸



'కేరళ స్టోరీ' నిషేధంపై స్టే

'ది కేరళ స్టోరీ' సినిమా ప్రదర్శనపై రాష్ట్రంలో నిషేధం విధిస్తూ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

వివరాలు 6లో ▸

111 పూర్తిగా రద్దు

ఆ జీవో పరిధిలోని 84 గ్రామాల్లో ఆంక్షలన్నీ తొలగింపు.. ● ఇకపై హెచ్‌ఎండీఏ నిబంధనలే వర్తింపు

హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిరక్షణకు రింగ్ మెయిన్, ఎస్టీపీల నిర్మాణం

హైదరాబాద్ నగరం నుంచి శంకర్‌పల్లి, చేవెళ్ల రోడ్ల విస్తరణ

ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ

వ్యవసాయ రంగంలో మార్పులు, బీసీలకు ఆర్థిక సాయంపై కేబినెట్ సబ్ కమిటీలు

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

వివరాలను వెల్లడించిన మంత్రి హరీశ్‌రావు

సీఎం కేసీఆర్ అధ్యక్షతన కొత్త సచివాలయంలో తొలి కేబినెట్ భేటీ ఇదే



కేబినెట్ కీలక నిర్ణయాలివీ..

- కాళేశ్వరం ప్రాజెక్టుతో మూసీ, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, హుస్సేన్ సాగర్‌ల అనుసంధానం.. వీటికి గోదావరి జలాల తరలింపు
- వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ.. వివిధ శాఖల్లో సర్దుబాటు.. పేస్కేల్ వర్తింపు
- రాష్ట్రంలో పంటల సాగు కాలాన్ని ఒక నెల ముందుకు జరిపేలా చర్యలు
- వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల ద్వారా మక్కలు, జొన్నల కొనుగోళ్లు
- 10, 15 రోజుల్లో రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభం
- కొత్త జిల్లాలకు అనుగుణంగా జిల్లా వైద్యాధికారి పోస్టుల పెంపు.. 40 కొత్త మండలాలకు పీహెచ్‌సీలు.. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో శాశ్వత నియామకాలకు నిర్ణయం
- మైనారిటీ కమిషన్‌లో జైనులకూ ప్రాతినిధ్యం
- టీఎస్‌పీఎస్సీని బలోపేతం చేసేందుకు కొత్తగా 10 పోస్టులు మంజూరు
- అచ్చంపేటకు ఉమామహేశ్వర లిఫ్టు తొలి, రెండో దశ పథకాలు మంజూరు

బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం

రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, మేదరి, కుమ్మరి తదితర కుల వృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని.. ఒక్కో లబ్ధిదారుకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించాలని కేబినెట్ నిర్ణయించినట్టు మంత్రి హరీశ్ ప్రకటించారు. దీని విధివిధానాల ఖరారుకు మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షతన మంత్రులు తలసాని, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డిలతో మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆర్థిక సాయంలో సబ్సిడీ ఎంత? ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నదానిపై ఉప సంఘం నిర్ణయం తీసుకుంటుందన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆర్థిక సాయం పంపిణీ ప్రారంభిస్తామన్నారు. - 2లో

కాంగ్రెస్‌లోకి తిరిగి రండి!

పార్టీని వీడిన నేతలకు రేవంత్‌రెడ్డి పిలుపు



- కాంగ్రెస్ పార్టీ అమ్మలాంటిది.. తెలంగాణ అభ్యున్నతికి పని చేయాలనుకునే వారు కాంగ్రెస్‌తో కలిసి రావాలి..
- కేసీఆర్‌కు వ్యతిరేకంగా పునరేకీకరణ జరగాలి
- బీఆర్‌ఎస్, బీజేపీ ఒకే తాను ముక్కలే
- నరేంద్ర మోదీ, అమిత్‌షా కుట్రలను కర్ణాటక ప్రజలు తిప్పికొట్టారన్న టీపీసీసీ చీఫ్
- ఓటమి తప్పదని కేసీఆర్‌కు అర్థమైందని వ్యాఖ్య

- వివరాలు 2లో

అధికారంలోకొస్తే బీసీ బడ్జెట్



- బీసీ జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు
- ఓబీసీ సమ్మేళనంలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కె.లక్ష్మణ్, బండి సంజయ్
- బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పిస్తాం..
- జూన్‌లో లక్షలాది మందితో హైదరాబాద్‌లో బీసీ గర్జన

-వివరాలు 5లో

విరాసత్‌కు బదులు రిజిస్ట్రేషన్!

- ముక్తిపాడ్ వక్ఫ్ భూముల బాగోతంలో వెలుగు చూస్తున్న అక్రమాలు
- ఇనాందారుడి వారసులు నిజంగా ఉంటే వారికి విరాసత్ ద్వారా బదలాయించాలి
- కానీ మద్దూర్‌లోని 1238/2014 ప్లాట్ నంబర్‌తో అక్రమంగా రిజిస్ట్రేషన్
- తాజాగా తెరపైకి మరో సీనియర్ అధికారి పేరు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/కోస్గి: ఇనాం భూమిని నిబంధనల ప్రకారం విరాసత్ ద్వారా వారసులకు బదలాయించాల్సి ఉండగా, నారాయణపేట జిల్లా కోస్గి మండలం ముక్తిపాడ్ పరిధిలో.. సంబంధం లేని డాక్యుమెంట్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసినట్లు 'సాక్షి'పరిశీలనలో తేలింది. ఓ ప్రజాప్రతినిధి సూత్రధారిగా సాగిన ఈ వ్యవహారంలో పాలమూరులో పని చేసిన ఓ సీనియర్ అధికారి పేరు వెలుగులోకి రావడం సంచలనం సృష్టిస్తోంది.

మ్యుటేషన్ కూడా పూర్తి..

ముక్తిపాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో 19, 20, 50, 51 సర్వే నంబర్లలో 48 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. ఈ భూమిని మూడు తరాలుగా చెన్నారం గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాల వారు సాగు చేసుకుంటూ టెనెంట్ దారులుగా ఉన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఇది ఇనాం భూమిగాను, ఇనాందారుగా హుస్సేని ఆలాం ఉన్నాడు. ఇనాందారుడికి సంబంధించిన వారసులు నిజంగా ఉన్నట్లయితే.. నిబంధనల ప్రకారం అర్హులకు కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రం జారీ చేసి.. అందరి సమ్మతం మేరకు విరాసత్ ద్వారా వారికి భూమిని బదలాయించాలి. కానీ ఇక్కడ మద్దూర్ మండల కేంద్రంలోని ఓ ప్లాట్ డాక్యుమెంట్ నంబర్ 1238/2014తో విరాసత్‌కు బదులు రిజిస్ట్రేషన్ చేసి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే అధికారులు వారు మూడో తరమని చెబుతూ తప్పించుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలిస్తే 1238/2014 డాక్యుమెంట్‌తో పాటు 2200051257 లావాదేవీ నంబర్‌తో మ్యుటేషన్ పూర్తి అయినట్లు తెలుస్తోంది.

మరో సీనియర్ అధికారి పాత్ర?

తహసీల్దార్‌కు సంబంధం లేకుండా సాగిన ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రూ.5 కోట్లు చేతులు మారడాన్ని 'సాక్షి'ఇటీవల వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. కొంతకాలం క్రితం నారాయణపేట నుంచి బదిలీపై వెళ్లిన ఓ జిల్లా స్థాయి అధికారి.. కలెక్టరేట్‌లోని ఓ అధికారి, కోస్గి తహసీల్‌లో పనిచేస్తున్న మరో అధికారి భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్న విషయమూ విదితమే. అయితే తాజాగా ఈ తతంగంలో పాలమూరులో పనిచేసిన మరో సీనియర్ అధికారి ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ధరణి వచ్చిన తర్వాత కిద్మత్ ఇనాంకు సంబంధించి 48 ఎకరాలను ధరణిలో ఇనాందారుడి పేరిట నమోదు చేయడం, ఆ తర్వాత ముందస్తు ఒప్పందం ప్రకారం నకిలీ దస్తావేజులతో ఇనాందారుల వారసులు, అనంతరం హైదరాబాద్ రియల్టర్ల పేరుతో రిజిస్ట్రేషన్ కావడం తెలిసిందే.

రాజకీయ దుమారం..

'సాక్షి'వెలుగులోకి తీసుకొచ్చిన ఈ అక్రమ భూబాగోతం సదరు నియోజకవర్గంలో రాజకీయ దుమారాన్ని రేపింది. ఇప్పటికే ముస్లింలు పార్టీలకతీతంగా వక్ఫ్ భూములను కాపాడాలని పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో చేశారు. దీనిపై ఇటు రెవెన్యూ, అటు వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. రాష్ట్ర ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం రంగంలోకి దిగి అంతర్గతంగా వివరాలు సేకరిస్తుండడంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. 'ఇది పెద్దోళ్ల విషయం.. మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు.. ఆ సమయంలో మేము లేము' అంటూ అధికారులు తప్పించుకుంటున్న తీరు విమర్శలకు తావిస్తోంది. కాగా ఇందులో హైదరాబాద్‌కు చెందిన ఓ బడా నేత ప్రమేయం కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

న్యూస్‌రీల్

అవసరమైతే ఆత్మాహుతి దాడులకూ ప్లాన్!



మధ్యప్రదేశ్ ఏటీఎస్ ఇటీవల హైదరాబాద్–భోపాల్‌లలో అరెస్టు చేసిన 16 మంది ఉగ్రవాదుల కేసులో కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు చేయడానికి ఈ మాడ్యూల్స్ సిద్ధమయ్యాయని ఆధారాలు లభించాయి.

- వివరాలు 14లో▶

'న్యాయశాఖ' నుంచి రిజిజు ఔట్



సుప్రీంకోర్టు కొలీజియంపై తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజును ఆ బాధ్యతల నుంచి మోదీ సర్కార్ తప్పించింది.

- వివరాలు 6లో▶

వీఆర్‌ఏల సర్దుబాటు.. రెగ్యులర్ పేస్కేల్



వీఆర్‌ఏలను ఇతర ప్రభుత్వ శాఖల్లో వెంటనే సర్దుబాటు చేయాలని, వారికి రెగ్యులర్ పేస్కేల్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు.

- వివరాలు 2లో▶

ఏపీలో కోతల్లేని కరెంట్



ఏపీలో ఎన్నడూ లేనంతగా రోజుకు 248 మి.యూనిట్లకు విద్యుత్ వినియోగం పెరిగినా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతోంది. ఎక్కడా విద్యుత్‌కోత అన్న పదానికి తావు లేకుండా సీఎం జగన్ ముందు చూపుతో వ్యవహరించడంతోనే ఇది సాధ్యమైంది.

- వివరాలు 10లో▶



సిద్ధరామయ్యను అభినందిస్తున్న డీకే శివకుమార్



కర్ణాటక సీఎంగా సిద్ధరామయ్య

ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ 6లో

అధికారికంగా ఖరారు చేసిన అధిష్టానం..

- సీఎల్పీ నేతగా సిద్ధరామయ్య ఏకగ్రీవ ఎన్నిక
- గవర్నర్‌ను కలిసిన నేతలు.. ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత
- రేపు మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణ స్వీకారం
- సిద్ధూ, శివకుమార్‌తోపాటు పలువురు మంత్రుల ప్రమాణం
- లోక్‌సభ ఎన్నికల దాకా పీసీసీ అధ్యక్షుడిగా శివకుమార్



మెడ్‌ట్రానిక్ సంస్థ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్‌రంజన్

రూ.3 వేల కోట్లతో 'మెడ్‌ట్రానిక్' విస్తరణ

- రాష్ట్రంలో హెల్త్ కేర్ టెక్నాలజీ రంగానికి ఊతం
- వచ్చే ఐదేళ్లలో 1,500కు పైగా ఉద్యోగాల కల్పన
- మంత్రి కేటీఆర్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

వైద్య పరికరాల ఉత్పత్తి, ఆరోగ్య రక్షణ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెడ్‌ట్రానిక్ సంస్థ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లో రూ.3 వేల కోట్ల పెట్టుబడితో మెడ్‌ట్రానిక్ ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ (ఎంఈఐసీ) కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది.

- వివరాలు 14లో

క్లుప్తంగా...

పార్టీలు మారే వ్యక్తిని కాను

హస్తినలో అమిత్ షా, సునీల్ బన్సల్‌లను కలిశా: ఈటల



సాక్షి, హైదరాబాద్: తాను పార్టీలు మారే వ్యక్తిని కాదని, అప్పటి టీఆర్‌ఎస్ వెళ్లగొడితే బీజేపీ అక్కున చేర్చుకుని తనకు ధైర్యం ఇచ్చిందని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌ను కలసి తెలంగాణలో 17 ఎంపీ సీట్లు సాధించే అంశంపై చర్చించామని తెలిపారు. గురువారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తెలంగాణపై బీజేపీ హైకమాండ్ సీరియస్‌గా ఉందని చెప్పారు. రాష్ట్రంలో అధికార సాధనకు అన్నిరకాల సహాయ, సహకారాలు అందించేందుకు పార్టీ నాయకత్వం సిద్ధంగా ఉందన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చే కార్యాచరణను అందిపుచ్చుకోవడానికి తాము రెడీగా ఉన్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, నాయకులు.. ఒక్క రాష్ట్రంలో గెలవగానే ఏదో ఊహించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. తమతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సీనియర్లు టచ్‌లో ఉన్నారని చెప్పారు.

ఫిరాయింపులపై అప్పుడే రావలసింది

భట్టి పిటిషన్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరినప్పుడే కోర్టును ఆశ్రయించాల్సిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పార్టీ ఫిరాయింపులపై కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినప్పుడే రావలసిందని, ఆలస్యంగా వచ్చిన నేపథ్యంలో విచారించలేమని జస్టిస్ సంజీవ్‌ఖన్నా స్పష్టం చేశారు. మొయినాబాద్ ఫాం కేసుతో జత చేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రావణ్‌కుమార్ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించారు. దీంతో పిటిషనర్ పిటిషన్ ఉపసంహరించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరగా ధర్మాసనం అంగీకరించింది.

యాత్రకు భట్టి విరామం

నవాబుపేట: మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు రోజుల క్రితం జిల్లాలో ప్రవేశించిన సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మరో రెండు రోజుల పాటు విరామం ప్రకటించారు. గురువారం యాత్రకు విరామం ప్రకటించి.. బస చేసిన నవాబుపేట మండలం రుక్కంపల్లిలో విశ్రాంతి తీసుకున్నారు. ప్రత్యేక వైద్యుల బృందం ఆయనను పరీక్షించింది. వందల కిలోమీటర్లు నడవడం వల్ల షుగర్ లెవల్స్ పడిపోయాయని, మరింత విశ్రాంతి అవసరమని సూచించారు. దీంతో శుక్ర, శనివారాలు పాదయాత్రకు విరామం ప్రకటించారు. ఆదివారం రుక్కంపల్లి నుంచి యాత్ర తిరిగి ప్రారంభమవుతుందని టీపీసీసీ నాయకుడు అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు.

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిటిషన్ కొట్టేసిన సుప్రీం



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల అఫిడవిట్‌లో తాను కొన్ని వివరాలు సమర్పించలేదంటూ హైకోర్టులో దాఖలైన పిటిషన్ నుంచి ఉపశమనం కల్పించాలంటూ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ సుధాంశు ధులియాలతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. 2018 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన భార్య పేరుతో ఉన్న భూమి వివరాలతోపాటు ఆయన పేరిట ఉన్న కారు, రూ. 3.51 లక్షల చెల్లింపుల పెండింగ్ వివరాలను పొందుపరచలేదని ఫిర్యాదుదారైన రాఘవేంద్రరాజు తరఫు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. దీనిపై మంత్రి తరఫు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు. వాదనల తర్వాత ధర్మాసనం పిటిషన్‌ను కొట్టేస్తూ మెరిట్స్ ఆధారంగా కేసును పరిష్కరించాలని హైకోర్టుకు సూచించింది. హైకోర్టులో రాఘవేంద్ర రాజు పిటిషన్ జూన్ 7న విచారణకు రానుంది.

శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటల సమయం

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటలు పడుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు, శిలాతోరణం వరకు క్యూలు కొనసాగుతున్నాయి. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఆహారం, పాలు, తాగునీరు అందించేందుకు టీటీడీ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయంలోనే గురువారం మధ్యాహ్నానికి 70,000 మందికి పైగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూల్లో 80,000 మందికి పైగా అన్నప్రసాదాలు అందించారు. క్యూల్లో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం 5 గంటల వరకు 50వేల మంది యాత్రికులు దర్శనం చేసుకున్నారు. అధిక రద్దీ కారణంగా రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్‌ఎస్‌డీ, దివ్య దర్శనం టోకెన్లు ఉన్నవారే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

- రీజినల్ రింగురోడ్డుకు ఇరువైపులా నాయిస్, క్రాష్ బారియర్లుగా వెదురు వినియోగం
- తీవ్రమైన శబ్దాల నుంచి పరిసర ప్రాంతాల వారికి ఉపశమనం ఇచ్చేలా ఉపాయం
- సరికొత్త ప్రయోగానికి ఆసక్తి చూపుతున్న జాతీయ రహదారుల సంస్థ
- వీటితో పర్యావరణానికీ మేలు..



ఇటీవల మహారాష్ట్రలోని వణి-వరేరా జాతీయ రహదారిపై ప్రయోగాత్మకంగా స్టీలుకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన వెదురు క్రాష్ బారియర్

వెదురుతో బారియర్

సౌండ్‌పై వారియర్!

సాక్షి, హైదరాబాద్: అత్యాధునిక ఎక్స్‌ప్రెస్ వేగా నిర్మించనున్న హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్డులో పర్యావరణ అనుకూల విధానాలను అవలంబించే దిశగా జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) కసరత్తు చేపట్టింది. ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనాల ధ్వనిని నియంత్రించే నాయిస్ బారియర్లుగా.. వాహనాలు అదుపుతప్పితే పక్కకు దొర్లిపోకుండా ఆపే క్రాష్ బారియర్లుగా వెదురును వినియోగించాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది.

వేగంగా దూసుకెళ్లే వాహనాల ధ్వని నుంచి..

ఎక్స్‌ప్రెస్ వేలలో వాహనాలు వేగంగా దూసుకుపోతుంటాయి. వాటి నుంచి విపరీతంగా ధ్వని వెలువడుతూ ఉంటుంది. దానికితోడు హారన్‌లు కూడా మోగిస్తుంటారు. నివాస ప్రాంతాలకు దగ్గరగా హైవేలు ఉన్నప్పుడు ఈ ధ్వనితో జనం ఇబ్బంది పడతారు. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు బెదిరిపోతుంటాయి. దీనికి పరిష్కారంగా రోడ్డుకు ఇరువైపులా ధ్వనిని అడ్డుకునే నాయిస్ బారియర్లను ఏర్పాటు చేస్తుంటారు. ధ్వనిని నియంత్రించే గుణమున్న పదార్థాలతో తయారైన మందంగా ఉన్న షీట్లను 3 మీటర్ల ఎత్తుతో ఏర్పాటు చేస్తుంటారు. ఇది ఖర్చుతో కూడుకున్నది. పర్యావరణానికీ మంచిది కాదు. దీనికి పరిష్కారంగా రోడ్లకు ఇరువైపులా కొన్ని రకాల గుబురు చెట్లను నాటి ధ్వనిని నియంత్రించే విధానం ప్రపంచవ్యాప్తంగా వినియోగంలోకి వచ్చింది. ఇలా ధ్వనిని నిరోధించే ప్రక్రియలో వెదురు బాగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ క్రమంలోనే రీజనల్ రింగు రోడ్డుపై నిర్ధారిత ప్రాంతాల్లో రెండు వైపులా ఫర్గేసియా రూఫా, ఫర్గేసియా స్కాబ్రిడా, ఫర్గేసియా రొబస్టా జాతుల వెదురును పెంచాలని భావిస్తున్నారు. ఐదు మీటర్ల ఎత్తు, కనీసం ఐదారు మీటర్ల వెడల్పుతో ఈ చెట్లను పెంచితే.. మూడు మీటర్ల ఎత్తుతో ఏర్పాటు చేసే పటిష్ట క్రాష్ బారియర్‌తో సమానమని నిపుణులు చెప్తున్నారు. కొన్ని హైవేల పక్కన వీటిని ప్రయోగాత్మకంగా నాటేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఇటీవల ఏర్పాట్లు ప్రారంభించింది. అయితే ఈ వెదురుకు వేగంగా, మరీ ఎత్తుగా పెరిగే లక్షణంతో ఉన్నందున.. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వైర్లకు ఆటంకంగా మారొచ్చన్న సందేహాలు ఉన్నాయి. దీనిపై అధికారులు త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశముంది.



రోడ్డుపై అదుపు తప్పే వాహనాలు దిగువకు దూసుకుపోకుండా, మరో లేన్‌లోకి వెళ్లకుండా క్రాష్ బారియర్లు అడ్డుకుంటాయి. సాధారణంగా రోడ్లకు రెండు వైపులా స్టీల్ క్రాష్ బారియర్లను ఏర్పాటు చేస్తారు. ఇప్పుడు వాటి స్థానంలో వెదురుతో చేసిన బారియర్ల ఏర్పాటుపై ప్రయోగాలు మొదలయ్యాయి. రీజనల్ రింగు రోడ్డులో కూడా వీటిని ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న కోణంలో పరిశీలన జరుగుతోంది. మహారాష్ట్రలోని చంద్రాపూర్-యావత్మాల్ జిల్లాలను జోడించే వణి-వరోరా హైవేలో ప్రపంచంలోనే తొలిసారిగా వెదురు క్రాష్ బారియర్లను 200 మీటర్ల మేర ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేశారు.

క్రాష్ బారియర్లుగా కూడా..

బాంబూసా బాల్కోవా జాతి వెదురు దుంగలను క్రమపద్ధతిలో కోసి వాటిని క్రియేసాట్ నూనెతో శుద్ధి చేసి.. రీసైకిల్డ్ హైడెన్సిటీ పాలీ ఇథలీన్ పూత పూసి ఈ బారియర్లను రూపొందించారు. ఇండోర్‌లోని నేషనల్ ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పరీక్షల అనంతరం వీటిని స్టీల్ క్రాష్ బారియర్లకు ప్రత్యామ్నాయంగా వినియోగించొచ్చని తేల్చారు. రీజినల్ రింగురోడ్డులో వీటి ఏర్పాటుపై త్వరలో స్పష్టత రానుంది.

వేగంగా భూసేకరణ..

➤ రీజినల్ రింగ్‌రోడ్డు ఉత్తరభాగానికి సంబంధించి 158.6 కిలోమీటర్ల మేర భూసేకరణ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. పరిహారం జారీ కోసం అవార్డ్ పాస్ చేయటంలో కీలకమైన 3డీ గెజిట్ నోటిఫికేషన్లు కూడా విడుదలవుతున్నాయి. సంగారెడ్డి-తూప్రాన్ మధ్య 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున రెండు ప్యాకేజీలకు మరో నెల రోజుల్లో టెండర్లు జారీ కానున్నాయి. ఆ తర్వాత ఆరు నెలల్లో రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశముంది. దీంతో రోడ్డు డిజైన్లను ఖరారు చేసే పనిని ఎన్‌హెచ్‌ఏఐ సమాంతరంగా ప్రారంభించింది. ఇందులోభాగంగా ప్రయోగాత్మకంగా వెదురును వినియోగించాలని భావిస్తోంది.



గురువారం సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

111 జీవో పూర్తిగా రద్దు

జీవో పరిధిలోని 84 గ్రామాల్లో ఆంక్షలన్నీ తొలగింపు.. ఇకపై హెచ్‌ఎండీఏ నిబంధనలే వర్తింపు

సాక్షి, హైదరాబాద్: ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలు, పరీవాహక ప్రాంతం పరిరక్షణకు ఉద్దేశించిన 111 జీవోను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఎత్తివేసింది. కొన్నేళ్ల కిందటి దాకా హైదరాబాద్ నగర దాహార్తిని తీర్చిన ఈ జలాశయాల పరిరక్షణ కోసం.. వాటి ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో.. అన్ని రకాల నిర్మాణాలను నిషేధిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో ఈ జీవోను జారీ చేసిన విషయం తెలిసిందే. 111 జీవో కారణంగా ఆ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడిందని, ప్రస్తుతం ఈ రిజర్వాయర్ల నీటి అవసరం పెద్దగా లేనందున.. జీవోను రద్దు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. దీని పరిధిలో ఉన్న 84 గ్రామాల్లో ఇకపై ఎలాంటి ఆంక్షలు ఉండవని.. 'హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ)'కు సంబంధించిన విధివిధానాలు, నిబంధనలే వర్తిస్తాయని ప్రకటించింది. గురువారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన నూతన సచివాలయంలో తొలిసారిగా సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం మంత్రులు గంగుల, తలసాని, వేముల, మల్లారెడ్డిలతో కలసి మంత్రి హరీశ్‌రావు కేబినెట్ భేటీ వివరాలను వెల్లడించారు.

నీటి కోసం ఇబ్బంది లేదని..

హైదరాబాద్ చుట్టుపక్కల అంతా అభివృద్ధి జరుగుతుంటే తమ గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయని 111 జీవో పరిధిలోని 84 గ్రామాల ప్రజలు చాలా కాలం నుంచి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గతంలో వారికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకే 111 జీవోను పూర్తిగా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. హైదరాబాద్ నగరానికి ఇప్పుడు గోదావరి, కృష్ణా, మంజీరా నదుల నుంచి సరిపడా నీళ్లు వస్తున్నాయని.. నీటికి ఎలాంటి ఇబ్బంది లేదని పేర్కొన్నారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణతోపాటు కాలుష్యం బారిపడకుండా.. వాటి చుట్టూ రింగ్ మెయిన్, ఎస్టీపీల నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని కేబినెట్ నిర్ణయించిందని వివరించారు. హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి, చేవెళ్ల రోడ్లను 150 అడుగుల నుంచి 200 అడుగులకు విస్తరించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

కాళేశ్వరంతో జంట జలాశయాలు, మూసీ అనుసంధానం

రాబోయే రోజుల్లో కొండపోచమ్మ సాగర్ నుంచి కాళేశ్వరం (గోదావరి) జలాలతో మూసీ, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను అనుసంధానించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరంతో అనుసంధానం చేసి మూసీని స్వచ్ఛమైన నదిగా మార్చాలని సూచించారన్నారు. మురికి కూపంగా మారిన హుస్సేన్‌సాగర్‌ను సైతం రాబోయే రోజుల్లో గోదావరి జలాలతో అనుసంధానం చేయడానికి అవసరమైన విధి విధానాలు, డిజైన్లను రూపొందించనున్నట్టు తెలిపారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు

రాష్ట్రం 10వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్టు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గత 9 ఏళ్లలో సాధించిన విజయాల ఫలాలను అందుకుంటున్న ప్రజలను భాగస్వాములను చేస్తూ 21 రోజులపాటు ఉత్సవాలు నిర్వహించేందుకు వీలుగా విధివిధానాలు ఖరారు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారన్నారు.

వైద్యారోగ్య శాఖ పునర్వ్యవస్థీకరణ

కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖను పునర్వ్యవస్థీకరించే దిశగా మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. 33 జిల్లాలకు జిల్లా వైద్యారోగ్య అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) పోస్టుల తోపాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని 6 జోన్లకు ఆరు పోస్టులు కలిపి.. మొత్తంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ పోస్టుల సంఖ్యను 38కి పెంచాలని నిర్ణయించింది. ఇక రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 40 మండలాలకు పీహెచ్‌సీలను మంజూరు చేసింది. రాష్ట్రంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రస్తుతం కాంట్రాక్టు ఉద్యోగులే పనిచేస్తుండగా.. శాశ్వత నియామకాలు జరపాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాలతో రాష్ట్రంలో ప్రాథమిక వైద్య సేవలు బలోపేతం అవుతాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

పంట కాలం.. నెల ముందుకు..

అకాల వర్షాలు, వడగళ్ల వానలతో ఈ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో.. రాష్ట్రంలో పంట కాలాన్ని నెల రోజుల పాటు ముందుకు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అకాల వర్షాలు కురిసే ఏప్రిల్‌లో కాకుండా మార్చి నెలాఖరులోగానే రైతులు పంట కోతలు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేయనుంది. వచ్చే వానాకాలం పంటలను ఒక నెల ముందుకు జరిపితే.. యాసంగి పంట కూడా నెల ముందుకు జరుగుతుందని, రైతులు నష్టపోకుండా కాపాడుకోవచ్చని మంత్రి హరీశ్ తెలిపారు. ఈ దిశగా వ్యవసాయ రంగంలో మార్పులు, రైతులను చైతన్యవంతం చేయడంపై వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో మంత్రులు గంగుల, ఎర్రబెల్లి, పువ్వాడ, మల్లారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డిలతో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

కేబినెట్ ఇతర నిర్ణయాలివీ..

- రాష్ట్రంలో ఎవరు, ఎక్కడ నకిలీ విత్తనాలు అమ్మినా పీడీ యాక్టు కింద అరెస్టు చేయాలని డీజీపీ, సీఎస్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించారు.
- మక్కలు, జొన్నల ధర తగ్గి రైతులు నష్టపోతుండటంతో కొనుగోళ్లకు వ్యవసాయశాఖ, పౌరసరఫరాల శాఖలకు అనుమతి ఇచ్చింది.
- నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో ఉమామహేశ్వర ఎత్తిపోతల పథకం మొదటి, రెండో విడత పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.
- రెండో విడత గొర్రెల పంపిణీని 10, 15 రోజుల్లో ప్రారంభించాలని.. కేంద్రం నుంచి ఇబ్బందులున్నా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవాలని కేబినెట్ నిర్ణయించింది.



కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో తలసాని, గంగుల

- రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది.
- ఖమ్మంలో జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ఖమ్మం జర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి 23 ఎకరాలను కేటాయించింది. వనపర్తిలో జర్నలిస్టు అసోసియేషన్ భవనానికి స్థలాన్ని కేటాయించింది.
- మైనారిటీ కమిషన్‌లో జైనులకు ప్రాతినిధ్యం కల్పించాలని నిర్ణయించింది.
- టీఎస్‌పీఎస్సీని బలోపేతం చేసేందుకు కొత్తగా 10 పోస్టులు మంజూరు చేసింది.
- వనపర్తి జిల్లా గణపురం మండలం కర్నె తండాకు పీహెచ్‌సీ, 8 పోస్టులు మంజూరు.
- నిర్మల్ జిల్లా ముధోల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 27 పోస్టులను మంజూరు చేసింది.
- ఇటీవల గవర్నర్ తిరస్కరించిన బిల్లులను మళ్లీ ఆమోదించి పంపేందుకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించాలని మంత్రివర్గం ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది.
- గవర్నర్ కోటాలో ఖాళీ అవుతున్న రెండు ఎమ్మెల్సీ సీట్లకు అభ్యర్థుల ఖరారు కోసం త్వరలో మరోసారి కేబినెట్ భేటీ నిర్వహించాలని.. అలా సాధ్యం కాకుంటే సర్క్యులేషన్ విధానంలో ఆమోదించి గవర్నర్‌కు సిఫార్సు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం.

కాంగ్రెస్‌లోకి తిరిగి రండి!

పార్టీని వీడిన నేతలకు రేవంత్‌రెడ్డి పిలుపు

- తెలంగాణ అభ్యున్నతికి పని చేయాలనుకునే వారు కాంగ్రెస్‌తో కలిసి రావాలి
- కేసీఆర్‌కు వ్యతిరేకంగా పునరేకీకరణ జరగాలి.. బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటే
- మోదీ, అమిత్‌షా కుట్రలను కర్ణాటక ప్రజలు తిప్పికొట్టారన్న టీపీసీసీ చీఫ్
- ఓటమి తప్పదని కేసీఆర్‌కు అర్థమైందని వ్యాఖ్య



మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పక్కన షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: 'వివేక్, ఈటల, రాజగోపాల్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డిలు బీజేపీ సిద్ధాంతాలను నమ్మరు. వారిని బీజేపీ నమ్మదు. వాళ్ళు క్షణికావేశంలో బీజేపీలో చేరారు. కేసీఆర్‌ను ఓడించడం బీజేపీతో కాదు. ఆ మాటకొస్తే బీజేపీ, కేసీఆర్ వేర్వేరు కాదు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా పునరేకీకరణ జరగాల్సిన అవసరం ఉంది. అందుకోసం కాంగ్రెస్ నుంచి వెళ్లిన వారు తిరిగి సొంతగూటికి రావాలి..' అని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అమ్మలాంటిదని, తెలంగాణ అభ్యున్నతికి పని చేయాలనుకునే వారు కాంగ్రెస్‌తో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి తాను నాయకుడిని కాదని, సోనియా, ఖర్గేలే నాయకులని అన్నారు. తన వల్ల ఇబ్బంది అవుతుందనుకుంటే.. ఒక మెట్టు కాదు పది మెట్లు దిగడానికి కూడా సిద్ధమని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ వల్లే టీఆర్‌ఎస్ ఎదిగింది..

'తెలంగాణ ఏర్పాటు విషయంలో అన్ని రకాల త్యాగాలు చేసిన పార్టీ కాంగ్రెస్. ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. ఒకవేళ కాంగ్రెస్ రాష్ట్రం ఇవ్వకపోతే కేసీఆర్ కుటుంబం బిచ్చమెత్తుకొని బతకాల్సి వచ్చేది. 2004లో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం వల్లనే టీఆర్‌ఎస్ పార్టీ ఎదిగింది. 2006లో కేంద్రంలో కేసీఆర్‌ను కేంద్ర మంత్రిని చేసి, సాగర్, శ్రీశైలం, జూరాల వంటి ప్రాజెక్టులతో పాటు ఓఆర్‌ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో రైలు వంటి ప్రాజెక్టులను కాంగ్రెస్ తెచ్చింది' అని రేవంత్ అన్నారు.

మోదీ, కేసీఆర్ బ్రాండ్లకు చెల్లిన కాలం

'దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ బ్రాండ్లకు కాలం చెల్లింది. మోదీని ఓడించవచ్చునని కర్ణాటక ఎన్నికల ఫలితాలతో తేలిపోయింది. కర్ణాటకలో మోదీ, అమిత్ షా 20 రోజులు ప్రచారం చేశారు. జై బజరంగభళి, హిజాబ్ వంటి అంశాలతో మత విద్వేషాలు రగిల్చే ప్రయత్నం చేశారు. లింగాయత్‌ల మధ్య చిచ్చు పెట్టేందుకు యత్నించారు. వారి కుట్రలను తిప్పికొట్టి కర్ణాటకలో కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారు. కర్ణాటక ఎన్నికల్లో మోదీని ఓడిస్తానని పెద్ద పెద్ద మాటలు చెప్పిన కేసీఆర్, జేడీఎస్‌కు మద్దతుగా నిలిచి హంగ్ తీసుకువచ్చి బీజేపీని అధికారంలో కూర్చోపెట్టాలని ప్రయత్నించారు. అన్ని రకాల ఒత్తిళ్లను ఎదుర్కొని అక్కడి ప్రజలు ప్రజాస్వామ్యానికి అండగా నిలిచారు. కర్ణాటక ఫలితాలపై దేశం నలుమూలలా చర్చ జరుగుతోంది' అని చెప్పారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ రెండూ ఒకటే

'కర్ణాటక ఫలితాలను పెద్దగా పట్టించుకోనవసరం లేదని, అవి తెలంగాణ మీద ప్రభావం చూపవని చెప్పిన బండి సంజయ్ మాటలనే.. నాలుగు రోజుల తర్వాత కేసీఆర్ చెప్పారు. అక్కడ మోదీ ఓటమిని గుర్తించడానికి కూడా కేసీఆర్‌కు మనసొప్పలేదు. ఇన్నాళ్లూ మోదీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు మాట మార్చారు. కర్ణాటకలో బీజేపీ చేసిందే తెలంగాణలో కేసీఆర్ చేస్తున్నారు. అక్కడ బీజేపీ ప్రభుత్వం కాంట్రాక్టర్ల నుంచి 40 శాతం కమీషన్ తీసుకుంటే, ఇక్కడ కూడా కేసీఆర్ కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు దండుకుంటున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకే తాను ముక్కలు తప్ప వేర్వేరు కాదు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చేందుకే వేర్వేరు అన్నట్టుగా నాటకమాడుతున్నారని..' ధ్వజమెత్తారు.

ఓటమి అర్థమై ఎమ్మెల్యేలపై నెపం.


'సీఎం కేసీఆర్‌కు ఓటమి తప్పదని అర్థమైంది. అందుకే నెపాన్ని ఎమ్మెల్యేలపై వేస్తున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం పేరిట రూ.200 కోట్ల ప్రజాధనంతో ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలు ఇవ్వడమేంటి? రాష్ట్ర అవతరణ దినోత్సవానికి, ఇతర రాష్ట్రాల్లో ప్రకటనలకు ఏంటి సంబంధం? బీఆర్‌ఎస్ ఖాతాలో ఉన్న రూ.1,300 కోట్లతో ప్రకటనలు ఇచ్చుకుంటే అభ్యంతరం లేదు. కేసీఆర్ ఆధ్వర్యంలో ఇవి చివరి రాష్ట్ర అవతరణ వేడుకలు. తర్వాత జరిగేది కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే..'అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

84 గ్రామాలకు ఊరట

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జీఓ 111ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. తద్వారా మొయినాబాద్, శంకర్‌పల్లి, శంషాబాద్, షాబాద్, గండిపేట్, చేవెళ్ల మండలాల పరిధిలోని 84 గ్రామాలకు భారీ ఊరట లభించింది. ఇకపై ఆయా గ్రామాల్లో హెచ్‌ఎండీఏ విధివిధానాలే అమల్లో ఉంటాయని పేర్కొంది. ఈ మేరకు గురువారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న ఈ నిర్ణయంపై ఆయా గ్రామాల్లోని రైతులు, సాధారణ పజ్రలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఐటీ హబ్‌గా అవతరించిన గచ్చిబౌలికి సమీపంలో ఆయా గ్రామాలు ఉండటం, ఆంక్షల ఎత్తివేత ద్వారా 1.30 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ సమకూరడం, దీనిలో 30 వేలకు పైగా ఎకరాల ప్రభుత్వ భూములు ఉండటం కలిసి వచ్చే అంశం. కాగా.. సుప్రీం కోర్టు, జాతీయ హరిత ట్రిబ్యూనళ్లలో కేసులు ఇప్పటికీ కొనసాగుతుండటం గమనార్హం.

గత ఏడాది ఏప్రిల్‌లోనే ప్రకటన..

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిరక్షణ కోసం 1996లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 111 జీఓను తీసుకొచ్చింది. జంట జలాశయాల చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలోని 1.32 లక్షల ఎకరాల భూమిని ఈ జీఓ పరిధిలో చేర్చింది. ఆంక్షల కారణంగా స్థానికులు తమ సొంత భూముల్లో ఇళ్లు కట్టుకోలేని దుస్థితి ఏర్పడింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు కూడా తక్కువగా ఉండేవి. స్థానిక ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. పర్యావరణ వేత్తలు ఎన్‌జీటీలోనూ, సుప్రీంకోర్టుల్లో కేసులు వేయడంతో ఇప్పటి వరకు ఆంక్షలు కొనసాగుతూ వచ్చాయి. అభివృద్ధికి విఘాతంగా మారిన 111 జీఓను రద్దు చేస్తున్నట్లు 2022 ఏప్రిల్ 19న సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారు. దీని స్థానంలో కొత్తగా జీఓ నంబర్ 69ని తీసుకొచ్చారు. ఈ మేరకు ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎలాంటి ముందడుగు పడలేదు. మరోవైపు జీఓ అమలులో ఉందో లేదో తెలియక అధికారులు కూడా కొంత అయోమయంలో పడ్డారు. తాజాగా కేబినేట్ నిర్ణయంతో ఈ విషయంలో ఒక స్పష్టత వచ్చినట్టైంది.



సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు చెబుతున్న వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులు. చిత్రంలో సీసీఎల్‌ఏ నవీన్ మిత్తల్, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

వీఆర్‌ఏల సర్దుబాటు.. రెగ్యులర్ పేస్కేల్

- వారి సమస్యలను మానవత్వంతో పరిష్కరించాలని నిర్ణయించాం: సీఎం కేసీఆర్
- విద్యార్హతల ఆధారంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో నియామకాలు
- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల లోపు ప్రక్రియ పూర్తి

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏల)ను ఇతర ప్రభుత్వ శాఖల్లో వెంటనే సర్దుబాటు చేయాలని, వారికి రెగ్యులర్ పేస్కేల్ వర్తించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల లోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్న అనంతరం వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులను సీఎం కేసీఆర్ తన చాంబర్‌కు ఆహ్వానించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వీఆర్‌ఏల సమస్యలను మానవత్వంతో వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ఉందన్నారు. మొత్తం సమాచారాన్ని అధికారులకు అందజేయాలని వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులకు సూచించారు.

విద్యార్హతలు.. అవసరం ఆధారంగా..

సుమారు 20వేల మంది ఉన్న వీఆర్‌ఏలలో ముందుగా మెడికల్ ఇన్వాలిడేషన్ కింద దరఖాస్తు చేసుకున్న వారసుల వివరాలు, వారి విద్యార్హతలను సేకరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. మిగతా వారిని విద్యార్హతల ఆధారంగా పురపాలక, నీటి పారుదల (లష్కర్లు), రెవెన్యూ, జిల్లా పరిషత్, విద్యా, వైద్య కళాశాలలు, మిషన్ భగీరథ తదితర అవసరమైన శాఖల్లో నియమించాలని.. వారికి పేస్కేల్ ఇస్తూ, తదుపరి ప్రమోషన్ వచ్చే విధంగా సర్దుబాటు చేయాలని రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు. వీఆర్‌ఏలకు విద్యార్హతలను బట్టి నచ్చిన శాఖను ఎంచుకునే అవకాశం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో అన్ని విషయాల్లో సమన్వయం చేయాలని ఎమ్మెల్సీ, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, సీఎం ప్రధాన సలహాదారు సోమేశ్‌కుమార్, పలువురు ఉన్నతాధికారులు, వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో కొనసాగించాలి: ట్రెసా

వీఆర్‌ఏలను క్రమబద్ధీకరిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) హర్షం వ్యక్తం చేసింది. అయితే.. రెవెన్యూ శాఖలో పనిభారం, గ్రామస్థాయిలో పరిపాలన సజావుగా సాగే అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని కోరింది. ఈ మేరకు ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు.

సీఎంకు ధన్యవాదాలు..

మంత్రివర్గంలో నిర్ణయం తీసుకొని తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినందుకు సీఎం కేసీఆర్‌కు వీఆర్‌ఏ జేఏసీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

నెట్ స్పీడ్‌లో ఎవరెక్కడ?

ఇంటర్నెట్ లేనిదే నిమిషం గడవని పరిస్థితి. ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఆన్‌లైన్ చదువుల దాకా.. ఆర్థిక లావాదేవీల నుంచి నిత్యావసరాల బుకింగ్ దాకా.. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్లెట్, కంప్యూటర్.. ఏదైనా ఇంటర్నెట్ అత్యవసరంగా మారిపోయింది. ఈ ఇంటర్నెట్ ఎంత వేగంగా ఉంటే.. మన పని అంత వేగంగా పూర్తవుతుంది. ఈ క్రమంలో ఊక్లా సంస్థకు చెందిన స్పీడ్‌టెస్ట్ వెబ్‌సైట్.. ఏప్రిల్ నెలకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా ఏయే దేశాల్లో సగటు ఇంటర్నెట్ వేగం ఎంత అన్నదానిపై ర్యాంకింగ్స్ ఇచ్చింది.






మొబైల్ నెట్ వేగంలో టాప్-10 దేశాలు

- మొబైల్ ఇంటర్నెట్ విభాగంలో 36.35 ఎంబీపీఎస్ స్పీడ్‌తో భారత్ 60వ స్థానంలో నిలిచింది. మార్చిలో భారత్ ర్యాంకు 64కాగా.. నెలలో నాలుగు స్థానాలు ఎగబాకింది. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో 51.12 ఎంబీపీఎస్‌తో 83వ స్థానంలో నిలిచింది. మార్చితో పోలిస్తే ఒక ర్యాంకు ఎగబాకింది.

ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ వేగంలో టాప్-10 దేశాలు



- మొబైల్ ఇంటర్నెట్‌కు సంబంధించి 138 దేశాలకు ర్యాంకులు ఇవ్వగా.. యెమెన్ (3.38 ఎంబీపీఎస్), అఫ్గానిస్తాన్ (4.46), క్యూబా (4.48), వెనెజువెలా (6.90), హైతీ (8.03) అట్టడుగు స్థానాల్లో నిలిచాయి.
- ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్‌కు సంబంధించి 180 దేశాలకు ర్యాంకులు ఇవ్వగా.. క్యూబా (1.97 ఎంబీపీఎస్), అఫ్గానిస్తాన్ (2.31), సిరియా (3.93), తుర్క్‌మెనిస్తాన్ (4.03), యెమెన్ (4.29) అట్టడుగు స్థానాల్లో నిలిచాయి.
- ప్రపంచవ్యాప్తంగా సగటున మొబైల్ ఇంటర్నెట్ వేగం 42.07 ఎంబీపీఎస్‌కాగా.. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ వేగం 80.12 ఎంబీపీఎస్ కావడం గమనార్హం.
- ప్రపంచంలో సగటున 100 ఎంబీపీఎస్ కంటే ఎక్కువ నెట్ స్పీడ్‌ను పరిగణనలోకి తీసుకుంటే.. మొబైల్ ఇంటర్నెట్‌లో కేవలం పది దేశాలు, ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్‌లో కేవలం 33 దేశాలు మాత్రమే ఈ వేగాన్ని అందుకున్నాయి.

- సాక్షి, సెంట్రల్ డెస్క్


మాట్లాడుతున్న సదానంద గౌడ్

వేసవి సెలవుల్లోపే బదిలీలు చేపట్టాలి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను వేసవి సెలవుల్లోపే చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) డిమాండ్ చేసింది. జాక్టో సమావేశం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. మోడల్ స్కూల్, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు ఇవ్వకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని జాక్టో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నైట్ వాచ్‌మన్, స్కావెంజర్, సర్వీస్ పర్సన్‌లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరింది. సమావేశంలో జాక్టో చైర్మన్ సదానంద గౌడ్, ప్రధానోపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షుడు గుండం మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక.. భర్తను హత్య చేసిన భార్య

దుండిగల్: వేధింపులు తాళలేక ఓ మహిళ తన భర్తను హత్య చేసింది. పోలీసుల కథనం మేరకు.. బీహార్‌కు చెందిన మనోజ్ చౌహాన్(35) అదే ప్రాంతానికి చెందిన లక్ష్మి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గత ఏడాదిగా మనోజ్ పాలిష్ బండల కంపెనీలో పని చేస్తూ మేడ్చెల్ జిల్లా బౌరంపేటలోని సతీష్ సొసైటీలో నివాసముంటున్నాడు. భార్య తరుచూ ఓ వ్యక్తితో ఫోన్లో మాట్లాడుతుండడాన్ని గమనించిన మనోజ్ పలుమార్లు ఆమెను మందలించాడు. ఇదే విషయంపై ఇరువురి మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఈ నెల 14న వారి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో లక్ష్మి మద్యం సేవించి నిద్రిస్తున్న మనోజ్ తలపై బండరాయితో మోది హత్య చేసింది.



గురుకుల దరఖాస్తుకూ 'పరీక్షే'!

- ప్రహసనంగా మారిన వన్ టైమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- హెల్ప్‌డెస్క్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించని వైనం
- సర్వర్ సమస్యతో పెద్దసంఖ్యలో దరఖాస్తుకు దూరమైన అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్: గురుకుల ఉద్యోగాల దరఖాస్తు ప్రక్రియ ప్రహసనంగా మారింది. నోటిఫికేషన్లు జారీచేసి నెలైనా సాంకేతిక సమస్యలు తీరకపోవడంతో అభ్యర్థులు సతమతమవుతున్నారు. వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ (ఓటీఆర్)లో తలెత్తుతున్న సమస్యలతో దరఖాస్తు ప్రక్రియ ముందుకు సాగట్లేదు. ఒకే అభ్యర్థి పలు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే ప్రతిసారీ వివరాలు నమోదు కష్టమని భావించి తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) ఈ విధానాన్ని తెచ్చింది. ఈ క్రమంలోనే బోర్డు గత నెల 5న 9 ఉద్యోగ ప్రకటనలు జారీచేయగా.. ఏప్రిల్ 17 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. కానీ ఓటీఆర్, దరఖాస్తు ప్రక్రియలోని సాంకేతిక సమస్యలు అభ్యర్థులను చికాకుపెడుతున్నాయి.

'దరఖాస్తు'కే చుక్కెదురు..

సంక్షేమ గురుకులాల్లో 9 కేటగిరీల్లో ఉద్యోగాల భర్తీకి తొమ్మిది నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. ఇందులో జేఎల్, డీఎల్ తదితర పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ ఈనెల 17తో ముగిసింది. గురుకుల పాఠశాలల్లో టీజీటీ, పీజీటీ తదితర పోస్టులకు దరఖాస్తు గడువు వచ్చే వారంలో ముగియనుంది. అయితే, ఆయా పోస్టులకు తొలి వారం రోజులు సర్వర్ సమస్యలతో దరఖాస్తు ప్రక్రియ నెమ్మదించింది. పెద్దసంఖ్యలో యూజర్లు వెబ్‌సైట్‌ను తెరవడంతో సర్వర్‌పై ఒత్తిడి పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కానీ, దరఖాస్తు గడువు ముగిసే వరకు కూడా సాంకేతిక సమస్యలు అలాగే ఉండడంతో చాలామంది దరఖాస్తు చేయలేకపోయారు. కనీసం గురుకుల పాఠశాలల్లో కొలువులకు దరఖాస్తు ప్రక్రియలోనైనా సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఇక, దరఖాస్తు, ఇతర సాంకేతిక సమస్యలపై క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి గురుకుల బోర్డు ఫోన్‌నంబర్, ఈ-మెయిల్‌తో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేసింది. అయితే ఇది వినతుల స్వీకరణకే పరిమితమైందని అభ్యర్థులు మండిపడుతున్నారు. ఎన్నిసార్లు ఫోన్లుచేసినా స్పందించట్లేదని బోర్డుకు ఫిర్యాదులు అందుతున్నాయి.

వారం పట్టింది

గురుకులాల్లో జూనియర్, డిగ్రీ లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తుకు వారం పట్టింది. ఓటీఆర్ కోసం వరుసగా ఐదురోజుల పాటు ప్రయత్నించాను. ఏడాదిన్నరగా జేఎల్, డీఎల్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతుండగా.. కేవలం దరఖాస్తు ప్రక్రియే కష్టమైపోయింది.

– డి.నర్సింగ్‌రావు, కొడంగల్, వికారాబాద్ జిల్లా

ఓటీఆర్ నమోదు కాక దరఖాస్తుకు దూరమయ్యాను

ఓటీఆర్ కోసం పదిరోజులు ప్రయత్నించాను. మాసాబ్‌ట్యాంక్‌లోని బోర్డు కార్యాలయానికి వెళ్లి చెప్పాను. ప్రయోజనం లేకపోగా, చివరకు దరఖాస్తు చేయకుండానే జేఎల్, డీఎల్ గడువు ముగిసిపోయింది. గడువును వారమైనా పొడిగించాలి.

– దీపురు ప్రవీణ్‌కుమార్, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా

నేడు, రేపు అక్కడక్కడా తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: తూర్పు మధ్యప్రదేశ్ నుంచి విదర్భ మీదుగా తెలంగాణ వరకు ఉపరితల ద్రోణి ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్రమట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ ప్రాంత జిల్లాల్లో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. రెండ్రోజులపాటు రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. గురువారం గరిష్ట ఉష్ణోగ్రత నల్లగొండలో 44.0 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 23.0 డిగ్రీలు నమోదైంది. రాష్ట్రానికి వాయవ్య దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

ఏపీలో మండుతున్న సూరీడు

సాక్షి, అమరావతి: ఏపీలో అధిక ఉష్ణోగ్రతలకు తోడు వేడిగాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరులో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు, శ్రీకాకుళం, వైఎస్సార్ జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. అత్యల్పంగా విశాఖపట్నం (గంభీరం)లో 38.9, కోనసీమ అంబేడ్కర్ జిల్లా(అంగర)లో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం, వల్లూరు మండలంలో తీవ్ర వడగాడ్పులు వీచాయని, మరో 27 మండలాల్లో వడగాడ్పులు వీచాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం 29 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉండనుంది. అనకాపల్లి జిల్లాలో 5, గుంటూరులో ఒకటి, కాకినాడలో ఒకటి 1, ఎన్టీఆర్ జిల్లాలో 2, పల్నాడులో 2, మన్యంలో 5, విజయనగరంలో 5, వైఎస్సార్ జిల్లాలో 8 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. శనివారమూ 33 మండలాల్లో వడగాడ్పులు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

గురువారం రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
నిడమనూరు	నల్లగొండ	45.9
తనుగుల	కరీంనగర్	45.6
దామరచర్ల	నల్లగొండ	45.5
వీణవంక	కరీంనగర్	45.4
కీతవారిగూడెం	సూర్యాపేట	45.4
ఇబ్రహీంపేట	నల్లగొండ	45.2
మాటూర్	నల్లగొండ	45.2
నేలకొండపల్లి	ఖమ్మం	45.1

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
నల్లగొండ	44.0	25.0	మహబూబ్‌నగర్	41.1	28.1
రామగుండం	42.4	25.6	హనుమకొండ	41.0	30.5
ఆదిలాబాద్	42.0	24.2	హైదరాబాద్	40.5	26.5
నిజామాబాద్	41.7	27.5	భద్రాచలం	39.8	29.0
మెదక్	41.6	23.0	దుండిగల్	39.6	24.3
ఖమ్మం	41.6	30.0	హకీంపేట్	39.5	25.6

29న చలో ఇందిరాపార్కు

సాక్షి, హైదరాబాద్: దళితబంధులో ఎస్సీ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎస్సీల్లోని అన్ని వర్గాలకు న్యాయం జరగాలని, అందరికీ అర్హత కల్పించాలనే డిమాండ్‌తో 29న 'చలో ఇందిరాపార్కు' కార్యక్రమాన్ని తలపెట్టినట్లు ఎస్సీయూకేఐవీ తెలిపింది. ఒక ట్రెండు కులాల వారికే దళితబంధు అందుతోందన్నారు.

సీఎం హామీ కూడా నెరవేరకపోవడం దురదృష్టకరం

- జర్నలిస్టుల ఇళ్ల సమస్యపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ఫలితం లేదు: ప్రొఫెసర్ కోదండరాం
- వైఎస్ఆర్ జర్నలిస్టులకు 70 ఎకరాలిస్తే కేసీఆర్ ఎకరం కూడా పంచలేదు: షర్మిల
- ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో టీడబ్ల్యూజేఎఫ్ మహాధర్నా


మహాధర్నాలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం. చిత్రంలో షర్మిల, జర్నలిస్టు నేతలు

కవాడిగూడ/సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల ఇళ్ల సమస్యలపై సీఎం హామీ ఇచ్చినా నేటికీ అమలుకు నోచుకోకపోవడం బాధాకరమని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. గురువారం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన మహాధర్నాకు కాంగ్రెస్, వైఎస్ఆర్‌టీపీ, సీపీఎం, టీజేఎస్ మద్దతు తెలిపాయి. అనంతరం తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. నాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం 70 ఎకరాల స్థలం కేటాయిస్తే సాంకేతిక కారణాలు చూపుతూ అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. టీడబ్ల్యూజేఎఫ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పిల్లి రాంచందర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో టీపీసీసీ అధికార ప్రతినిధి శ్యామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, కోశాధికారి రాచమళ్ల వెంకటేశ్వర్లు, ఫెడరేషన్ నేతలు రాజశేఖర్, రఘు, హెచ్‌యూజే అధ్యక్ష కార్యదర్శులు అరుణ్‌కుమార్, జగదీశ్, నవీన్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు చెప్పినా ఇవ్వరా?

వేల ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముతున్న కేసీఆర్ ప్రభుత్వం.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా వేధిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. గురువారం జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం జరిగిన మహాధర్నాకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ మేరకు ట్విట్టర్ ద్వారా ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. సుప్రీంకోర్టు కేసు క్లియర్ అయిన తర్వాత కూడా హైదరాబాద్‌లో కేటాయించిన స్థలాలను జర్నలిస్టులకు ఇవ్వడం లేదని విచారం వ్యక్తంచేశారు.

వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో 20 వేల మందికి ఉద్యోగాలు

అక్టోబర్‌లోగా దశలవారీగా నియామకాలు
వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌పై మంత్రి ఎర్రబెల్లి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: వరంగల్ టెక్స్‌టైల్ పార్క్ (డబ్ల్యూటీపీ)లో 20వేల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించే అవకాశాలున్నాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 2వేల మందికి తక్షణమే జీవనోపాధి లభిస్తుందని, వీటిని దశల వారీగా అక్టోబర్‌లోగా దశలవారీగా నియామకాలు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని తన పేషీలో సంబంధిత అధికారులు, టెక్స్‌టైల్ పార్క్ కంపెనీల ప్రతినిధులతో ఎర్రబెల్లి సమీక్ష నిర్వహించారు. వరంగల్‌లో ఏర్పాటైన మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో అనేక కంపెనీలు ఇప్పటికే తమ ఉత్పత్తులను ప్రారంభించి తమకు అవసరమైన ఉద్యోగులను నియమించుకున్నాయని, త్వరలోనే మరికొంతమందికి ఉపాధి కల్పిస్తాయని తెలిపారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మంచి అవకాశాలున్నాయని, పాలకుర్తి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ఇప్పటికే రెండు విడతలుగా వెయ్యి మందికి శిక్షణనిచ్చామని, మరో రెండు వేలమందికి సెప్టెంబరు నాటికి శిక్షణ పూర్తవుతుందని తెలిపారు. గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు యూనిఫామ్స్ వంటి ఆర్డర్లు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు అప్పగించేందుకు ఆయా శాఖలకు లేఖలు రాస్తున్నట్లు వివరించారు. సమీక్షలో టీఎస్ ఐఐసీ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ మిహిద్, టెక్స్ టైల్స్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేశం, వరంగల్‌లోని కీటెక్స్ కంపెనీ ప్రతినిధి మనోజ్ కుమార్, యంగ్‌వన్ కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ పాల్గొన్నారు.


నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి, మహమూద్ అలీ తదితరులు

నిఖత్ జరీన్‌కు రూ. 2 కోట్లు

'ఒలింపిక్స్' శిక్షణ కోసం సాయం ప్రకటించిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ రాబోయే ఒలింపిక్స్ క్రీడల్లో స్వర్ణపతకాన్ని సాధించి తెలంగాణతోపాటు భారత దేశ ఘనకీర్తిని మరోసారి విశ్వానికి చాటాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆకాంక్షించారు. నిఖత్ జరీన్‌కు రాబోయే ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. గురువారం సచివాలయంలో నిఖత్ జరీన్, సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒలింపిక్ క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ, ప్రయాణ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రూ.2 కోట్లను ప్రకటించారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వి.శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, బాల్క సుమన్, విఠల్ రెడ్డి, సీఎంవో కార్యదర్శి భూపాల్ రెడ్డి, క్రీడాశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నిఖత్ జరీన్‌ను సందీప్ కుమార్ సుల్తానియా సచివాలయంలోని తన చాంబర్‌లో నిఖత్‌కు శాలువా కప్పి సత్కరించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నేడు జస్టిస్ పీకే మిశ్రా ప్రమాణ స్వీకారం

కొలీజియం సిఫార్సుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పీకే మిశ్రా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం ఇటీవల ఇద్దరు న్యాయమూర్తులను నియమించాలంటూ పేర్లు సిఫార్సు చేసిన విషయం విదితమే. ఈ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారని న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ గురువారం అర్ధరాత్రి ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జస్టిస్ పీకే మిశ్రా, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్‌లతో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రధాన ధర్మాసనం కోర్టులో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

ప్రపంచం అన్నది మూడే రోజులు. నిన్నటి విషయానికి వస్తే అది అదృశ్యమై పోయింది. రేపు అన్న దానిని మీరు ఎన్నటికీ చూడకపోవచ్చు. ఇక ఈ రోజు విషయానికి వస్తే ఇది మీదే. కాబట్టి దానిపై పని చేయండి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 19 మే 2023

దీర్ఘకాలిక డిజిటల్ ప్రమాదం

కళ్ళ ముందు జరుగుతున్నవి సైతం మరెవరో శాస్త్రీయ సర్వేలతో బలంగా చెబితే మనసుకు ఎక్కుతాయి. ప్రతి చిన్నారి చేతిలో స్మార్ట్‌ఫోన్ కనిపిస్తున్న ఈ రోజుల్లో వాటి ప్రభావం ఎలా ఉంటుందన్న విషయం అలాంటిదే. ఏ వయసులో పిల్లలకు తొలిసారిగా స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ అలవాటైందనే దాన్ని బట్టి పెద్దయ్యాక వారి మానసిక ఆరోగ్యం ఉంటుందన్న తాజా నిర్ధారణ అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది. అమెరికాకు చెందిన సేపియన్ ల్యాబ్స్ సంస్థ సరికొత్త ప్రపంచ సర్వే ఈ కఠిన వాస్తవాన్ని కళ్ళ ముందుంచింది. పరిమితి దాటిన డిజిటల్ స్క్రీన్‌టైమ్, పగ్గాలు లేని సోషల్ మీడియా వినియోగం వల్ల ఒంటరితనం, బాధ, కోపం, చివరకు ఆత్మహత్యను ప్రేరేపిస్తున్న ఆలోచనలు సైతం పెరుగుతున్నాయని ఇప్పటికే అనేక పరిశోధనలు, అధ్యయనాలు తేల్చాయి. తాజా సర్వే సైతం ఈ దీర్ఘకాలిక డిజిటల్ ప్రమాదాన్ని ప్రపంచం ముందుకు తెచ్చింది.

పిల్లలు కళ్ళప్పగించి చూస్తున్న డిజిటల్ తెరలు కంటికే కాదు... పెద్దయ్యే కొద్దీ మనసుకూ చేటు చేస్తున్నాయని సర్వే చేసి ఈ సంస్థ తేల్చింది. ప్రస్తుతం 18 నుంచి 24 ఏళ్ళ వయసులో ఉన్న 28 వేల మంది పాలుపంచుకున్న ఈ సర్వే ప్రకారం మగవారి కన్నా ఆడవారిపై ఈ దుష్ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. చిన్నప్పుడే డిజిటల్ తెరలకు అలవాటు పడ్డవారు ఎదుగుతున్న కొద్దీ విషయ గ్రహణ శక్తి తగ్గి, సామాజిక అలవాట్లు మారుతున్నాయి. 'ఏజ్ ఆఫ్ ఫస్ట్ స్మార్ట్‌ఫోన్ అండ్ మెంటల్ వెల్‌బీయింగ్ అవుట్‌కమ్స్' అనే శీర్షికన వెలువడ్డ ఈ అధ్యయన సారాంశం ఒకటే – స్మార్ట్‌ఫోన్ల వాడకం ఎంత నిదానిస్తే, పిల్లల మానసిక ఆరోగ్యం అంత మెరుగ్గా ఉంటుంది. లేదంటే, భ్రమల్లో బతకడం, దుడుకుగా వ్యవహరించడం, ఆత్మహత్య ఆలోచనల లాంటివి హెచ్చుతాయి. దక్షిణాసియా సహా అనేక ప్రాంతాల్లో పరిస్థితి ఇదేనట. అంటే, భారత్‌కూ ఇదే వర్తిస్తుంది.

ఇరవై కోట్ల మందికి పైగా 15 నుంచి 25 ఏళ్ళ మధ్యవారున్న దేశంలో పాఠశాలల నుంచి పని ప్రదేశాల దాకా అన్నిచోట్లా ప్రభావం చూపే అంశమిది. అందుకనే ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం లాంటి అంశాలతో పాటు స్మార్ట్‌ఫోన్ల వినియోగానికి అనుమతించే వయసుపైనా దృష్టి పెట్టాలని ఓ వాదన. భారత్‌లో నూటికి 94 ఇళ్ళలో కనీసం ఒక మొబైల్ ఫోన్ ఉందని 2019– 21 నాటి 'జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే'. కరోనా అనంతరం ఫోన్లతో పాటు ఇంటర్నెట్ వినియోగమూ పెరిగింది. పిల్లలు డిజిటల్ స్క్రీన్లు చూసే సమయం కరోనా కాలానికి ముందుతో పోలిస్తే, రెట్టింపు దాటింది. 2020 – 2022 మధ్య 12 నుంచి 18 ఏళ్ళ లోపు పిల్లల స్క్రీన్‌టైమ్ 52 శాతం పెరిగిందని గత నవంబర్‌లో ఓ నివేదిక తేల్చింది. మానసిక ఆరోగ్య అధ్యయనాలు అవసరమంటున్నది అందుకే.

పొరుగునే ఉన్న పాకిస్తాన్‌లో నూటికి 80 మంది యువత సగటున రోజుకు ఆరు గంటలు డిజిటల్ పరికరాలతో గడుపుతూ, స్క్రీన్‌కు బానిసవుతోందని పాకిస్తాన్ టెలికమ్యూనికేషన్ అథారిటీ తాజా అధ్యయనం. కరోనా తర్వాత జీవితం క్రమంగా సాధారణ స్థితికి చేరుకున్నా, పెరిగిన ఈ స్క్రీన్‌టైమ్ భారత్ సహా అన్నిచోట్లా ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ఒకసారి ఎక్కువ సమయం డిజిటల్ పరికరాలను వాడడం అలవాటయ్యాక ఇక ఆ వీక్షణ సమయమే ఆ వ్యక్తి 'కనీస పరిధి'గా మారుతుంది. కరోనా రెండేళ్ళలో ఇంటికే పరిమితం కావాల్సిన పరిస్థితుల్లో పిల్లలకు ఆటాపాటా, ఆన్‌లైన్ చదువులూ అంతా డిజిటల్ పరికరాలే. అలా జీవితంలో అదనపు భాగమైన స్క్రీన్‌టైమే చివరకు అత్యవసర భాగమైపోయింది. స్క్రీన్‌టైమ్‌కీ, మానసిక ఒత్తిడి, ఆందోళనలకూ లంకె ఉందని నిపుణులు ఎప్పుడో తేల్చారు. మితిమీరిన స్క్రీన్‌టైమ్‌తో శారీరకంగా, మానసికంగా అలసిపోయి, పిల్లల మానసిక స్థితి దెబ్బతింటుంది. ఏదైనా అంశంపై ఏకాగ్ర దృష్టి పెట్టి, నేర్చుకొనే సామర్థ్యం తగ్గుతుంది. పడుకొనే ముందు స్క్రీన్‌లో చూసినవి కలత నిద్రకూ కారణమవుతున్నాయి.

భారీ టెక్‌సంస్థలకూ ఈ డిజిటల్ దుష్ప్రభావాల గురించి తెలుసు. డిజిటల్ తెరలకు అతుక్కుపోయి, సోషల్ మీడియాకు బానిసలైతే ఆరోగ్యం చెడుతుందన్న సంగతి సాక్షాత్తూ ఫేస్‌బుక్ సొంత రీసెర్చ్‌లోనే తేలింది. ఇన్‌స్టాగ్రామ్ వ్యసనంగా మారిన టీనేజ్ అమ్మాయిలు మానసిక ఆరోగ్యం పాలయ్యారు. 2021లోనే ప్రసిద్ధ వాల్‌స్ట్రీట్ జర్నల్ ఆ సంగతి పేర్కొంది. కానీ, జనంలో చైతన్యం పెంచడానికి ఆ సంస్థలు చేస్తున్నది శూన్యం. లాభాపేక్షే ధ్యేయమైన వ్యాపారాన్ని పణంగా పెట్టి, అవి అలా ముందుకొస్తాయనుకోవడం అమాయకత్వమే. చిన్నప్పుడే ఫోన్లు చేతికివ్వడమంటే, చేతులారా డిజిటల్ మత్తుమందుకు బానిసల్ని చేసినట్టే! మారాం చేస్తున్న పిల్లల్ని ఆపడానికీ, ఆడుకో వడానికీ వీడియో గేమ్స్, స్మార్ట్‌ఫోన్లు అలవాటు చేసే బుద్ధిహీనతను వదిలించుకోవడం మన చేతిలో పనే!

తల్లితండ్రులే మొదటి గురువులు గనక వారు డిజిటల్ వినియోగాన్ని నియంత్రించుకుంటే, అదే పిల్లలకూ మార్గదర్శకమవుతుంది. ఇంట్లో అందరూ కలసి మాట్లాడుకుంటూ, మమతానురాగాలు పంచుకోవడం అనేక సమస్యలకు పరిష్కారం. మారుతున్న కాలంలో డిజిటల్ స్క్రీన్లతో సంపర్కం అనివార్యమని గ్రహిస్తూనే ఎంతసేపు, ఎలాంటివి చూస్తూ, ఎవరితో డిజిటల్ స్నేహాలు చేస్తున్నామనేది ముఖ్యం. ఈ అంశాల్ని తల్లితండ్రులు, బడిలో గురువులు గమనించి, మంచి మాటలతో పిల్లల్ని వర్చ్యువల్ లోకం నుంచి వాస్తవ ప్రపంచంలోకి మరల్చాలి. సురక్షితంగా, సమర్థంగా సాంకేతికతను వాడడం ఎలాగో నేర్పాలి. పుస్తక పఠనం, ఆటల లాంటి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించాలి. లేదంటే, ఇప్పటికే బస్సుల్లో, రైళ్ళలో సహా అన్నిచోట్లా పక్కనేం జరుగుతున్నా పట్టకుండా స్మార్ట్‌ఫోన్లు చూసుకుంటూ వేరే ప్రపంచంలో విహరిస్తున్న మనుషులు నిండిన సమాజం దుర్భరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: అమావాస్య రా.8.48 వరకు తదుపరి జ్యేష్ఠ శు.పాడ్యమి, నక్షత్రం: భరణి ఉ.7.11 వరకు తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.7.23 నుండి 9.02 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.04 నుండి 8.55 వరకు తదుపరి ప.12.22 నుండి 1.14 వరకు.

సూర్యోదయం: 5.47
సూర్యాస్తమయం: 6.38
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

ఇండో–పసిఫిక్ ప్రపంచ మథనం

విశ్లేషణ



ధ్రువ జైశంకర్

ఈ నెల మనం వరుసగా కొన్ని ప్రపంచస్థాయి సదస్సులను చూడబోతున్నాం. జీ7; దక్షిణ పసిఫిక్ దేశాలతో భారత్, అమెరికా సమావేశాలు వంటివి వీటిలో ముఖ్యమైనవి. ఈ క్రమంలో కొత్త పొత్తులు, భౌగోళిక రాజకీయ పోటీ, ప్రపంచ సమస్యలను పరిష్కరించడం కోసం పథకాల వంటివి చోటు చేసుకోనున్నాయి. జీ7 సభ్యదేశాలన్నింటితో సహకారం పెరుగుతున్న సమయంలో, 2019 నుంచి అతిథిగా హాజరవుతున్న భారత్... తాజాగా జీ7 దేశాల సదస్సులో పాల్గొననుంది. క్వాడ్‌లో అమెరికా, జపాన్‌లతో; ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ (టీటీసీ) ద్వారా యూరోపియన్ యూనియన్‌తో; బ్రిటన్, కెనడాలతో భారత్ ముందస్తు వాణిజ్య చర్చలు జరుపుతోంది.

ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భారత్ అంతర్జాతీయ కార్యకలాపాలు, విస్తృతార్థంలో అంతర్జాతీయ వ్యవస్థ మారుతున్న స్వభావాన్ని పట్టి చూపే పలు నాయకుల సదస్సులకు ఈ నెల సాక్షీభూతం కానుంది. మొత్తంగా అవి కొంత కాలంగా వ్యక్తమవుతున్న కొన్ని ధోరణుల కలయికను సూచిస్తాయి. వాణిజ్య, ఆర్థిక పరస్పర ఆధారిత విధానాలు, చైనా అంతర్జాతీయ పాత్ర, భారత్ అంతర్జాతీయ భాగస్వామ్యాల సాపేక్ష ప్రాధాన్యత, ప్రపంచ ప్రధాన రాజకీయ లోపాలు వంటివన్నీ నిర్మాణాత్మక మార్పు లకు లోనయ్యాయి. అయితే, ఈ పరిణామాలు నిర్దిష్ట వ్యాఖ్యాతలతో పొసగడం లేదు. అవేమిటంటే, తప్పుడు సమానత్వాలకు అతుక్కు పోతున్న భారతీయులు. న్యూఢిల్లీతో సంబంధాలను క్రమం తప్పకుండా చిన్నచూపు చూస్తున్న అమెరికన్లు, బ్రస్సెల్స్, సింగపూర్, న్యూయార్క్ వంటి ప్రాంతాల్లోని వ్యక్తులు లేదా సంస్థలు గత ఆర్థిక, రాజకీయ క్రమాన్ని తిరిగి పొందాలని కోరుకోవడం వంటివి.

ఈ వారం హిరోషిమాలో జరగనున్న జీ7 దేశాల సమావేశంలో, ప్రపంచంలోనే అతిపెద్ద అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలకు చెందిన నాయకులు సమావేశం కానున్నారు. 1970ల నుంచి వీరు వార్షిక ప్రాతిపదికన సమావేశమవుతూ వస్తున్నారు. జీ7 అజెండాలో, నేటికీ కొనసాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం ప్రధానాంశంగా ఉంటుంది. ఈ గ్రూప్ దేశాలు రష్యాపై ఆంక్షలతోపాటు ఉక్రెయిన్ ప్రభుత్వం వెనుక నిలబడటం తెలిసిందే. అయితే అమెరికా, కెనడాలను మినహాయిస్తే తక్కిన దేశాలు సాపేక్ష ఆర్థిక పతనం దశలో ఉంటున్నాయి. అమెరికాయేతర జీ–7 సభ్యదేశాల సామూహిక స్థూల దేశీయోత్పత్తి 1992లో ఉన్న 52 శాతం నుంచి నేటికి 23 శాతానికి పడిపోయింది. ఒక ఉమ్మడి శక్తిగా, జీ7 ఐక్యత ఈరోజు మరింత విలువైనదైనా, వాటి బలం తక్కువగా ఉంటోంది.

జీ7 సభ్యదేశాలన్నింటితో సహకారం పెరుగుతున్న సమయంలో, 2019 నుంచి అతిథిగా హాజరవుతున్న భారత్... తాజాగా జీ7 దేశాల సదస్సులో పాల్గొననుంది. క్వాడ్‌లో అమెరికా, జపాన్‌తో, ట్రేడ్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ (టీటీసీ) ద్వారా యూరోపియన్ యూనియన్‌తో, బ్రిటన్, కెనడాలతో భారత్ ముందస్తు వాణిజ్య చర్చలు జరుపుతోంది. సంక్లిష్టభరితమైన జనాభా, స్థూల ఆర్థికపరమైన సంధికాలంలో భారత అభివృద్ధిని, ఆర్థిక భద్రతా లక్ష్యాలను వేగవంతం చేయడం కోసం ఈ యంత్రాంగాలను ప్రభావితం చేయడం ప్రధానమైన అంశంగానే ఉంటుంది.

అదే సమయంలో ఉక్రెయిన్ యుద్ధం, భారత్ జీ20 అధ్యక్ష బాధ్యతల నేపథ్యంలోనూ, అభివృద్ధి చెందిన ప్రపంచం నుంచి స్వల్ప మార్పులనే గమనిస్తున్న భారత్‌కు జాతీయ, అంతర్జాతీయ సమస్యలను లేవనెత్తే అవకాశాన్ని జీ7 సదస్సు కల్పిస్తోంది. ఈ సమస్యలు



క్వాడ్ దేశాధినేతలు (ఫైల్ ఫొటో)

ఏమిటంటే, ఇంధన, ఆహార భద్రత; సరఫరా మార్గాల స్థితిస్థాపకత, వాతావరణం; ఆర్థిక, స్వావలంబన అభివృద్ధి, అంతర్జాతీయ సంస్థల సంస్కరణ, రుణ స్థిరత్వం వంటివి. కాగా, అమెరికా వడ్డీరేట్లు అధికంగా ఉడటం, డిజిటల్ కరెన్సీలు, చెల్లింపుల్లో ఆవిష్కరణలు, నిలకడలేని వాణిజ్య అసమతుల్యతలు, అంతర్జాతీయ ఆంక్షలు వంటివి రానున్న సంవత్సరాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చుట్టుముట్టనున్నాయి.

హిరోషిమా సదస్సును దాటి చూస్తే, భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ లు దక్షిణ పసిఫిక్ దేశాల నాయకులతో సమావేశాల కోసం పాపువా న్యూ గినియాను సందర్శిస్తారని భావిస్తున్నారు. వాటి చిన్న సైజు, చిన్నచిన్న దీవుల్లోని జనాభా కారణంగా దక్షిణ పసిఫిక్ ప్రాంతాన్ని తరచుగా చిన్నచూపు చూస్తూ వచ్చారు. కానీ ప్రపంచ భూ ఉపరితలంలో ఈ ప్రాంతం ఆరింట ఒక వంతును కలిగి ఉంది. తైవాన్, అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలపై ప్రభావం చూపే విషయంలో చైనా పోటీ పడటాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఈ ప్రాంతం కూడా భౌగోళిక రాజకీయ హాట్ స్పాట్‌గా మారుతోంది. పైగా వాతావరణ సంక్షోభం, నిలకడైన రుణ విధానాలు, మత్స్య, ఖనిజ వనరులు వంటివాటికి ఈ ప్రాంతం కీలకమైనది.

భారత్ విషయానికి వస్తే, ఫోరమ్ ఆన్ ఇండియా పసిఫిక్ ఐలాండ్ కో–ఆపరేషన్ (ఎఫ్ఐపీఐసీ) ద్వారా 2014–2017లో ప్రారంభమైన మహమ్మారి సంబంధిత విరామం – వ్యాప్తి తర్వాత పోర్ట్ మోర్స్‌బీలో జరుగనున్న సదస్సు ఒక సహజమైన కొనసాగింపు. ఈ సంవత్సరాల్లో భారత ప్రధాని ఫిజీలో 14 దక్షిణ పసిఫిక్ ప్రాంత నాయకులను కలిశారు. వారందరికీ జైపూర్‌లో ఆతిథ్యమిచ్చారు. భారతీయ అభివృద్ధి, సహాయ పథకాలను ప్రదర్శించడానికి అది ఒక అవకాశం అవుతుంది. ఫిజీ, పాపువా న్యూ గినియాలలో రుజువైనట్లే, గ్లోబల్ సౌత్‌ని ప్రభావితం చేస్తున్న కొన్ని ఉమ్మడి సవాళ్లకు ప్రస్తుత భారతీయ ప్రతిపాదనలు పరిష్కారాలు కావచ్చు. అదే సమయంలో, అమెరికా భూభాగం కాని ఒక దక్షిణ పసిఫిక్ దేశానికి బైడెన్ ప్రయాణం ఆశ్చర్యకరంగా అమెరికా అధ్యక్షుడి ప్రథమ సందర్శన కానుంది. పైగా, ఒక ముఖ్యమైన ప్రాంతంపై వాషింగ్టన్ చాలాకాలం తర్వాత దృష్టి పెట్టినట్లవుతుంది.

చివరగా, ఆస్ట్రేలియాలో క్వాడ్ సదస్సుకు ఈ నెల సాక్షీభూతం కానుంది. గ్రూప్ లీడర్లు మూడోసారి వ్యక్తిగతంగా కలవనున్నారు. అమెరికా అధ్యక్షుడు వార్షిక ప్రాతిపదికన హాజరయ్యే కొన్ని అంతర్జాతీయ గ్రూప్ సమావేశాలు ఏవంటే, జీ7, జీ20, నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) ఆసియా పసిఫిక్ ఎకనమిక్ కో ఆపరేషన్, ఈస్ట్ ఆసియా సదస్సు, ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు. ఈ చిన్న జాబితాలో క్వాడ్ కొత్త చేరిక అన్నమాట.

2021లో అధ్యక్ష స్థాయి సమావేశంగా మొదటిసారి ఉనికిలోకి వచ్చిన క్వాడ్, మూడు కార్యాచరణ బృందాలను ఏర్పర్చింది. కానీ ఇప్పుడు దీని కార్యకలాపాలు 25 కార్యాచరణ బృందాలకు విస్తరించాయి. వీటిలో కొన్ని, క్వాడ్ ఫెలోషిప్స్ వంటి కొన్ని ఫలితాలను ఇప్పటికే ప్రదర్శించాయి. మరి కొన్ని సముద్రజలాల సమస్యలు, సైబర్ సెక్యూరిటీ, అంతర్జాతీయ రుణం వంటి అంశాల్లో సన్నిహిత సహకారానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. కొన్ని కార్యాచరణ బృందాలు ఇప్పటికీ చాలా అస్థిరంగా ఉంటున్నాయి. ఇకపోతే సరఫరా చైన్లు, సంక్లిష్ట టెక్నాలజీలు వంటి ఇతర అంశాల్లో సభ్యదేశాల మధ్య ద్వైపాక్షిక ప్రయత్నాలను ముందుకు తీసుకుపోవడానికి క్వాడ్ ఒక యంత్రాంగాన్ని ఏర్పర్చింది. వీటిలో అమెరికా, భారత్‌లతో ముడిపడి ఉన్న జాతీయ భద్రతా సలహాదారు నేతృత్వంలోని టెక్నాలజీ సంభాషణ, ఐసీఈటీ వంటివి ఉన్నాయి లేదా, ఇండో–పసిఫిక్ ఎకనమిక్ ఫ్రేమ్‌వర్క్ (ఐపీఈఎఫ్), మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ (టిపి–ఎమ్‌డిఎ) వంటి అంశాలపై దేశాల విస్తృత సమితిని తీసు కొచ్చాయి. ఇవి, మరికొన్ని ప్రయత్నాలు సిడ్నీలో జరగనున్న సదస్సు నాటికి కొంత ప్రగతిని చవి చూస్తాయి కూడా. (అయితే అమెరికా అంతర్గత వ్యవహారాల వల్ల జో బైడెన్ ఆస్ట్రేలియా పర్యటనను రద్దు చేసుకోవడంతో క్వాడ్ సమావేశం ఆఖరు నిమిషంలో వాయిదా పడింది).

ఇక ఈ నెలలో జరగనున్న ఇండో–పసిఫిక్ అత్యున్నత సమావేశం సారాంశాన్ని చూస్తే, అంతర్జాతీయ వ్యవస్థలో కొన్ని కీలకమైన ప్రకంపనలను అవి ఎత్తిచూపనున్నాయి. ఈ ధోరణులను అభినందించే విషయంలో అనేక ప్రముఖ అంతర్జాతీయ వ్యాఖ్యాతలు ఘర్షించవచ్చు. కానీ ఆర్థిక సంబంధాల నూతన పోకడలు, కొత్త రంగాలు, భౌగోళిక–రాజకీయ పోటీ రూపాలు, ఈ సమస్యలను ఎదుర్కోవడానికి కొత్త యంత్రాంగాలు సీదాసాదాగా రూపుదిద్దుకుంటున్నాయి.

వ్యాసకర్త కార్యనిర్వాహక డైరెక్టర్, ఓఆర్ఎఫ్, అమెరికా
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో...)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

'సిద్ధ'హస్తుడు



'ఇవే నా చివరి ఎన్నికలు' అని సిద్ధ రామయ్య 2013లో చెప్పారు. 2018లో చెప్పారు. 2033 లో కూడా ఆయన ఇదే మాట చెప్పినా ఆశ్చర్యం లేదు. దురాశకు అంతం ఉండదు. హద్దులూ ఉండవు.

– దినకరన్ రాజమణి, జర్నలిస్ట్

రిచ్ సర్కిల్



అంతర్ముఖులు తమ శక్తిని విలువైనదిగా తలచి, దాన్ని ఎవరికి ఖర్చు చేయాలో ఎంపిక చేసుకుంటారు. అది వారి జీవితానికి గొప్పతనాన్ని, అర్థవంతమైన సంబంధాలను ఏర్పచడానికి తోడ్పడుతుంది.

– ఎల్గార్ ఇస్రాఫిల్లీ, సక్సెస్ గురు

ఒక్కరమే బతకలేం



నెల్లాళ్ల క్రితం ఒక సన్నిహిత మిత్రుడి మరణం నన్ను ఒంటరితనంలో ముంచెత్తింది. కొంతమేరకు నా ఉపశమన దీపాలుగా నా పిల్లలు నిలిచారు. కానీ నన్ను నమ్మండి, సాధారణంగా ఉత్తర యూరప్, ప్రత్యేకంగా డెన్మార్క్ ఒంటరిగా ఉండటానికి ఎంత మాత్రమూ తగిన ప్రాంతాలు కావు.

– తజీఫ్ ఖైర్, రచయిత

ఇలా చెయ్యండి



అధిక రక్తపోటు సమస్యను తగ్గించడంలో వెల్లుల్లి చాలా ప్రభావవంతంగా పనిచేస్తుందని నిర్ధారణ అయింది. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో 4–5 వెల్లుల్లి రెబ్బల్ని తినడం చక్కని ఫలితాన్ని ఇస్తుంది.

– నిర్మల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు

అతిక్రమణ



హిందూ మహా సముద్రంలో చైనా పడవలు బోల్తా పడ్డాయి. 39 మంది గల్లంతయ్యారు. పెద్ద ప్రశ్న... ఆ సముద్ర జలాల్లో చైనా పడవలు ఏం చేస్తున్నట్లు? పాకిస్థానీలను మోసుకెళుతున్నాయా? లేక, కాన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఇషా గుప్తాను చూసేందుకు వెళుతున్నాయా?

– ప్రధుమాన్ ఫుకాన్, ట్రావెలర్

జెన్నీ వచ్చింది!



2018 తర్వాత తొలిసారిగా జెన్నీ కిమ్ ఒక పాటను విడుదల చేస్తున్నారు. ఆమె కొత్త పాటకు మద్దతుగా మా జెన్నీ అభిమానులం అంతా నిధులు సేకరిస్తున్నాం. మీరు మద్దతు ఇవ్వకపోతే పోనివ్వండి, అంత మాత్రాన మీరు మద్దతు ఇవ్వనట్లేమీ అవదు. అన్నట్టు, నటిగా నిరుడు అరంగేట్రం చేసిన జెన్నీకి ఈ ఏడాది కాన్ ఆహ్వానం లభించింది.

– 'ఎటెడిటర్', ర్యాపర్

అప్పడొద్దన్నారు



రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో పాకిస్తాన్ నుంచి వచ్చిన హిందూ శరణార్థుల ఇళ్లను కూల్చి వేయించిన ఆ జిల్లా మేజిస్ట్రేట్ టీనాదాబీ... పౌరసత్వం లేని వారికి పునరావాసం కల్పించే విధానం ఏదీ రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేదని చెప్పడంలో అవాస్తవం ఏమీ లేదు. దురదృష్టం ఏమిటంటే, శరణార్థులకు సత్వర పౌరసత్వం కల్పించే ప్రతిపాదిత చట్టం రెండేళ్ల క్రితం భారీ హింసకు, అల్లర్లకు దారి తీయడం!

– స్వాతీ గోయెల్ శర్మ, పాత్రికేయురాలు

ఇన్‌బాక్స్

ఫ్లెక్సీ మరణం

నేతన్న ప్రతిమ దగ్గర అంబేద్కర్ విగ్రహం వద్ద
గాంధీ విగ్రహం చెంత నాలుగు కూడళ్ల చోట
ఒక శ్రద్ధాంజలి అశ్రునివాళి
మరణించిన వారి ఫొటో ఫ్లెక్సీ ఒకటి వెలుస్తుంది

అనుబంధాలు జ్ఞాపకాలు గుండె గాయాల మచ్చలు
ఒక్కొక్కటి మనసును తడి గుడ్డను చేసి పిండినట్టు
కళ్ళల్లోంచి రాలుతున్న అశ్రువులు

తుఫాను బీభత్సంలో
చెట్లులా కదిలి చేతుల్లాంటి కొమ్మలు విరిగి
మనుషులు అతలాకుతలం అవుతున్నారు

కన్నతల్లి కొంగు నీడ లాంటి పచ్చని సొంత ఊరు నుంచి
పనిని వెతుక్కుంటూ వచ్చాము గిట్టుబాటు దక్కని పట్టణం
నానా విధాలుగా మన మూలుగలను పీల్చి పిప్పి చేస్తుంది

వృథా చేస్తూ టైం లేదంటూ అంతా తొందర తొందర
బతుకంతా చిందర వందర

పుట్టుకలేమో కానీ చావు దుఃఖ సమాచారాన్ని మాత్రం
మౌఖిక ప్రచారం అందరినీ చేరుతుంది

చావు ఫ్లెక్సీలను దర్శించినప్పుడల్లా
నాకు బట్ట మీద అక్షర బొమ్మ వేసే
చిత్రకారుని ఆర్తనాదం వినిపిస్తుంది

– జూకంటి జగన్నాథం

దశాబ్ద కాలంలో మేలిమలుపు!

అభిప్రాయం



వద్దిరాజు రవిచంద్ర

తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేళ్ళవుతున్న సందర్భంలో ఉన్నాం. 2023 జూన్ 2వ తేదీనుండి 21 రోజుల పాటు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు జరగడానికి రంగం సిద్ధమయింది. ఈ సందర్భంగా మలి తెలంగాణ ఉద్యమం, దాని నాయకుడు కేసీఆర్ నాయకత్వ పటిమ, ఆయన ప్రభుత్వం తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన తీరును అవలోకనం చేసుకోవడం ఎంతో అవసరం.

సమైక్య రాష్ట్రంలో దారుణమైన వివక్ష, పాలకుల నిర్లక్ష్యానికి బలై అణగారిపోయిన తెలంగాణ జాతిని మేల్కొలుపుతూ 2001 ఏప్రిల్ 27న 'తెలంగాణ రాష్ట్ర సమితి' (టీఆర్ఎస్)ను కల్వకుంట్ల చంద్రశేఖరరావు స్థాపించారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పదవికీ, శాసన సభ్యత్వానికీ రాజీనామా చేసి స్థాపించిన పార్టీ మొదటి బహిరంగ సభ (సింహగర్జన) 2001 మే 17న విజయవంతమై తెలంగాణ రాష్ట్ర డిమాండ్ కు ప్రజల్లో ఉన్న మద్దతును చాటిచెప్పింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో తెలంగాణ రాష్ట్ర సమితి విశేషమైన ఫలితాలను సాధించడంతో పార్టీ రాజకీయంగా బలపడడానికి బాటలు పడ్డాయి. మాటలతో మంటలు రేపగల కేసీఆర్ ఉపన్యాస శక్తి తెలంగాణ ప్రజానీకం గుండెల్లో ఆత్మగౌరవ భావన, పోరాట స్ఫూర్తులను విస్ఫోటనం చెందేలా చేసింది.

మహాత్మా గాంధీ చూపిన అహింసా పథంలో చెక్కు చెదరని మనో విశ్వాసంతో, మొక్కవోని దీక్షతో పోరాటాన్ని నడిపారు కేసీఆర్. అతి తక్కువ వ్యవధిలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు డిమాండును జాతీయ స్థాయికి చేర్చారు. 'నాకు కేంద్రమంత్రి పదవికన్నా రాష్ట్రం ఏర్పాటే ముఖ్యం' అని చెప్పి, యూపీఏ నాయకత్వాన్ని అబ్బురపరిచారు. ఈ విషయాన్ని మాజీ రాష్ట్రపతి దివంగత ప్రణబ్ ముఖర్జీ తమ రచనలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. తానూ, తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పదే పదే పదవులకు రాజీనామాలు చేసి కేంద్రంపై వత్తిడి తీసుకువచ్చే రాజకీయ ఎత్తుగడను కేసీఆర్ దిగ్విజయంగా అమలుపరిచారు. కేంద్ర పాలకులపై ఆఖరి అస్త్రంగా ఆయన ఆమరణ నిరాహార దీక్షను ప్రయోగించారు. పదకొండు రోజుల కేసీఆర్ నిరాహార దీక్ష పార్లమెంట్‌ను ప్రకంపింప చేసింది. కేంద్రాన్ని అనివార్యంగా దిగివచ్చేలా చేసింది. తెలంగాణ ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి కేసీఆర్ చూపిన ఓర్పు, నేర్పు అనన్య సామాన్యం. ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు సకలజనుల సమ్మె చేసినారంటే దానికి కేసీఆర్ నాయకత్వ పటిమే కారణం. ఉద్యమాల చరిత్రలో అదో అపురూప ఘట్టంగా నిలిచిపోతుంది.



రాష్ట్రం సిద్ధించిన 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కట్టారు. వచ్చే ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి కూడా కేసీఆరే ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం ఖాయం. రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల కాలంలో అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలుగా ప్రగతి రథాన్ని పరుగులు పెట్టిస్తున్నారు. పది సంవత్సరాల వయసున్న రాష్ట్రం ఏడుపదుల వయసున్న రాష్ట్రాల కన్నా మిన్నగా అభివృద్ధిని సాధించడం వెనుక కేసీఆర్ దార్శనికత, అకుంఠిత దీక్షా దక్షతలు ఉన్నాయి. గతంలో పేరు మోసిన ముఖ్యమంత్రులు పరిష్కరించ లేకపోయిన కరెంట్ సమస్యను అనతి కాలంలో పరిష్కరించి వెలుగు జిలుగుల తెలంగాణను ఆవిష్కరించారు. ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కించి రాష్ట్ర ఆదాయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచారు. పెంచిన సంపదను పేదలకు పంచారు.

తెలంగాణ భూభౌతిక పరిస్థితులను ఔపోసన పట్టి 'మిషన్ భగీరథ' పథకాన్ని రూపొందించారు. తరతరాల తాగునీటి కష్టాలకు చరమ గీతం పాడారు. ఆయనే సాగునీటి రంగ నిపుణులుగా మారి, నిరంతరం అధ్యయనం చేసి ప్రాజెక్టులు రీడిజైన్ చేశారు. ప్రపంచ ఇంజనీరింగ్ అద్భుతంగా పేర్కొంటున్న కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేసి అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందారు కేసీఆర్. నడి ఎండాకాలంలో సైతం తెలంగాణ చెరువులు మత్తడి దుంకే అద్భుత దృశ్యాలను ఆవిష్కరించారు. కేసీఆర్ పరిపాలనా సంస్కరణలతో అభివృద్ధిని కొత్తపుంతలు తొక్కించారు. పల్లె ప్రగతితో ఆదర్శ గ్రామాలను సృష్టించారు.


తెలంగాణ అభివృద్ధి మోడల్‌ను దేశవ్యాపితం చేయడానికి తెలంగాణ రాష్ట్ర సమితిని ఇటీవల 'భారత్ రాష్ట్ర సమితి' (బీఆర్ఎస్)గా మార్చారు. వచ్చే పార్లమెంట్ సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర వహిస్తుందని ఆశిద్దాం.

వ్యాసకర్త రాజ్యసభ సభ్యులు

ముద్రలు

సీతా రామ లక్ష్మణులు వనవాసం చేస్తున్న సమయం. దట్టమైన అరణ్య మార్గాల గుండా సంచరిస్తున్నారు. ఒక ప్రదేశం నుండి వెళ్తున్నపుడు లక్ష్మణుడు తన మనసులో 'ఈ వనవాసం సీతా రాములకు అనివార్యం. నేనెందుకు వీరి వెంట ఉంటూ ఇన్ని బాధలు పడాలి' అనుకున్నాడు. ఇలా అనుకుంటూ ఆ ప్రదేశం దాటగానే తన ఆలోచనలకు సిగ్గుపడ్డాడు.

రామునికి ఆ విషయాన్ని చాలా బాధతో చెప్పాడు. రాముడు నవ్వి తమ్ముడూ! ఇప్పుడు మనం దాటి వచ్చిన ప్రదేశం రాక్షస నివాసం. రాక్షసులతో ఉంటే మాత్రమే కాదు, వారు సంచరించే



తావులు కూడా వారి స్వభావాన్ని మనలో నింపుతాయి. ఇప్పుడు ఋషుల వాటికకు చేరువయ్యాం. అందుకే నీ ఆలోచనల్లో పశ్చాత్తాపం కనిపించింది అన్నాడు.

మనతో ఉన్న మనుషుల స్వభావాలు మనపై ముద్రలు వేస్తాయి. అంతే కాదు, చెడ్డ మనుషులు ఉన్న ప్రాంతాల్లో తిరిగితే చెడు ఆలోచనలు, మంచి మనుషులు ఉన్న ప్రాంతంలో ఉంటే అందుకు తగిన మంచి ఆలోచనలు మనలో కలుగుతాయి. వ్యక్తులే కాదు వారున్న పరిసరాలు కూడా మనపై ముద్రలు వేస్తాయి అని ఈ ఘట్టం ద్వారా రామాయణం మనకు చెబుతోంది.

– శివలెంక ప్రసాదరావు

అధికారంలోకొస్తే బీసీ బడ్జెట్

- బీసీ జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయిస్తాం
- ఓబీసీ సమ్మేళనంలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కె.లక్ష్మణ్, బండి సంజయ్
- బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పిస్తాం
- నామినేటెడ్ పదవుల్లో వెనకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తాం
- జూన్‌లో లక్షలాది మందితో హైదరాబాద్‌లో బీసీ గర్జన


ఓబీసీ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న బీజేపీ నేతలు లక్ష్మణ్, బండి సంజయ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్/నాగోల్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇక్కడి బీసీ జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయింపులు చేస్తామని వెల్లడించింది. అలాగే బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా, విదేశాల్లో చదివే బీసీ విద్యార్థులకు శాచురేషన్ ప్రాతిపదికన ఆర్థిక సాయం, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు పెద్దపీట, ఎన్నికల్లో పోటీ చేయలేని బీసీల్లోని చిన్న కులాలకు ప్రాధాన్యత వంటి కీల కాంశాలను ఇందులో పొందుపరిచింది. రాష్ట్రంలో 130 కులాలను ఏకం చేసి అధికార సాధనకు ముందుకెళ్లనున్నట్టు తెలిపింది. వచ్చే నెలలో లక్షలాది మందితో హైదరాబాద్‌లో బీసీ గర్జన పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన బీజేపీ రాష్ట్రవ్యాప్త ఓబీసీ మోర్చా కాన్ఫరెన్స్–బీసీ సమ్మేళనంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్, బీజేపీ నేతలు యెండల లక్ష్మీనారాయణ, డా. బూర నర్సయ్యగౌడ్, వన్నాల శ్రీరాములు, కూన శ్రీశైలంగౌడ్, నందీశ్వర్‌గౌడ్, తుల ఉమ, ఆకుల విజయ, గడీ శ్రీకాంత్, ఎస్. హరిశంకర్‌గౌడ్, ఇతర నాయకుల హర్షధ్వానాల మధ్య లక్ష్మణ్ ఈ ప్రకటన చేశారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను దోషిగా నిలబెడతాం: లక్ష్మణ్

ఈ సందర్భంగా కె. లక్ష్మణ్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం విషయంలో కేసీఆర్‌కు, కాంగ్రెస్ పార్టీకి ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించేందుకే ఓబీసీ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహి.... బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది కాంగ్రెస్సే. ఆ పార్టీతోపాటు బీఆర్‌ఎస్ కూడా బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించింది' అని లక్ష్మణ్ ధ్వజమెత్తారు. 'తెలంగాణలో బీసీలను కేసీఆర్ అణగదొక్కుతున్నారు. పల్లెపల్లెకూ బీసీ–ఇంటింటికీ బీజేపీ పేరిట వీటన్నింటిపై ప్రచారం చేస్తాం. అతిత్వరలో లక్షలాది మందితో బీసీ గర్జన నిర్వహించి కాంగ్రెస్, టీఆర్‌ఎస్‌లను బీసీ దోషిగా నిలబెడతాం' అని లక్ష్మణ్ ప్రకటించారు. 'ఉత్తరాంధ్రకు చెందిన 26 బీసీ కులాల ప్రజలు తెలంగాణలో స్థిరపడితే ఒక్క కలంపోటుతో జీవో జారీ చేసి బీసీ జాబితా నుంచి తొలగించిన ద్రోహి కేసీఆర్. రాష్ట్రంలో 54 శాతం బీసీలంటే కేవలం ముగ్గురికే కేసీఆర్ మంత్రి పదవులిచ్చారు. కానీ కేసీఆర్ కుటుంబంలో మాత్రం అందరికీ పదవులొచ్చాయి' అని లక్ష్మణ్ మండిపడ్డారు.

గొర్లు, బర్లు ఇచ్చి బీసీలను అణగదొక్కుతారా?: బండి

'బీసీలను కేసీఆర్ అవమానిస్తున్నారు. 50 శాతం జనాభా ఉన్న బీసీలకు 3 మంత్రి పదవులా? గొర్లు, బర్లు, చేపలు ఇచ్చి రాజకీయంగా అణగదొక్కుతున్నారు. కేసీఆర్ కుటుంబంలో అందరికీ పదవులిస్తారా? జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీలను అవమానించిన మూర్ఖుడు కేసీఆర్. బీసీబంధు ఇవ్వడానికున్న అభ్యంతరం ఏమిటి?' అని బండి సంజయ్ ప్రశ్నించారు. అవసరం లేకపోయినా రూ. 1,600 కోట్లు ఖర్చు పెట్టి సచివాలయం, ప్రగతి భవన్ కట్టుకున్న సీఎం... బీసీ ఆత్మగౌరవ భవనాలను ఎందుకు పూర్తి చేయలేకపోతున్నారో బీసీ సమాజం గుర్తించాలి. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడం లేదు. బీసీలకు రావాల్సిన వాటా నిధులను ఎందుకు ఖర్చు చేయడం లేదు? తెలంగాణలో పేదల రాజ్యం రావాల్సిందే. అందుకోసం 5 నెలలు పూర్తి సమయం మాకివ్వండి. కేసీఆర్ రాక్షస, కుటుంబ పాలనను అంతం చేస్తాం. పేదల రాజ్యాన్ని తీసుకొస్తాం' అని సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు రాజ్యాధికారం వస్తేనే బడుగులకు న్యాయం జరుగుతుందన్నారు.

బీసీ డిక్లరేషన్‌పై బీజేపీ నేతల హర్షం

సాక్షి, హైదరాబాద్: ఓబీసీ సమ్మేళనంలో చేసిన బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించినందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌ను బీజేపీ నేతలు డీకే అరుణ, వివేక్ వెంకటస్వామి, ఏపీ జితేందర్ రెడ్డి, విజయశాంతి వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు. ఇన్నాళ్లూ బీసీలకు కేసీఆర్ చేస్తున్న అన్యాయాన్ని ఈ డిక్లరేషన్ సరిచేస్తుందని డీకే అరుణ పేర్కొన్నారు. వెనకబడిన వర్గాలపై బీజేపీ నిబద్ధతకు ఇది నిదర్శనమని వివేక్ వెంకటస్వామి తెలిపారు. బీసీ వర్గాలకు మేలు చేసేలా రాష్ట్రపార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించడం సంతోషమని ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. వెనుకబడిన వర్గాలకు వెన్నుపోటు పొడిచిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ఓబీసీలు చెంపపెట్టు లాంటి తీర్పునివ్వాలని విజయశాంతి కోరారు.

సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు...

- 52 శాతం జనాభా ఉన్న బీసీలను అన్ని రంగాల్లో అణచివేస్తున్న కేసీఆర్ ప్రభుత్వ తీరుకు ఖండన
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 33 శాతం నుంచి 23 శాతానికి తగ్గించి బీసీలపట్ల వివక్షపై ఖండన
- 12 శాతమున్న ముస్లింలకు 201 గురుకులాలు, 52 శాతమున్న బీసీలకు 260 గురుకులాలే కేటాయించడంపై ఖండన
- అన్ని వర్గాలకు 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి బీసీలకు కేవలం 11 శాతం ఇవ్వడాన్ని తప్పుబడుతూ తీర్మానం.
- కేసీఆర్ సర్కార్ బీసీల వ్యతిరేక వైఖరి, మోదీ సర్కార్ సాగిస్తున్న సంక్షేమం గురించి ప్రతి బీసీ కుటుంబంలో చర్చించాలి.
- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో బూత్, మండల, రాష్ట్ర స్థాయిల్లో 'బీసీల గోస–బీజేపీ భరోసా' చర్చ నిర్వహణ.
- బీసీ ఓటర్లలో చైతన్యం కల్పించి ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రలోభాలు, ధన రాజకీయాలను తిప్పికొట్టాలి.
- అన్ని రంగాల్లో బీసీల పురోగతి సాధన డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే సాధ్యమని బీసీ వర్గాలు గుర్తించాలి.
- జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పనపై మోదీ సర్కార్‌కు ధన్యవాదాలు.

ఎన్టీఆర్-శ్రీకృష్ణుడి విగ్రహ ఏర్పాటుపై స్టే

- తుది తీర్పు వెలువరించే వరకు ప్రతిష్టాపన ఆపాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మంలోని లకారం చెరువులో 54 అడుగుల ఎన్టీఆర్ శ్రీకృష్ణుడి రూప విగ్రహాన్ని ప్రతిష్టించాలనుకోవడంపై హైకోర్టు స్టే విధించింది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఈ నెల 28న జూనియర్ ఎన్టీఆర్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ చేయించేందుకు ప్రభుత్వం సిద్ధమవడం తెలిసిందే. అయితే ఈ విగ్రహ ఏర్పాటును సవాల్ చేస్తూ భారత యాదవ సమితి, ఆల్ ఇండియా యాదవ సమితి, ఆదిభట్ల శ్రీకళాపీఠం, శ్రీకృష్ణ జేఏసీ సహా పలువురు లంచ్‌మోషన్ రూపంలో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంపైనే అభ్యంతరం తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు, బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాలను ప్రతిష్టించడాన్ని నిషేధిస్తూ 2016లో జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. తుది తీర్పు వెలువరించే వరకు విగ్రహ ప్రతిష్టాపన ఆపాలని ఆదేశించింది.



మార్పులు చేస్తాం...

ఖమ్మం మయూరి సెంటర్: ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసే ఎన్టీఆర్ శ్రీకృష్ణుడి రూప విగ్రహం విషయమై హైకోర్టు ఉత్తర్వులు, యాదవ సంఘాల సూచనలను గౌరవిస్తూ మార్పులు చేయిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. విగ్రహం కిరీటంలోని నెమలి పింఛం, వెనుక భాగాన విష్ణుచక్రం, పిల్లనగ్రోవి తొలగించి ఈ నెల 28న ఆవిష్కరిస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు శ్రీకృష్ణావతారంలో రూపొందించిన ఎన్టీఆర్ విగ్రహం ఖమ్మం చేరుకుంది. భారీ వాహనంలో 54 అడుగుల విగ్రహాన్ని గురువారం లకారం ట్యాంక్‌బండ్ వద్దకు తీసుకొచ్చారు. విగ్రహాన్ని స్థానికులు పెద్ద సంఖ్యలో తిలకించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చొరవతో 'తానా', ఎన్‌ఆర్‌ఐలు, పలువురు పారిశ్రామికవేత్తల సహకారంతో భారీ విగ్రహాన్ని నిజామాబాద్‌కు చెందిన కళాకారుడు వర్మ రూపొందించారు.

పాస్‌పోర్టు దరఖాస్తుదారులకు శుభవార్త

పీవోపీఎస్కేల్లో 700 అపాయింట్‌మెంట్లు రేపు

రాంగోపాల్‌పేట్: హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం పరిధిలోని 14 పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో (పీవోపీఎస్కే) స్పెషల్ డ్రైవ్ ద్వారా ఈ నెల 20వ తేదీన 700 పాస్‌పోర్టు, పీసీసీ అపాయింట్‌మెంట్లను అందుబాటులో ఉంచుతున్నట్లు ఆర్పీవో దాసరి బాలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పాస్‌పోర్టు దరఖాస్తుదారులు సుదీర్ఘకాలం వేచి చూడకుండా ఉండేందుకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఈ అపాయింట్‌మెంట్లు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు అధికారిక వెబ్‌సైట్, ఎంపాస్‌పోర్ట్‌సేవ యాప్ ద్వారా అపాయింట్‌మెంట్లు బుక్ చేసుకోవచ్చని వివరించారు. ఈ పాటికే అపాయింట్‌మెంట్లు పొందిన వారు రీషెడ్యూల్ కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు. సిద్దిపేట, ఆదిలాబాద్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, భువనగిరి, మంచిర్యాల, కామారెడ్డి, వనపర్తి, మేడ్చల్, వికారాబాద్‌లలోని పీవోపీఎస్కేల్లో ఈ అపాయింట్‌మెంట్లు అందుబాటులో ఉంటాయని వివరించారు.

పోలీస్ స్టేషన్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

అన్నదమ్ముల భూవివాదం


ఆత్మహత్యాయత్నం చేసిన రైతు నాగయ్య

తిరుమలగిరి(తుంగతుర్తి): భూవివాదం విషయమై పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వ్యక్తిని ఎస్‌ఐ కొట్టడంతో అతడు మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన గురువారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పీఎస్‌లో చోటుచేసుకుంది. బాధితుడు బానోతు నాగయ్య వివరాల ప్రకారం.. బండ్లపల్లి గ్రామ పరిధిలోని దుబ్బతండాలో నాగయ్య తండ్రి రామచంద్రు పేరుతో ఉన్న భూమిని తమ్ముడు రవి ఇతరులకు అమ్మాడు. తనకు తెలియకుండా భూమిని ఎలా అమ్మావని, పోనీ విక్రయించగా వచ్చిన డబ్బుల్లో వాటా ఎందుకివ్వలేదని నిలదీశాడు. దీంతో భూమి కొనుగోలు చేసిన వ్యక్తి తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో నాగయ్యపై ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై మాట్లాడాలని ఎస్‌ఐ శివకుమార్.. సదరు నాగయ్యను గురువారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి బూతులు తిట్టి తీవ్రంగా కొట్టాడు. దాంతో అతడు మనస్తాపానికి గురై స్థానిక ఓ ఫర్టిలైజర్ షాపులో పురుగుమందు డబ్బా కొనుగోలు చేసి పోలీస్ స్టేషన్‌లోనే తాగడానికి యత్నించాడు. అక్కడున్న వారు గమనించి డబ్బాను కింద పడేసి అడ్డుకున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా.. నాగయ్యను అసలు కొట్టలేదని, అతను పురుగుమందు తాగిన సమయంలో తాను స్టేషన్‌లోనే లేనని చెప్పుకొచ్చారు.

మంత్రాల పేరిట చుంచుం బాబా మోసాలు

సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న బాబా విన్యాసాలు


చేతిలో కత్తి, నెమలి ఈకల కర్రతో పిల్లాడిని మోకాలితో నొక్కుతున్న చుంచుం బాబా

వనపర్తి: పిల్లలు పుట్టడం లేదా.. భర్తతో సఖ్యత లేదా.. వ్యాపారం నడవడం లేదా.. ఇలాంటి సమస్యలను మంత్రాలతో పరిష్కరిస్తామంటూ అమాయక ప్రజలను మోసగించి డబ్బులు దండుకుంటున్న దొంగబాబా వ్యవహారం వనపర్తి జిల్లాకేంద్రం శివారులోని రాజనగరంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి అండదండలతో వడ్డెగేరికి చెందిన ఓ వ్యక్తి.. చుంచుం బాబాగా చెలామణి అవుతున్న ఈ బాబాను రప్పించాడు. రాజనగరం శివారులో రేకుల షెడ్ ఏర్పాటు చేసి ప్రతి గురువారం మంత్రాలు చేస్తూ అమాయకులనుంచి డబ్బులు దండుకుంటున్నారు. మంత్రించిన నిమ్మకాయలు విక్రయిస్తూ.. మెడలో కొరడా, ఒక చేతిలో కత్తి, మరో చేతిలో నెమలి ఈకల కట్టతో విచిత్ర విన్యాసాలు చేస్తున్న చుంచుం బాబా వీడియోలు నెట్టింట చక్కర్లు కొట్టడంతో ఈ వ్యవహారం బహిర్గతమైంది. మంత్రాల పేరిట నమ్మించి చిన్న పిల్లలపై అటూ.. ఇటు.. దాటుతూ కడుపుపై మోకాలితో నొక్కుతూ.. తలపై నెమలి ఈకలతో కొడుతూ తన వద్దకు వచ్చిన వారిని బురిడీ కొట్టిస్తాడని తెలుస్తోంది. అంతేకాక మంత్రించిన నిమ్మకాలను ఇస్తూ.. అమాయకుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నట్లు వెల్లడైంది. వనపర్తి మండలంలోని అచ్యుతాపురం, చిట్యాల, పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి, మనిగిల్ల తదితర ప్రాంతాల నుంచి ప్రజలు ఈ మంత్రాల నిమ్మకాయల కోసం ప్రతి గురువారం వెళ్తున్నట్లు సమాచారం. ఈ విషయం అధికారులకు తెలియకపోవడం ఏమిటని విమర్శలు వస్తున్నాయి.

హైకోర్టులో స్వల్ప అగ్నిప్రమాదం



దూద్‌బౌలి (హైదరాబాద్): హైకోర్టులో స్వల్ప అగ్నిప్రమాదం జరిగింది. జీపీ కార్యాలయం (గవర్నమెంట్ ప్లీడర్ ఆఫీస్) లోపల గురువారం రాత్రి కొన్ని ఫైల్స్‌కి మంటలు అంటుకున్నాయి. అక్కడ ఉన్న సిబ్బంది సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ సందర్భంగా హైకోర్టు సిబ్బంది మీడియాని లోపలికి అనుమతించలేదు. విషయం తెలిసిన వెంటనే చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్‌తో పాటు ఇన్‌స్పెక్టర్‌గురునాయుడు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ప్రాణం తీసిన క్రికెట్ బెట్టింగ్

- డబ్బులు పోవడంతో ఉరి వేసుకున్న యువకుడు
- రంగారెడ్డి జిల్లా నార్లగూడ తండాలో ఘటన


ప్రకాశ్ (ఫైల్)

షాద్‌నగర్: ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాన్ని బలిగొంది. రంగారెడ్డి జిల్లాలో గురువారం ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం నార్లగూడ తండాకు చెందిన ఆంగోతు అమర్, సువర్ణ దంపతుల రెండో కుమారుడు ప్రకాశ్ (19) పదో తరగతి పూర్తి చేసి.. టైల్స్ పని చేసేందుకు వెళుతున్నాడు. ప్రకాశ్ తరచుగా స్నేహితులతో కలసి ఐపీఎల్ జట్లపై క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొంటున్నట్లు సమాచారం. బుధవారం రాత్రి ఢిల్లీ, పంజాబ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు విజయం సాధిస్తుందని ప్రకాశ్ కొంత మంది స్నేహితులతో కలసి బెట్టింగ్‌లో పాల్గొన్నాడు. అయితే పంజాబ్ ఓడిపోవడంతో బెట్టింగ్ డబ్బులు ఇవ్వాలని స్నేహితులు వేధింపులకు గురిచేశారు. డబ్బులు లేకపోవడం, వారి నుంచి ఒత్తిడి పెరగడంతో మనోవేదనకు గురైన ప్రకాశ్.. బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెట్టింగ్‌లో ప్రకాశ్ లక్షన్నర రూపాయలకు పైగా పోగొట్టుకున్నట్లు సమాచారం. మృతుడి తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలోనే ఉంటా..: రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: మునుగోడు ఉపఎన్నికల్లో దుష్ప్రచారం చేసి ఓడించినట్టే.. ఇప్పుడు తాను పార్టీ మారుతున్నానంటూ కుట్రపూరిత ప్రచారం మొదలుపెట్టారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ మార్పు ప్రచారాన్ని కార్యకర్తలు సహా ఎవరూ నమ్మొద్దని, బీజేపీలోనే కొనసాగతానని స్పష్టంచేశారు. గురువారం రాజగోపాల్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత కొంతమంది తనను కాంగ్రెస్‌లోకి రమ్మని అడుగుతున్న మాట వాస్తవమేనన్నారు. అయితే కర్ణాటక ఫలితాలు తెలంగాణలోనూ పునరావృతం అవుతాయన్న అంచనా తప్పన్నారు. కేంద్రంలో బలమైన నాయకత్వం అధికారంలో లేకుండా తెలంగాణలో కేసీఆర్‌ను గద్దె దించడం సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్‌లో నాలుగు గ్రూపులు తయ్యారయ్యాయని, అలాంటి పార్టీతో కేసీఆర్‌ను ఢీకొనడం అసాధ్యమన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని, పార్టీ బలోపేతంపై బుధవారం పార్టీ నేత సునీల్ బన్సల్‌తో చర్చించినట్లు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

వడగళ్ల వాన విధ్వంసం

కూలిన ఇళ్లు, చెట్లు.. తడిసిన ధాన్యం


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మొండికుంట కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. అనేక గ్రామాల్లో ఇళ్లు నేలమట్టమయ్యాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. అశ్వాపురం మండలం మొండికుంట, మల్లెలమడుగు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం మొత్తం తడిసిపోయింది. మబ్బు పట్టగానే రైతులు ధాన్యంపై పరదాలు, టార్పాలిన్లు కప్పినప్పటికీ.. ఈదురుగాలులతో అవి ఎగిరిపోయాయి. మొండికుంటలో ధాన్యం కాంటా పెట్టినప్పటికీ.. గోడౌన్లు, మిల్లులకు తరలించడంలో నిర్వాహకుల నిర్లక్ష్యంతో ధాన్యం తడిసింది.

ధాన్యం కొనడం లేదని రైతుల ఆగ్రహం

బస్తాలకు నిప్పు పెట్టి నిరసన • ఆత్మహత్యాయత్నం చేసిన రైతు


ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: రైస్‌మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై అన్నదాతల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహిస్తూ జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. సెంటర్‌కు ధాన్యం తీసుకువచ్చి రెండు వారాలు గడుస్తున్నా ఇంతవరకు కొనుగోలు చేయడం లేదని ఆవేదనతో ఘన్‌పూర్‌కు చెందిన కామండ్ల వెంకటయ్య అనే రైతు గురువారం ఆత్మహత్య చేసుకునేందుకు పురుగు మందు తాగే ప్రయత్నం చేయగా తోటి రైతులు వారించారు. రైస్‌మిల్లర్లు, అధికారులు రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని, వారం రోజులుగా ఘన్‌పూర్ ఐకేపీ సెంటర్‌కు మిల్లర్లు లారీలు పంపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనంగా కోతకు తాము నిరాకరించడంతో బస్తాలను అన్‌లోడ్ చేయడం లేదని, దాంతో లారీలు రావడం లేదని వాపోయారు. సెంటర్‌లో ఇప్పటికే కాంటాలు చేసిన బస్తాలు ఉన్నాయని, చాలా మంది ధాన్యం ఆరబెట్టుకుని టోకెన్ల కోసం ఎదురు చూస్తున్నారని రైతులు తెలిపారు. ముందుగా కాంటా చేసిన బస్తాలు వెళ్తేనే ఇతర రైతులకు టోకెన్లు ఇస్తారని చెప్పారు. ఇప్పటికే అకాల వర్షాలతో నష్టపోయామని, మళ్లీ వర్షాలు వచ్చి ధాన్యం తడిస్తే తమ పరిస్థితి అధ్వాన్నంగా ఉంటుందని ఆవేదన చెందారు.

రైతులను గోస పెడుతున్నరు: జీవన్‌రెడ్డి



జగిత్యాల రూరల్: రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయక వారిని గోస పెడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లారీలు ఎప్పుడు వస్తున్నాయో తెలియడం లేదని, తూకంలో జాప్యంతో పాటు క్వింటాకు 10 కిలోల కోత విధిస్తున్నారని మొరపెట్టుకున్నారు. కేంద్రానికి ఐదు రోజులుగా లారీలు రావడం లేదని, తేమశాతం వచ్చిన ధాన్యాన్ని తూకం వేయడం లేదని వాపోయారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, అదనపు కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. లారీల కొరత తీర్చాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి తరలింపు చర్యలు చేపట్టాలన్నారు. క్వింటాలుకు 10 కిలోల కోత విధిస్తున్నా చర్యలు చేపట్టడం లేదని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

వడ్ల మిషన్‌లో పడి మహిళ మృతి

బొమ్మలరామారం మండలం మాల్యాల గ్రామంలో దుర్ఘటన


మాధవి (ఫైల్)

బొమ్మలరామారం: వడ్లు తూర్పారపట్టే మిషన్‌లో ప్రమాదవశాత్తూ పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని మాల్యాల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బాలకృష్ణ, మాధవి భార్యాభర్తలు. బాలకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా, మాధవి(40) రోజువారీ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మాధవి గురువారం మల్యాల గ్రామంలో ఓ రైతుకు చెందిన వడ్లు తూర్పారపట్ట డానికి కూలీ పనికి వెళ్లింది. తూర్పారపట్టే మిషన్ వద్ద పని చేస్తుండగా మిషన్‌కు, ట్రాక్టర్‌కు మధ్య గల రూటర్ రాడ్‌కు మాధవి చీర చుట్టుకోవడంతో ఆమె అందులో చిక్కుకుని కింద రాతి బండపై పడి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

సిద్ధూనే ముఖ్యమంత్రి

కర్ణాటక ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్

- అధికారికంగా ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్టానం
- సీఎల్పీ నేతగా సిద్దరామయ్య ఏకగ్రీవ ఎన్నిక
- గవర్నర్‌ను కలిసిన నేతలు.. ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత
- 20న మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణం
- సిద్ధూ, శివకుమార్‌తోపాటు పలువురు మంత్రుల ప్రమాణం
- లోక్‌సభ ఎన్నికల దాకా పీసీసీ అధ్యక్షుడిగా శివకుమార్



ఢిల్లీలో తన నివాసంలో డీకే, సిద్ధరామయ్యలతో ఖర్గే

సాక్షి, బెంగళూరు/బొమ్మనహళ్లి: ఐదు రోజుల ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. కర్ణాటక నూతన ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తుది నిర్ణయం తీసుకుంది. సుదీర్ఘమైన చర్చలు, బుజ్జగింపుల తర్వాత వెనుకబడిన తరగతికి చెందిన సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా, ఒక్కళిగ సామాజికవర్గానికి చెందిన శివకుమార్‌ను ఉప ముఖ్యమంత్రిగా ఖరారు చేసింది. గురువారం ఉదయం నుంచి రాత్రి దాకా పరిణామాలు వేగంగా జరిగిపోయాయి. సీఎంగా సిద్ధరామయ్య పేరును ఢిల్లీలో అధిష్టానం ఖరారు చేయడం, సాయంత్రం బెంగళూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమావేశమై, తమ శాసనసభాపక్ష నేత(సీఎల్పీ)గా ఆయనను లాంఛనంగా ఎన్నుకోవడం, వెంటనే రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గహ్లోత్‌ను సిద్ధరామయ్య కలిసి, కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయడం మెరుపు వేగంతో జరిగాయి. బెంగళూరులోని ఇందిరాగాంధీ భవన్‌లో గురువారం రాత్రి జరిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎంపీలు కూడా పాల్గొన్నారు. సీనియర్ నేతలు రణదీప్‌సింగ్ సూర్జేవాలా, సుశీల్‌కుమార్ షిండే, జితేంద్ర సింగ్ హాజరయ్యారు. సీఎల్పీ కొత్త నేతగా సిద్ధరామయ్య పేరును ప్రతిపాదిస్తూ డీకే ఒక తీర్మానం ప్రవేశపెట్టారు. పార్టీ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం సిద్ధరామయ్య, డీకే శివకుమార్, ఇతర నేతలు రాష్ట్ర గవర్నర్‌ను కలిశారు. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని గవర్నర్‌కు తెలియజేశారు.

మా చేతులు ఎప్పటికీ కలిసే ఉంటాయి: సిద్ధూ

సీఎంగా, డిప్యూటీ సీఎంగా తమ పేర్లను ప్రకటించిన తర్వాత సిద్ధూ, శివకుమార్ తమ ఐక్యతను చాటారు. ఖర్గేతో భేటీ చిత్రాన్ని సిద్ధూ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. ''కన్నడిగుల ప్రయోజనాల పరిరక్షణ కోసం మా చేతులు ఎప్పటికీ కలిసే ఉంటాయి. ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తాం' అని సిద్ధూ పేర్కొన్నారు. డీకే ఇదే ఫొటోను షేర్ చేశారు.

పలువురు సీఎంలకు, విపక్ష నేతలకు ఆహ్వానం

ముఖ్యమంత్రిగా తన ప్రమాణ స్వీకారోత్సవానికి సిద్ధరామయ్య పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, భావసారూప్యం కలిగిన విపక్ష నేతలను ఆహ్వానించారు. తమిళనాడు సీఎం స్టాలిన్, జార్ఖండ్ సీఎం సోరెన్, పశ్చిమ బెంగాల్ సీఎం మమత, బిహార్ సీఎం నితీశ్, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేలను ఆహ్వానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆహ్వానం పంపలేదని తెలిసింది.

ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తాం

ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్ సూర్జేవాలా గురువారం ఉదయం మీడియాతో మాట్లాడారు. కర్ణాటకలో ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమ పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గే నిర్ణయం మేరకు కర్ణాటక ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపడతారని తెలియజేశారు. వచ్చే లోకసభ ఎన్నికల దాకా కర్ణాటక పీసీసీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్ కొనసాగుతారని చెప్పారు. ఈ నెల 20న మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన ఆధిక్యాన్ని ఇచ్చారని, పేదలు, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పనిచేస్తుందని ఉద్ఘాటించారు. సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో పాటు 20 మందికిపైగా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం.

అధికారం చెరి సగం!

చెరో 30 నెలలు అధికార పంపిణీ సూత్రాన్ని ఏఐసీసీ ప్రతిపాదించినట్లు తెలిసింది. మొదటి 30 నెలలు సిద్ధరామయ్య సీఎంగా, డీకే శివకుమార్ డిప్యూటీ సీఎంగా, ఆ తర్వాత 30 నెలలు డీకే శివకుమార్ సీఎంగా, సిద్ధరామయ్య డిప్యూటీ సీఎంగా కొనసాగేలా కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. గురువారం ఉదయం కేసీ వేణుగోపాల్ తన నివాసంలో అల్పాహార విందుకు సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌ను ఆహ్వానించారు. రణదీప్‌సింగ్ సూర్జేవాలాతో కలిసి ఇరువురు నేతలతో చర్చించారు. హైకమాండ్ నిర్ణయాన్ని వివరించి, అధికార పంపిణీకి ఒప్పించారు. అల్పాహార విందు భేటీ తర్వాత సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ఒకే కారులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లారు. తద్వారా తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కలసికట్టుగా ఉన్నామనే సందేశాన్ని పంపించారు. మల్లికార్జున ఖర్గే తన నివాసంలో సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌తో చర్చించారు. వారికి ఆశీస్సులు అందజేశారు. సిద్ధూ, శివకుమార్‌తో జరిగిన తన భేటీ చిత్రాన్ని ఖర్గే ట్విట్టర్‌లో షేర్ చేశారు. 6.5 కోట్ల మంది కన్నడిగులకు తాము ఇచ్చిన ఐదు గ్యారంటీలను తప్పనిసరిగా అమలు చేస్తామని ఉద్ఘాటించారు. ఆ తర్వాత ఇద్దరు నాయకులు కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లారు. ఆయనతో భేటీ అయ్యారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ ఇరువురికి రాహుల్ గాంధీ సూచించారు.

సిద్ధూ.. అనుభవమే ఆభరణం

సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజాప్రతినిధుల బలం కలిసి వచ్చిన సిద్ధరామయ్య రెండోసారి కర్ణాటక ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజకీయాల్లో కొత్తలో కాంగ్రెస్‌కు వ్యతిరేకి అయిన ఆయన ఆ పార్టీ నుంచి రెండు సార్లు సీఎం కావడం విశేషం.

- మైసూరు జిల్లా సిద్ధరామనహుండి గ్రామంలో ఒక నిరుపేద రైతు కుటుంబంలో 1948 ఆగస్టు 12న జన్మించారు. రాష్ట్రంలో మూడో అతి పెద్ద సామాజిక వర్గమైన కురుబకు చెందిన నేత. లా చదివి కొన్నాళ్లు ప్రాక్టీస్ చేశారు. రైతు ఉద్యమాల్లో పాల్గొంటూ, వారి కేసుల్ని వాదిస్తూ రైతు లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు
- 1983లో రాజకీయాల్లో అడుగుపెట్టారు. జనతా పార్టీ నుంచి టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. భారతీయ లోక్‌దళ్ పార్టీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు
- అదే ఏడాది రామకృష్ణ హెగ్డే ఆధ్వర్యంలో జనతా పార్టీ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు.
- ఆ తర్వాత ఎన్నికల్లో జనతాదళ్ పార్టీ నుంచి చాముండేశ్వరి నుంచి అయిదు సార్లు నెగ్గారు. మూడు సార్లు ఓడిపోయారు.
- 1996లో జనతాదళ్ పార్టీ చీలిపోయినప్పుడు, దేవేగౌడ నేతృత్వంలో జేడీ(ఎస్) చీలిక పక్షానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు
- 2004 ఎన్నికల్లో కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. అప్పట్లోనే సీఎం కావాలన్న బలీయమైన ఆకాంక్షతో మైనార్టీలు, వెనుకబడిన వర్గాలు దళితులతో కూడిన అహిందా అనే ఫార్ములాతో ఆయా వర్గాల వారికి చేరువ కావడానికి రాష్ట్రమంతటా పర్యటించారు. సిద్ధరామయ్య చర్యతో ఇరకాటంలో పడిన హెచ్.డి. దేవెగౌడ డిప్యూటీ సీఎం పదవి నుంచి తప్పించారు.
- దీంతో 2006లో జేడీ(ఎస్)కు గుడ్‌బై కొట్టేసి కాంగ్రెస్‌లో చేరారు.
- 2013 ఎన్నికల్లో కాంగ్రెస్ నెగ్గడంతో సీఎం పదవి చేపట్టారు. రాష్ట్రంలో దేవ్‌రాజ్ తర్వాత పూర్తి కాలం సీఎంగా ఉన్నది ఈయనే
- 2019లో కాంగ్రెస్, జేడీ(ఎస్)ల నుంచి 15 మంది ఎమ్మెల్యేలు వెళ్లిపోవడంతో ప్రభుత్వం కుప్పకూలిపోయి, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. కాంగ్రెస్, జేడీ(ఎస్) ప్రభుత్వం కూలిపోవడం వెనుక సిద్ధరామయ్య హస్తం ఉందనే ఆరోపణలున్నాయి.

డీకే శివకుమార్.. ట్రబుల్ షూటర్

పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల్లో గెలిపించే బాధ్యతని తన భుజస్కంధాలపై మోసిన నాయకుడు. సీఎం పదవిపై ఆశపడి అయిదు రోజులు మొండిపట్టు పట్టినా చివరికి కాంగ్రెస్ హైకమాండ్‌కు విలువనిచ్చిన వీరవిధేయుడు.

- రాష్ట్రంలోని కనకపురలో దొడ్డలహళ్లి కెంపెగౌడ, గౌరమ్మ దంపతులకి 1962 మే 15న జన్మించారు. వొక్కలిగ సామాజిక వర్గీయుడు. కర్ణాటక రాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ నుంచి పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ పొందారు.
- 1980లో కాంగ్రెస్ విద్యార్థి విభాగం నాయకుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించి అంచెలంచెలుగా పార్టీలో ఎదిగారు
- 1989 అసెంబ్లీ ఎన్నికల్లో 27 ఏళ్ల వయసులో తొలిసారిగా సాథనూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్రతిహతంగా ఎనిమిది సార్లు విజయం సాధించారు. 1989 నుంచి 2004 వరకు సాథనూర్ నుంచి 2004 నుంచి 2023 వరకు తన స్వస్థలమైన కనకపుర నుంచి ఎన్నికయ్యారు. కనకపుర నియోజకవర్గాన్ని తనకి కంచుకోటగా మార్చుకున్నారు.
- బంగారప్ప, ఎస్.ఎం. కృష్ణ, సిద్ధరామయ్య హయాంలలో మంత్రిగా వ్యవహరించారు.
- కాంగ్రెస్ సంక్షోభ సమయాల్లో ఉన్నప్పుడు కాపాడుతూ పార్టీలో ట్రబుల్ షూటర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2002లో మహారాష్ట్రలో విలాస్‌రావు ప్రభుత్వం విశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఎమ్మెల్యేలను కాపాడే బాధ్యతని శివకుమార్ తీసుకున్నారు.
- 2017 రాజ్యసభ ఎన్నికల్లో అహ్మద్ పటేల్‌ను గెలిపించిన ఘనత శివకుమార్‌దే. అప్పుడు కూడా ఎమ్మెల్యేలందరినీ కూడగట్టి గుజరాత్ రిసార్ట్‌లో ఉంచి పటేల్ నెగ్గేలా చేశారు.
- 2018లో హంగ్ అసెంబ్లీ వచ్చినప్పుడు కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటులో కీలక భాగస్వామి అయ్యారు.
- 2018 సెప్టెంబర్‌లో శివకుమార్‌పై ఈడీ కేసులు నమోదయ్యాయి.
- 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పీసీసీ అధ్యక్షుడి పగ్గాలు అందుకొని వ్యూహాత్మకంగా రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేశారు. దాని ఫలితంగానే కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యమైన విజయం సాధించింది.
- 2019 సెప్టెంబర్ 3న మనీలాండరింగ్ కేసులో ఈడీ ఆయనను అరెస్ట్ చేసింది. నెలరోజులకి పైగా తీహార్ జైల్లో గడిపారు.
- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ పడిన అత్యంత ధనికుల్లో శివకుమార్‌ది మూడోస్థానం. నియోజకవర్గంలో కేవలం ఒక్క రోజు ప్రచారంతో తన ప్రత్యర్థిపై లక్షకు పై చిలుకు మెజార్టీతో విజయం సాధించడం మరో సంచలనం.

క్లుప్తంగా

బెంగాల్‌లో 'ది కేరళ స్టోరీ' బ్యాన్‌పై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: వివాదాస్పద 'ది కేరళ స్టోరీ'సినిమాకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. రాష్ట్రంలో సినిమా ప్రదర్శనపై నిషేధం విధిస్తూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై స్టే విధించింది. బెంగాల్ ప్రభుత్వ చర్యను సవాల్ చేస్తూ చిత్ర నిర్మాత వేసిన పిటిషన్‌పై ఈ మేరకు ఆదేశాలిచ్చింది. కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాల ఆధారంగా బెంగాల్ ప్రభుత్వం ప్రదర్శనను నిలిపివేయరాదని పేర్కొంది. 'తమిళనాడులో ది కేరళ స్టోరీపై నిషేధం ఏదీ లేదు. సినిమాకు సీబీఎఫ్‌సీ క్లియరెన్స్ వచ్చినందున శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే' అని స్పష్టం చేసింది. సినిమా ప్రేక్షకుల రక్షణకు చర్యలు తీసుకోవాలంది.

అమెరికాలో భారతీయ మహిళ ఘనత



న్యూయార్క్: భారత సంతతికి చెందిన ప్రతిమా భుల్లార్ మల్డొనాడో న్యూయార్క్ పోలీస్ డిపార్ట్‌మెంట్(ఎన్‌వైపీడీ)లో అత్యున్నత స్థాయి అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఘనత సాధించిన మొట్టమొదటి దక్షిణాసియా మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. గత నెలలో ఆమెకు కెప్టెన్‌గా పదోన్నతి లభించింది. క్వీన్స్‌లోని సౌత్ రిచ్‌మండ్ హిల్‌లో 102వ పోలీస్ ప్రిసింక్ట్‌కు ఆమె నేతృత్వం వహిస్తున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో ఇదే అతిపెద్ద హోదా. పంజాబ్‌లో జన్మించిన ప్రతిమ కుటుంబం ఆమెకు తొమ్మిదేళ్ల వయసప్పుడు న్యూయార్క్‌లోని క్వీన్స్‌కు వలసవెళ్లింది. 'మా నాన్న ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఎంతో కష్టపడి మమ్మల్ని పోషించారు. 2006లో ఆయన చనిపోయారు. ఆయన ఉండి ఉంటే నన్ను చూసి ఎంతో సంతోషపడేవారు'అని ప్రతిమ మీడియాతో అన్నారు.

ఇమ్రాన్ నివాసం దిగ్బంధం

లాహోర్: పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నివాసంలో దాగున్న ఉగ్రవాదుల అరెస్ట్‌కు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఇమ్రాన్ నివాసంలో ఉన్న సుమారు 40 మంది ఉగ్రవాదులను 24 గంటల్లోగా అప్పగించాలంటూ పంజాబ్ ప్రభుత్వం బుధవారం గడువిచ్చిన విషయం తెలిసిందే. ఆ గడువు పూర్తి కావడంతో భారీ సంఖ్యలో పోలీసులు లాహోర్‌లో జమాన్ పార్క్ ఏరియాలో ఉన్న ఇమ్రాన్ నివాసాన్ని చుట్టుముట్టారు. ఈ నెల 9వ తేదీన సైన్యానికి చెందిన ప్రాంతాలపై దాడులకు పాల్పడినట్లు అనుమానిస్తున్న 8 మందిని జమాన్ పార్క్ ఏరియాలో నిర్బంధంలోకి తీసుకున్నట్లు సీనియర్ పోలీసు అధికారి ఒకరు చెప్పారు. అయితే, ఇందులో నిజం లేదని ఇమ్రాన్ ఖండించారు.

జల్లికట్టుకు జై

ఎడ్ల పందేలు, కంబళ నిర్వహణకూ అనుమతి

సంబంధిత తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర సవరణ చట్టాలను సమర్థించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ/చెన్నై: ఎద్దులు, దున్నలు, గేదెలతో నిర్వహించే జల్లికట్టు, ఎడ్ల పందేలు, కంబళ వంటి జంతు క్రీడల నిర్వహణకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతినిచ్చింది. ఈ క్రీడలు జంతు హింస పరిధిలోకి రావని స్పష్టంచేస్తూ గత ఏడాది డిసెంబర్ ఎనిమిదిన రిజర్వ్ చేసిన తీర్పును బుధవారం వెల్లడించింది. ఈ క్రీడల నిర్వహణకు అనుగుణంగా తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన సవరణ చట్టాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సమర్థించింది. జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సీటీ రవికుమార్‌లు సభ్యులుగా ఉన్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. 'రాష్ట్రాల్లో చేసిన ఆయా సవరణ చట్టాల్లోని నియమ నిబంధనలు ఖచ్చితంగా అమలయ్యేలా చూసే బాధ్యత జిల్లా మేజిస్ట్రేట్/ సంబంధిత కార్యనిర్వహణ వర్గానిదే. శతాబ్దాలుగా తమిళనాట జల్లికట్టు క్రీడ కొనసాగుతోంది. ఇందుకు అనుగుణంగా ఆ రాష్ట్ర శాసనసభ చట్టంలో జోక్యం చేసుకునే ఉద్దేశం సుప్రీంకోర్టుకు లేదు. తమిళనాడు సవరణ చట్టంపై మేం తీసుకున్న నిర్ణయమే మహారాష్ట్ర, కర్ణాటక సవరణ చట్టాలకూ వర్తిస్తుంది.' అని ధర్మాసనంలోని జడ్జీలు తన తీర్పులో స్పష్టంచేశారు. కాగా, 'తమిళుల సాహసం, సంస్కృతికి దర్పణం ఈ క్రీడ. ఈ తీర్పు తమిళనాడు రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. రాష్ట్ర చట్టాన్ని కోర్టు సమర్థించినందుకు సూచికగా వచ్చే జనవరి పొంగళ్ సీజన్‌లో విజయోత్సవ వేడుక చేస్తాం' అని తీర్పు అనంతరం తమిళనాడు సీఎం స్టాలిన్ ట్వీట్‌చేశారు. కాగా, తీర్పుపై జంతుప్రేమికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'జల్లికట్టులో జనం చస్తున్నా అమూల్య సంప్రదాయమంటూ కోర్టు క్రూరమైన క్రీడను పరిరక్షిస్తోంది. తీర్పుపై న్యాయపరంగా ఉన్న అవకాశాలను పరిశీలిస్తాం' అని పెటా ఇండియా వ్యాఖ్యానించింది.

రాణాను భారత్‌కు అప్పగించండి

అమెరికాలోని కాలిఫోర్నియా జిల్లా కోర్టు ఆదేశం



న్యూయార్క్/న్యూఢిల్లీ: అమెరికాలో సాగిస్తున్న న్యాయ పోరాటంలో భారత్‌కు అతిపెద్ద విజయం లభించింది. 2008 నవంబర్‌నాటి ముంబై ఉగ్రవాద దాడిలో ప్రధాన నిందితుడైన తహవుర్ రాణా(62)ను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా న్యాయస్థానం అంగీకరించింది. రాణాను భారత్‌కు అప్పగించాలని కాలిఫోర్నియాలోని 'డిస్ట్రిక్ట్ కోర్టు ఆఫ్ ద సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియా' మేజిస్ట్రేట్ జడ్జి జాక్వెలిన్ కూల్జియన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఈ నెల 16వ తేదీన ఉత్తర్వు జారీ చేశారు. భారత్-అమెరికా మధ్య అమల్లో ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందం కింద రాణాను భారత్‌కు అప్పగించాలని పేర్కొన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో అమెరికాలో పర్యటించనున్నారు. మోదీ పర్యటనకు నెల రోజుల ముందు తహవుర్ రాణాను భారత్‌కు అప్పగిస్తూ ఈ ఉత్తర్వు వెలువడడం గమనార్హం. పాకిస్తాన్ సంతతికి చెందిన తహవుర్ రాణాకు కెనడా పౌరసత్వం ఉంది. ఉగ్రవాదులకు సాయం చేశాడన్న ఆరోపణల కింద రాణాకు అమెరికాలోని షికాగో కోర్టు గతంలో 14 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. కాగా, రాణాను సాధ్యమైనంత త్వరగా, వేగంగా భారత్‌కు తరలించడానికి అమెరికా అధికారులతో తరచుగా సంప్రదింపులు జరుపుతున్నామని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా గురువారం తెలిపారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మేఘ్‌వాల్‌ను అభినందిస్తున్న రిజిజు

'న్యాయశాఖ' నుంచి రిజిజుకు ఉద్వాసన

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియంలో మరింత పారదర్శకత కోరుతూ తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెణ్ రిజిజును ఆ శాఖ బాధ్యతల నుంచి మోదీ సర్కార్ తప్పించింది. న్యాయవ్యవస్థతో ఎలాంటి బేధాభిప్రాయాలు పొడచూపకూడదనే ఉద్దేశంతోనే ఈయన శాఖను మార్చారని తెలుస్తోంది. పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖల స్వతంత్ర మంత్రి అర్జున్‌సింగ్ మేఘ్‌వాల్‌కు న్యాయశాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. కేబినెట్ ర్యాంక్‌లేని ఒక స్వతంత్ర హోదా మంత్రికి కీలకమైన న్యాయశాఖను అప్పగించడం గత పాతికేళ్లలో ఇదే తొలిసారి.

ఎందుకు మార్చారు ?

సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో జడ్జీలను సొంతంగా సుప్రీంకోర్టే కొలీజియం పేరిట నియమించుకోవడం ఎక్కడా లేదని, ఇదొక ఏలియన్ విధానం అని, మాజీ జడ్జీలు దేశవ్యతిరేక గ్యాంగ్‌లుగా తయారయ్యారని రిజిజు గతంలో ఆరోపించారు. దీంతో తమ బాధ్యతలు, విధుల్లో ప్రభుత్వ జోక్యం అనవసరమని సుప్రీంకోర్టు కొలీజియం ఘాటుగా బదులిచ్చింది. మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న ఈ తరుణంలో రిజిజు వ్యాఖ్యలు విపక్షాలకు ఎన్నికల అస్త్రంగా మారకూడదనే ఉద్దేశంతోనే ఆయనను తప్పించినట్లు వార్తలొచ్చాయి. ఇన్నాళ్లూ మరో మంత్రి జితేంద్ర సింగ్ నిర్వహించిన భూ విజ్ఞానశాస్త్ర శాఖను రిజిజుకు అప్పగించారు. ప్రధాని మోదీ సలహా మేరకు రిజిజు, మేఘ్‌వాల్ శాఖలను మార్చుతున్నట్లు గురువారం రాష్ట్రపతిభవన్ ఒక నోటిఫికేషన్ విడుదలచేసింది. కాగా, బాధ్యతలు మారడంపై రిజిజు స్పందించారు. 'భూ విజ్ఞాన శాఖలో ప్రధాని మోదీ దార్శనికతను సుసాధ్యం చేసేందుకు శాయశక్తుల కృషిచేస్తా. ఇంతకాలం న్యాయశాఖ మంత్రిగా కొనసాగడం గౌరవంగా భావిస్తున్నా. ఇందుకు మద్దతు పలికిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌సహా మొత్తం న్యాయవ్యవస్థకు నా కృతజ్ఞతలు' అని రిజిజు ట్వీట్ చేశారు.

28న పార్లమెంట్ కొత్త భవనం ప్రారంభం

న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధాని మోదీ ఈ నెల 28వ తేదీన ప్రారంభించనున్నారు. భవన ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధాని మోదీని స్పీకర్ బిర్లా గురువారం ఆహ్వానించారని లోక్‌సభ సెక్రటేరియట్ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ కొత్త భవనం లోక్‌సభ చాంబర్‌లో 888 మంది సభ్యులు కూర్చునేందుకు వీలుండగా, రాజ్యసభ చాంబర్‌లో 300 మంది సభ్యులు కూర్చోవచ్చు. ప్రస్తుత పార్లమెంట్ భవనం 1927లో బ్రిటిష్ జమానాలో 96 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్లుగా ఇప్పుడది లేదు. దీంతో, 2020 డిసెంబర్ 10న ప్రధాని మోదీ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు.

రబ్రీ దేవిని ప్రశ్నించిన ఈడీ

న్యూఢిల్లీ: ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో మనీ ల్యాండరింగ్ ఆరోపణలపై ఆర్‌జేడీ చీఫ్ లాలూ భార్య, బిహార్ మాజీ ముఖ్యమంత్రి రబ్రీ దేవిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం 5 గంటలపాటు ప్రశ్నించారు. రబ్రీ దేవి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఉద్యోగార్థుల నుంచి ఖరీదైన భూములను తక్కువ ధరకే తీసుకుని, రైల్వేలో ఉద్యోగాలిచ్చినట్లు ఈడీ ఆరోపిస్తోంది.

ప్రతిష్ట పెరిగాక కళాఖండాలు తిరిగిస్తున్నారు

న్యూఢిల్లీ/పూరీ/హౌరా: విశ్వవ్యాప్తంగా భారత ప్రాచీన సంస్కృతిపై ప్రపంచదేశాలకు గౌరవం మరింత ఇనుమడించిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలో ఇంటర్నేషనల్ మ్యూజియం ఎక్స్‌పో–2023ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. 'ప్రాచీన భారతీయ కళాఖండాలు స్మగ్లింగ్‌కు గురికావడం ఆందోళనకరం. మరోవైపు దేశ ప్రతిష్ట అంతర్జాతీయంగా మరింత పెరగడంతో పలు దేశాల ప్రభుత్వాలు తమ దేశంలోని భారతీయ కళాఖండాలను తిరిగి ఇచ్చేస్తున్నాయి. వారణాసిలో చోరీకి గురైన మా అన్నపూర్ణ విగ్రహం, గుజరాత్‌లో మాయమైన మహిషాసురమర్దిని విగ్రహం, గురు హర్‌గోవింద్ జీ పేరు చెక్కి ఉన్న ఖడ్గం ఇటీవలే భారత గడ్డకు తిరిగొచ్చాయి. ఈ ఎక్స్‌పోతో భారత్‌లో మ్యూజియం సంస్కృతి దశ మారుతుంది. అమృత్‌కాల్‌లో మనం నిర్దేశించుకున్న పంచప్రాణ తీర్మానాల్లో ఒకటైన 'మన వారసత్వానికి పునరుజ్జీవనం'కు ప్రాధాన్యతనిద్దాం' అని మోదీ అన్నారు.

ఒడిశాలో తొలి వందేభారత్ రైలు

రూ.8,200 కోట్లతో ఒడిశాలో పూర్తిచేసిన రైల్వే ప్రాజెక్టులను మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒడిశాలోని పూరీ పట్టణం నుంచి పశ్చిమబెంగాల్‌లోని హౌరా పట్టణాల మధ్య నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును మోదీ ప్రారంభించారు. ఈ రూట్‌లో ఇదే అత్యంత వేగవంతమైన రైలు. కేవలం ఆరున్నర గంటల్లో 500 కి.మీ.ల దూరాన్ని చేరనుంది. ఇది ఒడిశా రాష్ట్రంలోని తొలి వందేభారత్ రైలు.

బీజేపీ ఎంపీ కటారియా కన్నుమూత

చండీగఢ్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ రత్తన్ లాల్ కటారియా(71) గురువారం కన్నుమూశారు. హరియాణాలోని ఓ గ్రామంలో 1951లో జన్మించిన ఆయన అంబాలా లోక్‌సభ స్థానం నుంచి 1999, 2014, 2019 ఎన్నికల్లో గెలుపొందారు. కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రిగా, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ మంత్రిగా 2019–21 కాలంలో పనిచేశారు. హరియాణా రాష్ట్ర మంత్రిగానూ ఆయన సేవలందించారు.

ఎల్‌పీ 791-18 డి అనే పేరున్న గ్రహమిది. భూమి పరిమాణంలో ఉంటుంది. భూమికి 90 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీన్లో అగ్ని పర్వతాలు భారీగా ఉండొచ్చని ఖగోళ పరిశోధకులు చెబుతున్నారు. జీవించడానికి అనువైన పరిస్థితులు ఇక్కడ ఉండే అవకాశాలున్నాయంటున్నారు.



ముంపు బారిన న్యూయార్క్

ఏటా 2 మిల్లీమీటర్ల చొప్పున భూమిలోకి కూరుకుపోతున్న నగరం ● ఆకాశహర్మ్యాలు, సముద్ర మట్టం పెరుగుదలే కారణం



అగ్రరాజ్యం అమెరికాలో ముఖ్యమైన సిటీ న్యూయార్క్. ఖరీదైన కలల నగరంగా, నిద్రపోని నగరంగా పేరుగాంచింది. న్యూయార్క్ సిటీ ఇప్పుడు ముంపు ముప్పును ఎదుర్కొంటోంది. క్రమక్రమంగా భూమిలోకి కూరుకుపోతోంది. ఇందుకు ప్రధాన కారణాలు సిటీలో ఉన్న వేలాది ఆకాశహర్మ్యాలు, వాతావరణ మార్పుల వల్ల సముద్ర మట్టం పెరుగుతుండడం. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్ర తీరంలో ఉన్న న్యూయార్క్ ప్రతిఏటా 2 మిల్లీమీటర్ల మేర కుంగిపోతున్నట్లు యూనివర్సిటీ ఆఫ్ రోడ్ ఐలాండ్ సైంటిస్టుల తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. ఈ వివరాలను 'అడ్వాన్సింగ్ ఎర్త్, స్పేస్ సైన్స్' పత్రికలో ప్రచురించారు. సముద్ర మట్టం పెరుగుదలకు తోడు భారీ భవనాల వల్ల న్యూయార్క్‌లో భూమిపై ఒత్తిడి పెరుగుతోందని, అందుకే నగరం మునిగిపోతోందని పరిశోధకులు చెబుతున్నారు. ఇప్పటికైనా మేల్కొని నివారణ చర్యలు చేపట్టకపోతే రానున్న రోజుల్లో ఈ ముంపు తీవ్రత ఇంకా ఉధృతమవుతుందని అంటున్నారు. నగరం నివాస యోగ్యం కాకుండాపోయే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం న్యూయార్క్ సిటీకే పరిమితమైన సమస్య కాదని, ప్రపంచ వ్యాప్తంగా సముద్ర తీర ప్రాంతాల్లోని నగరాలు ముంపు బారిన పడుతున్నాయని పేర్కొంటున్నారు.

- భారతదేశంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని జోషీమఠ్ పట్టణంలో ఇటీవల ఇళ్లు కూలిపోయిన సంగతి గుర్తుండే ఉంటుంది. పగుళ్లు ఏర్పడడంతో చాలా ఇళ్లను కూల్చేయాల్సి వచ్చింది. జోషీమఠ్‌లో భూమి అంతర్భాగంలో ఒత్తిడి వల్లే ఇళ్లు కూలిపోయినట్లు గుర్తించారు. న్యూయార్క్‌లోనూ ఈ తరహా ఉత్పాతం పొంచి ఉందని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు.
- న్యూయార్క్ నగర జనాభా 80 లక్షల పైమాటే. ఆకాశాన్నంటే భారీ భవనాలతో సహా 10 లక్షల దాకా భవనాలు ఉన్నాయి. ఇక్కడ కొన్ని ప్రాంతాలు ఏటా 2 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగానే భూమిలోకి కూరుకుపోతున్నాయి.
- ఉత్తర అమెరికాలో అట్లాంటిక్ తీరంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే సముద్ర మట్టం పెరుగుదల వల్ల ముంపు ముప్పు న్యూయార్క్‌కు మూడు నుంచి నాలుగు రెట్లు అధికంగా ఉందని పరిశోధకులు తెలియజేశారు.
- మరో 80 ఏళ్లలో.. అంటే 2100వ సంవత్సరం నాటికి న్యూయార్క్ సిటీ 1,500 మిల్లీమీటర్లు కుంగిపోతుందని అధ్యయనంలో గుర్తించారు.
- న్యూయార్క్‌పై ప్రకృతి విపత్తుల దాడి కూడా ఎక్కువే. 2012లో సంభవించిన శాండీ తుపాను కారణంగా సముద్రపు నీరు నగరంలోకి చొచ్చుకువచ్చింది. చాలా ప్రాంతాలు జలవిలయంలో చిక్కుకున్నాయి. 2021లో సంభవించిన ఇడా తుఫాను వల్ల సిటీలో మురుగునీటి కాలువలు ఉప్పొంగాయి. డ్రైనేజీ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారింది.
- కోస్టల్ సిటీలకు ముంచుకొస్తున్న ప్రమాదానికి న్యూయార్క్ ఒక ఉదాహరణ అని 'యూనివర్సిటీ ఆఫ్ రోడ్ ఐలాండ్'కు చెందిన గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఓషియనోగ్రఫీ సైంటిస్టులు చెప్పారు. ఈ సమస్య ప్రపంచానికి ఒక సవాలు లాంటిదేనని అన్నారు. సముద్ర మట్టాలు పెరగకుండా అన్ని దేశాలు కలిసి చర్యలు తీసుకోవాలని, సముద్ర తీర ప్రాంతాల్లోని నగరాల్లో భవనాల నిర్మాణంపై నియంత్రణ విధించాలని సూచించారు.
- సముద్ర తీరంలో, నది ఒడ్డున, చెరువుల పక్కన నిర్మించే భారీ భవనాలు భవిష్యత్తులో వరద ముంచెత్తడానికి, తద్వారా ప్రాణ నష్టానికి కారణమవుతాయని వివరించారు.
- అన్నింటికంటే ముఖ్యంగా మితిమీరిన నగరీకరణ, పట్టణీకరణ అనేవి ప్రమాద హేతువులేనని తేల్చిచెప్పారు.
- అడ్డూ అదుపూ లేకుండా నగరాలు, పట్టణాలు విస్తరిస్తున్నాయి. వర్షం పడితే అవి చెరువుల్లా మారుతుండడం మనం కళ్లారా చూస్తూనే ఉన్నాం. - సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
కరీంనగర్
శుక్రవారం | 19 | మే | 2023



పచ్చిరొట్టకు సమయమిదే..
ఈనెల 25 నుంచి రోహిణీ కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో పచ్చిరొట్ట సాగు చేసేందుకు ఇదే సమయమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. 8లో▸



ఎండతో ఆటలొద్దు..
కొద్దిరోజులుగా ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో క్రీడాకారులు, చిన్నారులు జాగ్రత్తగా వ్యవహరించాలని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం
ఎండ తీవ్రత కొనసాగుతుంది. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. సాయంత్రం వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

క్వింటాల్ పత్తిధర రూ.7,450



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,450 పలికింది. గురువారం మార్కెట్‌కు 23వాహనాల్లో 279 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. మోడల్ ధర రూ.7,200, కనిష్ట ధర రూ.7,000 పలికింది. గన్నీ సంచుల్లో ఏడుగురు రైతులు ఆరు క్వింటాళ్ల పత్తిని తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,050, మోడల్ ధర రూ.6,000, కనిష్ట ధర రూ.5,800కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కాగా.. శుక్రవారం అమావాస్య, శని, ఆదివారాల్లో సాధారణ సెలవులు ఉన్నందున మూడురోజుల పాటు మార్కెట్ యార్డులో క్రయ విక్రయాలు ఉండవని, సోమవారం క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని మార్కెట్ కార్యదర్శి గూగులోతు రెడ్డినాయక్ వివరించారు.

మంచినీళ్ల కోసం ఆందోళన



జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లి 5వ వార్డులో ఐదురోజులుగా నల్లా నీళ్లు రావడంలేదని మహిళలు ఆందోళనకు దిగారు. వీరికి స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకులు మద్దతుగా నిలిచారు. ఐదు రోజులుగా మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. యూత్ కాంగ్రెస్ హుజూరాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు సజ్జాద్ మొహమ్మద్, సీనియర్ నాయకులు సతీశ్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, మహిళలు భోగ లలిత, రమారాజేశ్వరి, రబ్బాన, సుందరమ్మ, స్వరూప, షబానా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గన్నేరువరం: ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా గన్నేరువరం మండలంలో గురువారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పర్యటించారు. వననర్సరీ, మనఊరు- మనబడి, కాంపోస్టుషెడ్డు, బోరురీచార్జీ గుంతలు పరిశీలించారు. వారసంతను సందర్శించి గ్రామానికి చెందిన అంజయ్య ఇంటివద్ద తడిపొడి చెత్త విధానాన్ని తెలుసుకున్నారు. శ్మశాన వాటికను పరిశీలించారు. ఖాసీంపేట గ్రామాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌రావు సందర్శించారు. వననర్సరీ, కంపోస్టు షెడ్డును పరిశీలించారు. డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్‌పీవో హరికిషన్, ఎంపీడీవో స్వాతి, ఎంపీవో నర్సింహారెడ్డి, ఎస్‌బీఎం సభ్యులు కిషన్‌స్వామి, రమేశ్, వేణు, సర్పంచులు పుల్లెల లక్ష్మీ, గంప మల్లీశ్వరీ, సహకార సంఘం డైరెక్టర్ గంప వెంకన్న పాల్గొన్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం

చిగురుమామిడి(హుస్నాబాద్): చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్‌లో ఉన్న ఆదర్శపాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. విద్యార్థినులకు హాస్టల్ వసతి సౌకర్యం ఉన్నట్లు వివరించారు.

వడివడిగా భూసేకరణ

- ఎన్‌హెచ్ 563 ప్రక్రియ వేగవంతం
- వరంగల్- కరీంనగర్ సెక్షన్‌లో భూసేకరణ దాదాపు పూర్తి
- ఇంకా కొన్ని చోట్ల తొలగని భూ వివాదాలు
- న్యాయం చేయాలంటున్న నిర్వాసితులు
- జగిత్యాల - వరంగల్ మధ్య త్వరలో పనులు ప్రారంభం



ఎన్‌హెచ్ 563


సాక్షి ప్రతినిధి, కరీంనగర్:జగిత్యాల, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల మధ్య నిర్మించనున్న జాతీయరహదారి-563 భూసేకరణ వేగవంతం చేశారు. కరీంనగర్-వరంగల్ సెక్షన్‌లో ఈ ప్రక్రియ ముగింపునకు వచ్చింది. పనులు వేగవంతం చేయాలని తాజాగా కలెక్టర్ కర్ణన్ ఆర్డీవోలను ఆదేశించారు. ఈ జాతీయ రహదారి కోసం కరీంనగర్ జిల్లాలో 258.67హెక్టార్ల భూమి అవసరం. కొంతకాలంగా జిల్లాలోని కేశవపట్నం, మానకొండూరు, కొత్తపల్లి మండలాల్లో పలువురు రైతులు, నిర్వాసితులు తమ భూమి పరిహారం కోసం న్యాయపోరాటం చేస్తున్నారు.

మిగిలింది రెండు హెక్టార్లు మాత్రమే

ఎన్‌హెచ్ 563 మొత్తం 248.83 కిలోమీటర్లు. దీన్ని కరీంనగర్- వరంగల్, కరీంనగర్- జగిత్యాల సెక్షన్లుగా విభజించి భూసేకరణ చేపట్టారు. జగిత్యాల, వరంగల్, మరిపెడ, ఖమ్మం సమీపంలో జంక్షన్లు నిర్మించనున్నారు. కరీంనగర్ - వరంగల్ సెక్షన్‌లో మొత్తం 258.67 హెక్టార్ల భూసేకరణ ప్రారంభించారు. ఇందుకోసం భూసేకరణ ప్రక్రియను 3ఏ, 3జీ, 3డీ-లుగా విభజించారు. 3 హెచ్‌లో మాత్రం ఇంకా 2.21 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఆ వెంటనే పనులు ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

పరిహారం కోసం పోరాటం

రహదారి నిర్మాణంలో సేకరించాల్సిన భూమిలో కొందరు రైతులు, భూమిని కోల్పోతున్న వారు పరిహారం విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం సరిపోదని, మార్కెట్ రేటుకు తగినట్టుగా ఇవ్వాలని పట్టుబట్టుతున్నారు. ఇంటి స్థలాలకు, పంటభూములకు చెల్లించే పరిహారంలో వ్యక్తులను బట్టి చెల్లిస్తున్నారని,పలుకుబడి ఉన్నవారికి ఒకలా, లేని వారికి మరోలా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా మండలాలకు చెందిన పలువురు రైతులు, భూ నిర్వాసితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ కర్ణన్ ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఎన్‌హెచ్ 563 రూట్‌మ్యాప్

అనూహ్యంగా పెరిగిన అంచనా

జగిత్యాల- కరీంనగర్ సెక్షన్‌లో కరీంనగర్ బస్టాండు నుంచి కోర్టు చౌరస్తా, రేకుర్తి కొత్తపల్లి మీదుగా వెళ్లే దారిలో కొన్ని మార్పులు జరిగాయి. మానకొండూరు మీదుగా ఇరుకుల్ల వాగు జూబ్లీనగర్, ఎలబోతారం, రుక్మాపూర్ మీదుగా రోడ్డు కొత్తపల్లిలో కలువనుంది. ఈ రహదారి వెంట 11 బ్రిడ్జిలు నిర్మించనున్నారు. మొత్తం 68 కిలోమీటర్ల పొడవున్న ఈ రోడ్డు నిర్మాణానికి గతేడాది దాదాపు రూ.1491 కోట్లు ఖరారయ్యాయి. ఈ అంచనా వ్యయం తాజాగా రూ.2,146 కోట్లుకు చేరుకుందని సమాచారం. అంటే దాదాపు రూ.655 కోట్లు అంచనా వ్యయం పెరిగింది. ఇటీవల జగిత్యాల- కరీంనగర్ సెక్షన్‌లో జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు 58 కిలోమీటర్ల వరకు రూ.1503.866 కోట్ల వ్యయం నిర్ధారిస్తూ.. ఈ ఏడాది సెప్టెంబరులో అంచనావ్యయానికి సంబంధించిన వివరాలు కూడా వెల్లడయ్యాయి

తీవ్రంగా నష్టపోతున్న



నాకు అన్నారం శివారులో వ్యవసాయభూమి ఉంది. అందులో నుంచి నేషనల్ హైవే 563 రోడ్డు వెళ్తుంది. నాకున్న 2.21 ఎకరాలు రోడ్డులో పూర్తిగా కోల్పోవాల్సి వస్తోంది. మార్కెట్లో గుంటకు పది లక్షలు ధర పలుకుతోంది. అధికారులు గుంటకు రూ.42,000 చెలిస్తామంటున్నారు. మొత్తం భూమిని కోల్పోవడం బాధ కలిగిస్తుండగా, పరిహారం కూడా తక్కువగా చెల్లిస్తున్నారు. కరీంనగర్ పట్టణానికి అనుకొని ఉన్న భూములకు ఇంత తక్కువ ధర చెల్లించడం అన్యాయం.

– గోగూరి రాజు, రైతు, ముంజంపల్లి

బాధలు వర్ణనాతీతం



నేషనల్ హైవే 563 కింద మూడు గుంటల ఇల్లు, ఇంటిఅడుగు స్థలం కోల్పోతున్నా. అధికారులు వ్యవసాయ భూమి కింద రాసుకొని పోయి, గుంటకు రూ.83వేలు చెల్లిస్తున్నారు. ఇంటిని పరిహారం జాబితాలో నమోదు చేయలేదు. అధికారుల తప్పిదంతో నాకు నష్టం జరుగుతుంది. రహదారిని ఆనుకుని ఉన్న భూమికి బహిరంగ మార్కెట్లో గుంటకు రూ.10 లక్షల నుంచి రూ.12లక్షలు పలుకుతుంటే.. గుంటకు రూ.83 వేలు చెల్లించడం అన్యాయం.

– ఆకుల సదానందరావు, గట్టుదుద్దెనపల్లి

పీఎంఎఫ్‌ఎంఈ పథకం త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ ఆర్వీ.కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్: అసంఘటిత సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ రంగ నాణ్యత ప్రమాణాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తుల సంస్థ క్రమబద్ధీకరణ పథకం(పీఎంఎఫ్‌ఎంఈ) త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్తత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణపై అందించే రుణాలపై డీఆర్డీఏ, పరిశ్రమలశాఖ, మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకర్లతో సమీక్షించారు. లబ్ధిదారులు వివిధ రకాల సూక్ష్మ ఆహార ఉత్పత్తులు తయారు చేయడానికి వ్యక్తిగత మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కామన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, స్వయం సహాయక బృందాలకు ప్రాజెక్టులో 35శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాకు 572 లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు ఆధార్, బ్యాంకుఖాతా, లైసెన్సు, ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను బ్యాంకులో అందించేలా చూడాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, శిక్షణ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, డీఆర్డీవో శ్రీలత, ఎల్‌డీఎం ఆంజనేయులు, పరిశ్రమలశాఖ అధికారి నవీన్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ పాల్గొన్నారు.

తీగలవంతెన పనులు పరిశీలన

జిల్లాకు తలమానికంగా నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జి పనులను గురువారం కలెక్టర్ కర్ణన్ పరిశీలించారు. పనులు వేగంగా నిర్వహించేలా చూడాలని, డైనమిక్ లైటింగ్ ఏర్పాటు ఇప్పటికే చివరిదశకు చేరుకోగా.. త్వరగా పూర్తిచేయడంతో పాటు టెస్టింగ్ చేపట్టాలన్నారు. అప్రోచ్‌రోడ్డు, సైడ్‌వాల్ పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- సీపీ ఎల్.సుబ్బారాయుడు



సైలెన్సర్లను రోడ్డురోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు పనిచేస్తున్నారని, రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ ఎల్.సుబ్బరాయుడు అన్నారు. శబ్దకాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లను బిగించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి, డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారు, మెకానిక్‌లు, మైనర్లు, వారి తల్లిదండ్రులకు కమిషనరేట్ కేంద్రంలోని ఓపెన్ థియేటర్ ఆవరణలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీపీ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ.. శబ్దకాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లను వాహనాలకు బిగించే మెకానిక్‌లపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. రెండోసారి పట్టుబడిన వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపి, రెండోసారి పట్టుబడినవారిపై క్రిమినల్, మోటారు వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని అన్నారు. మైనర్లకు వాహనాలిచ్చే యజమానులపై కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోలో డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోనీయకూడదని, అదనంగా బిగించిన సీట్లను తొలగించే ప్రక్రియ నిరంతరం సాగుతుందని అన్నారు. ఇటీవల శబ్దకాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లను బిగించిన వాహనాలు సుమారు 100 వరకు పట్టుబడ్డాయి. ఈ సైలెన్సర్లను గురువారం సీపీ పర్యవేక్షణలో రోడ్డు రోలర్‌తో తొక్కించారు. అడిషనల్ డీసీపీలు ఎస్.శ్రీనివాస్ (శాంతిభద్రతలు), యం.భీంరావు(సీఏఆర్), ఏసీపీలు బి.విజయ్‌కుమార్, సి.ప్రతాప్, సీఐలు తిరుమల్,నాగార్జునరావు పాల్గొన్నారు.

షీటీంలు కీలకంగా వ్యవహరించాలి

మహిళలు విద్యార్థినుల రక్షణ భద్రత విషయంలో షీటీంలు కీలకపాత్ర పోషిస్తున్నాయని సీపీ ఎల్.సుబ్బారాయుడు అన్నారు.కమిషనరేట్ షీటీంలో పనిచేస్తున్న సిబ్బందికి నగదు రివార్డు అందించి సత్కరించారు. విద్యార్థినులు, మహిళలు ఏ ఆపద వచ్చినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా షీటీం వాట్సాప్ నంబర్ 8712670759కు మెసేజ్ లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించినా సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రివార్డులు అందుకున్న వారిలో ఎస్‌ఐ.శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ టి.విజయమణి, హెడ్ కానిస్టేబుల్ పరుశరాం, కానిస్టేబుళ్లు, ఎం.పుష్పలత, ఎం.కవిత, పి.స్నేహ, ఏ.సుజాత, కల్యాణి, ఏ.స్వప్న తదితరులు ఉన్నారు.

సర్కారు బడుల్లో కూల్‌రూఫ్

- ప్రైవేట్ భవనాల్లోనూ అమలు
- భగత్‌నగర్‌లో ప్రారంభించిన మేయర్ సునీల్‌రావు



కూల్‌రూఫ్ వేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: భవనాల్లో ఉష్ణోగతలను తగ్గించేందుకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కూల్‌రూఫ్ పాలసీకి నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు గురువారం శ్రీకారం చుట్టారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలల భవనాలకు ఈ పాలసీని అమలు చేస్తుండగా, ఆ తరువాత టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా ప్రైవేట్ భవనాలకు సైతం అమలు చేయనున్నారు.

ముందుగా పాఠశాల భవనాల్లో...

ఇండ్లు, బడులు, భవనాల్లోపల ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కూల్‌రూఫ్‌పాలసీని తీసుకొచ్చింది. ఆయా భవనాల పైకప్పు (శ్లాబు)పైన ఈ కూల్ పెయింట్‌ను వేయడం ద్వారా కనీసం 10 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గనుందని అధికారులు చెబుతున్నారు.ఎండ తీవ్ర త పెరుగుతుండడం, ఉష్ణోగ్రతలు తట్టుకోలేని పరిస్థితికి చేరడం, విద్యుత్ వినియోగ నియంత్రణకు ఈ కూల్‌రూఫ్ పాలసీని తీసుకువచ్చారు. పైకప్పుపైన ఈ పెయింట్ వేయడంతో దాదాపు మూడు సంవత్సరాల వరకు ఆ భవనంలోపల కనీసం 10 డిగ్రీల ఉష్ణోగ్రత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా 20 లీటర్ల కూల్‌పెయింట్‌కు 25 లీటర్ల నీటిని కలిపి దాదాపు 700 స్వేర్‌ఫిట్ వైశాల్యంతో శ్లాబ్‌పైన పెయింట్ వేయొచ్చంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పాలసీని గురువారం నుంచి నగరంలో అమలు చేస్తున్నారు. ముందుగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ పాఠశాలల భవనాలకు ఈ పెయింట్ వేస్తున్నారు. పాఠశాలలు తెరిచే జూన్ 12వ తేదీ నాటికి కూల్‌రూఫ్‌ను పూర్తి చేయనున్నారు. మన ఊరు మన బడిలో 25 పాఠశాలల భవనాలకు కూల్‌రూఫ్ పాలసీని అమలు చేయగా, మరో 25 పాఠశాలలకు స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌లో అమలు చేస్తున్నారు.

కూల్‌రూఫ్ పాలసీ ప్రారంభం

నగరంలోని 33వ డివిజన్ భగత్‌నగర్ పోలీసు క్వార్టర్స్ ప్రభుత్వ పాఠశాల భవనంలో గురువారం కూల్‌రూఫ్ పాలసీని మేయర్ యాదగిరి సునీల్ రావు ప్రారంభించారు. భవనం పైకప్పుపైన స్వయంగా పెయింట్ వేసి పరిశీలించారు. రూ.10 కోట్లతో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేయడంతో పాటు మరో రూ.20 కోట్లతో మౌలికసదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు భవన యజమానులు కూడా తమ భవనాలకు కూల్‌రూఫ్ పెయింట్ వేసుకోవాలన్నారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయ భవనాలకు కూడ ఈ విధానాన్ని అమలు చేయడం జరుగుతుందన్నారు.

బదిలీ లేదు.. ప్రమోషన్ రాదు

- ఏడేళ్లుగా ప్రమోషన్లు నిల్
- బదిలీలదీ అదే పరిస్థితి
- అక్రమాలతో అర్హులకు అన్యాయం
- కోర్టుకేసుల పేరిట కాలయాపన
- వేసవి సెలవుల్లోనే ప్రక్రియ పూర్తి చేయాలని ఉపాధ్యాయుల డిమాండ్



జిల్లా వివరాలు ఇలా..

పాఠశాలలు	651
ఉపాధ్యాయులు	2,788
వివిధ విభాగాల్లో ఖాళీలు	485
బదిలీలకు దరఖాస్తులు	1,029

కరీంనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఎండమావిగా తయారైంది. ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఏళ్లకాలంగా మదనపడుతున్నారు. ఉద్యోగులకో తీరు.. ఉపాధ్యాయులకు ఓ తీరా అంటూ పోరాటానికి సిద్ధం అవుతున్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొమ్మిదేళ్ల పాలనలో ఒకేఒకసారి 2015లో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. ఆ తర్వాత ప్రక్రియకు మంగళం పాడడంతో అన్ని అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు ఖాళీ పోస్టులు ఉన్నప్పటికీ.. పదోన్నతికి నోచుకోకుండానే ఉద్యోగవిరమణ పొందుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జనవరి ప్రారంభంలో మొదలుపెట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఉపాధ్యాయవర్గాల్లో ఆందోళన నెలకొంది.

దరఖాస్తులు స్వీకరించినా..

విద్యాశాఖలో ప్రమోషన్లు ఇస్తామని, బదిలీలు చేపడతామని ప్రభుత్వం జనవరిలో షెడ్యూల్ ప్రకటించి దరఖాస్తులు స్వీకరించింది. బదిలీల్లో స్పౌజ్ కేసులు ఉన్నవారికి పాయింట్లు ఎక్కువ ఇవ్వడంతో నాన్ స్పౌజ్ వారు అన్యాయం జరుగుతుందని కోర్టును ఆశ్రయించడంతో ప్రక్రియ నిలిచిపోయింది. వేసవి సెలవుల్లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ సాధారణ ఎన్నికల ఉన్నందున ఇప్పుడు చేపట్టకపోతే మరో ఏడాది వేచి ఉండాల్సివస్తుందన్న వాదనలు ఉన్నాయి.

అర్హత ఉన్నా దక్కని ఫలితం

ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడి(ఎస్జీటీ)గా ఉద్యోగంలో చేరిన వారిలో కొందరు 25ఏళ్ల సర్వీసు పూర్తి చేసినా ప్రమోషన్‌కు నోచుకోక అదే క్యాడర్‌లో పని చేస్తున్నారు. చివరకు అదేహోదాలో ఉద్యోగ విరమణ చేస్తున్నారు. జీహెచ్‌ఎం, ఎంఈవో, ఎస్ఏలుగా పదోన్నతులు పొందుతామనే ఆశలు అవిరిఅవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియ నిలిచిపోవడంతో కొందరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయిలో పైరవీలు చేసి సచివాలయం నుంచి నేరుగా బదిలీ ఆర్డర్లు తీసుకవచ్చి జిల్లాలోని అనుకూలమైన స్థానాలను ఎంచుకొని పోస్టింగ్ పొందారు. ఇలా పదుల సంఖ్యలో పలుకుబడి బదిలీలు జరిగినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ఖాళీలతో కుంటుపడుతున్న విద్యావ్యవస్థ

జిల్లాలో 16మండలాల్లో ఎంఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వివిధ రకాల కేటగిరీల్లోని 485 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి. జిల్లాలో 651పాఠశాలల్లో 2,788 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, వివిధ కేటగిరీలకు చెందిన 485 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని బదిలీలు, పదోన్నతుల ద్వారా పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వం కోర్టు కేసుల పేరిట కాలయాపన చేయడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. త్వరగా ప్రక్రియ పూర్తిచేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నాన్చివేత వైఖరి సరికాదు. దశాబ్దాలుగా పేరుకుపోయిన సమస్యలను, కోర్టు కేసులను వెంటనే పరిష్కరించాలి. బోధన, బోధనేతర సిబ్బంది, పర్యవేక్షణ అధికారుల పోస్టులు ఖాళీలుగా ఉండడంతో విద్యాశాఖ గాడి తప్పుతోంది.

– కరివేద మహిపాల్‌రెడ్డి, ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించకుండా దశాబ్దంన్నరగా కాలయాపన చేస్తూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారు. కోర్టు వివాదాలకు ప్రభుత్వం సరైన జవాబులు ఇవ్వకుండా కావాలనే నిర్లక్ష్యం చేస్తోంది. వేసవి సెలవుల్లోనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి.

– నందికొండ విద్యాసాగర్, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

కూల్‌గా ఉండాలని..





వారం రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 11 దాటిందంటే బయటికి వచ్చేందుకు జనాలు జంకుతున్నారు. ఈ క్రమంలో ఎండల తీవ్రత నుంచి పక్షులను కాపాడుకోవాలనే ఆరాటంతో గంగాధర మండలం గట్టుభూత్కుర్‌లో కోళ్లఫారం యాజమానులు ఇలా కోళ్లపై నీళ్లు చల్లుతున్నారు. నగరంలోని డీర్‌పార్క్‌లో నెమళ్లు, ఈములు, పావురాలు, వివిధ రకాల పక్షుల షెడ్లకు ఇలా గోనె సంచులు కట్టి నీళ్లు పడుతున్నారు. – సాక్షిఫొటోగ్రాఫర్, కరీంనగర్

రేపు మెగా జాబ్‌మేళా

కరీంనగర్: జిల్లాలోని ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌బీ కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 20న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, ఎంఈసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అపూర్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓవరాల్‌గా ఎంపీసీ, ఎంఈసీలో 75శాతం, మ్యాథ్స్‌లో 60శాతం మార్కులు పొందిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. పదో తరగతి, ఇంటర్ పాస్ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, ఫొటో, ఆన్‌డ్రాయిడ్ మొబైల్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధి 7569177071, 6303207394 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులు బాగున్నాయి



గంగాధర(చొప్పదండి): గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు, పారిశుధ్య నిర్వాహణ బాగున్నాయని పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధిశాఖ అసిస్టెంట్‌ డైరెక్టర్‌ విజయరామారావు పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌ గ్రామీణ్‌ కార్యక్రమంలో భాగంగా గంగాధర మండలం గట్టుభూత్కూర్‌ గ్రామంలో గురువారం పలు పనులు పరిశీలించారు. పల్లె ప్రకృతి వనం నిర్వహణ బాగుందని సర్పంచ్‌ కంకణాల విజయేందర్‌రెడ్డిని అభినందించారు. కోతులవనం, శ్మశానవాటిక, సెగ్రిగేషన్‌షెడ్‌, నర్సరీలు, ఇంకుడుగుంతలను పరిశీలించారు. ఉపసర్పంచు కాసారపు శైలజ, డీఎల్పీవో హరికిషన్‌, ఎంపీడీవో మల్హోత్ర, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, ఎస్‌బీఎం రమేశ్‌, వేణు, కార్యదర్శి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌ సర్కిల్‌ కార్యాలయం తనిఖీ



తిమ్మాపూర్‌: రాజన్న సిరిసిల్ల జోన్‌ డీఐజీ రమేశ్‌నాయుడు తిమ్మాపూర్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఆఫీసు రికార్డులను, క్రైంఫైళ్లను పరిశీలించారు. సీఐ రమేశ్‌, సిబ్బందిని అభినందించారు. సిబ్బంది యోగక్షేమాలను తెలుసుకుని ఆఫీసు పరిసరాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. సీపీ సుబ్బారాయుడు, రూరల్‌ ఏసీపీ కరుణాకరావు, ఎస్సై ప్రమోద్‌ రెడ్డి ఉన్నారు.

మార్కెట్‌ ప్రాంతంలో అగ్నిప్రమాదం

కరీంనగర్‌ క్రైం: సిలిండర్‌లోకి గ్యాస్‌ నింపుతుండగా గ్యాస్‌లీకై అగ్నిప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌ మున్సిపల్‌ కాంప్లెక్స్‌ వద్ద అమీస్‌ అనే వ్యాపారి గ్యాస్‌సిలిండర్ల సామగ్రి విక్రయిస్తూ.. మినీసిలిండర్లలో గ్యాస్‌ నింపుతుంటాడు. గురువారం రాత్రి పెద్ద సిలిండర్‌ నుంచి చిన్న సిలిండర్‌లోకి గ్యాస్‌ నింపుతున్న క్రమంలో గ్యాస్‌ లీకై మంటలు చెలరేగాయి. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. వన్‌టౌన్‌ పోలీసులు ఘటనాస్థలంలో నాలుగు సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. రూ.20వేల వరకు నష్టం జరిగినట్లు అధికారులు వివరించారు.

పచ్చిరొట్ట సాగుకు సమయమిదే

- 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం
- కరీంనగర్‌ జిల్లాలో అందుబాటులో 4,400 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు
- రెండున్నర ఎకరాలకు 30 కిలోలు అవసరం
- ఎకరంలో సాగుచేస్తే 5 టన్నుల ఎరువు ఉత్పత్తి
- సిద్ధమవుతున్న రైతులు



బేతిగల్‌లో సాగు చేసిన పచ్చిరొట్ట (ఫైల్‌)

వీణవంక(హుజూరాబాద్‌): ఈ నెల 25న రోహిణి కార్తె ప్రారంభం కానుండటంతో రైతులు జీలుగ విత్తనాలు సాగు చేయడానికి సిద్ధమవుతున్నారు. సన్నరకం వరి పండించేవారు ఇప్పటినుంచే జీలుగ విత్తుకునే పనిలో నమగ్నమయ్యారు. కరీంనగర్‌ జిల్లాలోని మానకొండూర్‌, శంకరపట్నం, తిమ్మాపూర్‌, చిగురుమామిడి మండలాలతోపాటు హుజూరాబాద్‌ డివిజన్‌లోని అన్ని మండలాల్లో 4,400 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

భూమి సారవంతం..

పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా మారుతుంది. అలాగే సేంద్రియ, రసాయన ఎరువులు వేసే అవసరం తగ్గుతుంది. భూసారం తగ్గి, పంట దిగుబడిపై ప్రభావం పడుతుండటంతో అప్రమత్తమైన అధికారులు మూడేళ్లుగా జీలుగ సాగుపై ప్రత్యేక దృష్టిసాధించారు. రైతులకు అవగాహన కల్పించడంలో సక్సెస్‌ అయ్యారు. ఇప్పుడు జిల్లాలో జీలుగ, పిల్లిపెసర సాగు చేయడానికి అన్నదాతలు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం జీలుగ విత్తనాలను తెప్పించి, ఆయా మండలాలకు సరఫరా చేసింది. 30 కిలోల బస్తాకు రూ.845 ధర ఉంది. డీసీఎంస్‌, ఆగ్రోస్‌లలో బస్తాలు అందుబాటులో ఉన్నాయి. అయితే వరి సాగు చేసే నెల రోజుల ముందే పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి.

భూమిని కలియదున్నాలి..

ఎకరాకు 15 కిలోల జీలుగ, పిల్లిపెసర విత్తనాల అవసరం. 30 కిలోల బస్తాను రెండున్నర ఎకరాల్లో చల్లుకోవచ్చని వీణవంక ఏఈవో రాకేశ్‌ తెలిపారు. నార్లు పోసే పది రోజుల ముందు నుంచే భూమిని కలియదున్నితే పైరు భూమిలో మురిగి, భూసారం పెరుగుతుందన్నారు. నేలకు సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తిని పెంచుతుందని, తుంగ, గరిక వంటి కలుపు మొక్కలను నివారిస్తుందని పేర్కొన్నారు.

మురిగిన తర్వాత నాటు వేయాలి..

జీలుగను తేలికపాటి నేలల్లోనూ, ఇసుక, చౌడు భూముల్లోనూ సాగు చేసుకోవచ్చు. చౌడు భూముల్లో ఉన్న లవణాలను తీసివేసి, మంచి భూమిగా తయారు చేయడంలో ఈ జీలుగ పైరు ఎంతగానో దోహదపడుతుంది. దీనినుంచి ఎకరాకు 5 టన్నుల పచ్చిరొట్ట ఎరువు ఉత్పత్తి అవుతుంది. 35 నుంచి 40 రోజుల మధ్య భూమిలో కలియదున్నితే మంచిది. ఇందులో 8 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌, 35 కిలోల నత్రజని ఉంటాయి. పిల్లిపెసర పచ్చిరొట్టగా, పశుగ్రాసంగా ఉపయోగపడుతుంది. ఎకరాకు 5 నుంచి 6 కిలోల విత్తనాలు అవసరం. ఎకరాకు 5 నుంచి 6 టన్నుల ఎరువు ఇస్తుంది. జనుము ఎకరాకు 15 కిలోల విత్తనం అవసరం. 6 టన్నుల ఎరువు ఇస్తుంది. వీటిని పొలంలో కలియదున్ని, మురిగిన తర్వాత నాటు వేసుకోవాలి.

సాగుకు రైతుల ఆసక్తి..



గతంతో పోలిస్తే ఈసారి పచ్చిరొట్ట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. బావుల్లో నీళ్లు ఉన్నవారు ఇప్పుడు విత్తనాలు వేసుకోవచ్చు. నీటి వసతి లేనివారు వర్షాలు పడిన తర్వాత వేసుకుంటే మంచిది. జీలుగ సాగుపై రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించాం.

– రాకేశ్‌, ఏఈవో, వీణవంక

ఎండతో ఆటలొద్దు!

- ఓ వైపు వేసవి శిబిరాలు.. మరోవైపు సీఎంకప్‌ క్రీడోత్సవాలు
- జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు, నిపుణులు
- ఆహారం, దుస్తుల విషయంలో అప్రమత్తత అవసరం




వేసవి శిబిరాల్లో చిన్నారులు

కరీంనగర్‌ స్పోర్ట్స్‌: ఏటా వేసవిలో సుమారు 30రోజుల పాటు వివిధ రకాల క్రీడాశిక్షణ శిబిరాలు జరుగుతాయి. ఈ సారి కూడా మే 1నుంచి కరీంనగర్‌లో నగరపాలక ఆధ్వర్యంలో, గ్రామాల్లో క్రీడాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఈనెల 15 నుంచి చీఫ్‌ మినిస్టర్‌ కప్‌ పోటీలు కొనసాగుతున్నాయి. ఏ మైదానం చూసినా క్రీడాకారులు, చిన్నారులతో సందడిగా కనిపిస్తుండగా.. దంచికొడుతున్న భానుడు భయపెడుతున్నాడు. 45 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఈ క్రమంలో క్రీడాకారులు తప్పనిసరిగా జాగ్రతలు తీసుకోవాలని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు.

- క్రీడాకారులు మందంగా ఉండే దుస్తులు వాడొద్దు. అప్పర్‌, లోయర్లు, నైలాన్‌ కాకుండా కాటన్‌ దుస్తులు ఎక్కువగా వాడాలి. ఉదయం, సాయంత్రం శిక్షణకు హాజరయ్యే వారు ఉదయం వేసుకున్న దుస్తులు సాయంత్రం వాడొద్దు. షూ, సాక్స్‌ కూడా ఒకేపూటకు వాడాలి.
- గ్రామాల్లో చెట్లు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వాతావరణం కాస్త చల్లగా ఉంటుంది. పట్టణాల్లో ఎక్కువగా ఉంటుంది. ఎండ 45 డిగ్రీలు దాటిన నేపథ్యంలో అత్యధిక వేడిలో ఆటలుఆడే క్రమంలో ఆరోగ్యం కూడా తప్పనిసరిగా కాపాడుకోవాలి. ఉదయం 8గంటల లోపు సాయంత్రం 6గంటల నుంచి శిక్షణ తీసుకోవడం ఉత్తమం.
- గ్లూకోజ్‌ పొడిని నీటిలో కలుపుకొని తాగడం వల్ల శరీరానికి అదనపు శక్తి వస్తుంది. గ్లాసు నీటిలో ఉదయం, సాయంత్రం ఒక స్పూన్‌ పొడిని కలిపి తాగితే సరిపోతుంది. శిబిరాల్లో పాల్గొనేవాళ్లు బాటిల్‌లో గ్లూకోజ్‌ కలుపుకొని తీసుకెళ్తే మంచింది.
- క్రీడల్లో పాల్గొనే వారు, వాకింగ్‌, వ్యాయామం చేసేవారు, జిమ్‌సెంటర్‌కు వెళ్లేవారు, సమ్మర్‌ క్యాంప్‌లో పాల్గొనే వారు ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు పాటించాలి. ఆకుకూరలు, కూరగాయలు, మజ్జిగ తీసుకోవాలి. వీటితో పాటు నీటిశాతం ఎక్కువగా ఉన్న పండ్లు, రసాలు తీసుకోవాలి.
- శక్తి సామర్థ్యాలకు మించి సాధన చేయకూడదు. పోటీపడి అధిక బరువు ఎత్తడం, దూకడం, పరిగెత్తడం, వ్యాయామకృత్యాలు తదితర వాటిని చేయడం వల్ల శరీరంలోని నీటిశాతం తగ్గి కోలుకోలేని స్థితికి చేరుకుంటారు. జిమ్‌కు వెళ్లే వారు అధిక వ్యాయామం చేయకూడదు.
- ఉదయం పూట శిక్షణకు వెళ్లే క్రీడాకారులు తగినంత నీటిని తాగాలి. ఒకటికి రెండు బాటిళ్లు వెంట తీసుకెళ్లాలి. ఉదయం అరటిపండు తింటే శరీరంలో విటమిన్‌ లోపం తలెత్తకుండా ఉంటుంది. శిక్షణ ముగిసేవరకు ప్రతిరోజు పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది.

నీటిశాతం ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవాలి



వేసవిలో పిల్లలు ఆటలు ఆడేందుకు చాలా ఇష్టపడుతారు. వారు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలు అన్ని తల్లిదండ్రులే చూసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగేవిధంగా చూడాలి. నీటిశాతం ఎక్కువగా ఉన్న వాటినే వేసవిలో తీసుకునేలా చూడాలి. పండ్ల రసాలు, గ్లూకోజ్‌ లాంటివి ఎక్కువగా తాగాలి. ఎక్కువ సమయం ఆటల్లో పాల్గొనకుండా చూసుకోవాలి.

– డాక్టర్‌ రాంమోహన్‌, పిల్లల వైద్య నిపుణుడు, కరీంనగర్‌



కుక్కపిల్లలకు బారసాల

జగిత్యాలరూరల్‌: పెంపుడు కుక్క పిల్లలకు ఓ యజమాని బారసాల ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన పోతు గంగు పెంపుడు కుక్క గత ఏప్రిల్‌ 28న 10 పిల్లలకు జన్మనిచ్చింది. గురువారం 21 రోజులు కావడంతో వాటికి కొత్త దుస్తులు తొడిగి, నామకరణం చేశారు. బంధువులకు విందు భోజనం పెట్టారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన బోయిని స్రవంతి(28) క్షణికావేశంలో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. ఈనెల 16న స్రవంతి భర్తతో గొడవ పడింది. ఈ క్రమంలో క్షణికావేశంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

భార్య ఫిర్యాదుతో భర్తపై కేసు



ఇంట్లో దహనమైన వస్తువులు

జమ్మికుంట(హుజూరాబాద్‌): తనను వేధిస్తూ.. ఇంట్లోని వస్తువులు దహనం చేశాడని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో భర్తపై గురువారం కేసు నమోదు చేశారు. జమ్మికుంట పట్టణ సీఐ బార్పటి రమేశ్‌ వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్‌ పరిధి కేశవపూర్‌ గ్రామానికి చెందిన కర్నె వెంకటేశ్‌, జ్యోతికి 13ఏళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా వెంకటేశ్‌ మద్యం తాగివచ్చి భార్య జ్యోతితో గొడవపడుతున్నాడు. ఇటీవల దళితబంధు పథకం ద్వారా కారు తీసుకున్నారు. అయితే మద్యానికి బానిసైన వెంకటేశ్‌ కారును ఎవరికైనా అమ్ముతాడనే భయంతో జ్యోతి తన తమ్ముడు రాజుకుమార్‌ వద్ద వాహనం ఉంచింది. మూడు నెలలుగా తాగి వస్తున్న వెంకటేశ్‌ కారు, అదనపు కట్నం తీసుకురావాలని, లేనిపక్షంలో చంపుతానని, ఇంటిని కాల్చివేస్తానని జ్యోతితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో జ్యోతి వేధింపులు భరించలేక గురువారం గోదావరిఖనిలోని తన తమ్ముడి ఇంటికి వెళ్లిపోయింది. ఆవేశానికి గురైన వెంకటేశ్‌ తమ ఇంట్లో ఉన్న విలువైన వస్తువులకు నిప్పంటించాడు. సమాచారం అందుకున్న జ్యోతి ఇంటికి వచ్చి చూసేసరికి ఇల్లుమొత్తం దహనమైంది. దీంతో జ్యోతి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేశ్‌ తెలిపారు.

గట్టుపులి మురళి ఆదర్శం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్యాంప్రసాద్‌లాల్‌

కరీంనగర్‌కల్చరల్‌: 'గట్టు పైనున్న పులిని ఒంటరిగా ఎదుర్కొని చంపిన మురళి రజాకార్లను చీల్చి చెండాడిన వైనం అందరికీ ఆదర్శమని, అన్యాయాన్ని సహించని గుణం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని' అడిషనల్‌ కలెక్టర్‌ శ్యామ్‌ ప్రసాద్‌ అన్నారు. గురువారం భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో రజాకార్లను చీల్చి చెండాడిన సమరయోధుడు 'గట్టుపులి మురళి' పుస్తక పరిచయ సభను అడిషనల్‌ కలెక్టర్‌ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గొప్ప సమరయోధుడిగా పేరుపొందిన గట్టెపల్లి మురళిని ఈతరానికి పరిచయం చేయాలనే సంకల్పంతో సంకలనాన్ని తీసుకువచ్చిన ఆయన కుమారుడు సంపత్‌ కుమార్‌ శ్రీ వత్స అభినందనీయుడని అన్నారు. సంకలనకర్త సంపత్‌ కుమార్‌ శ్రీవత్స మాట్లాడుతూ మానవతావాదిగా నిలిచిన గట్టెపల్లి మురళి ఎంతోమంది అభిమానించే వారిని, ఆయన్ను ఆదర్శంగా తీసుకొని తాను జీవితంలో ఎదిగానని అన్నారు. వైరాగ్యం ప్రభాకర్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్‌ గండ్ర లక్ష్మణరావు, డాక్టర్‌ కలువకుంట రామకృష్ణ, గాజోజు నాగభూషణం, గంప ఉమాపతి, డాక్టర్‌ బొద్దుల లక్ష్మయ్య, అనంతాచార్య, గజేందర్‌రెడ్డి, బొమ్మకంటి కిషన్‌, నూజెట్టి రవీంద్రనాథ్‌, బాల్సాని కొమురయ్య, ప్రేంసాగర్‌రావు, విలాసాగరం రవీందర్‌, సిరిపురం వాణిశ్రీ, సీహెచ్‌.రజిత, నోముల వనితారాణి పాల్గొన్నారు.

పెచ్చులూడిన బ్రిడ్జి.. తప్పిన ప్రమాదం



ఊడిన పెచ్చులు



గాయపడిన మహిళ

జమ్మికుంట: జమ్మికుంట ఫ్లైఓవర్‌ బ్రిడ్జి పెచ్చులూడాయి. ఈ ప్రమాదంలో ఒక మహిళ గాయపడగా.. తృటిలో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలో ఫ్లైఓవర్‌ జంక్షన్‌ వద్ద పెద్దపెద్ద పెచ్చులు ఊడి పడ్డాయి. బ్రిడ్జికింద పండ్లు అమ్ముకుంటున్న కొత్తపల్లికి చెందిన రాజమ్మకు పెచ్చులు తగిలి మోచేతికి స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌ నాయకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మహిళను పరామర్శించారు. ఇసుకలారీలు అధికలోడ్‌తో వెళ్లడంతో బ్రిడ్జి పెద్దపెచ్చులూడుతోందని అన్నారు. కాంగ్రెస్‌ పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరిరేణుక, శివకుమార్‌గౌడ్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి పాల్గొన్నారు.

మాదిగల శక్తిని చాటుతాం

- ఎస్సీ వర్గీకరణ సాధనకు కదలాలి
- ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌



సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్‌

కరీంనగర్‌కల్చరల్‌: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధనకు హైదరాబాద్‌ కేంద్రంగా మాదిగల శక్తిని చాటిచెప్తామని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్‌ అన్నారు. గురువారం కరీంనగర్‌ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్‌ జిల్లా కన్వీనర్‌ బెజ్జంకి అనిల్‌ అధ్యక్షతన జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పార్లమెంట్‌ ద్వారా చట్టబద్ధతసాధించుకోవడానికి ప్రస్తుత రాజకీయ వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. ఈ సమయంలో మాదిగలంతా ఏకమై ఉద్యమం వైపు కదలాలన్నారు. ప్రజల ఆకాంక్షలను,ప్రజల మనోగతాలను తెలుసుకోకుండా బీజేపీ రాజకీయంగా దెబ్బ తింటుందని, ఎస్సీ వర్గీకరణ విషయంలో నిర్లక్ష్యం చేసి తప్పు చేయొద్దని బీజేపీని హెచ్చరించారు. అలాగే టార్గెట్‌ 50 డేస్‌ కార్యాచరణలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు కార్యకర్తలు భాగస్వాములై ఉద్యమాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బెజ్జంకి అనిల్‌, ఇంజం వెంకటస్వామి, చిలుముల రాజయ్య, చెంచాల నవీన్‌, కనకం అంజయ్య, రేణుకుంట్ల సాగర్‌, తుంగ ఆంజనేయులు, తడగొండ శంకర్‌, కొత్తూరి రాజన్న, నెరేళ్ల సొమ్య, నెరేళ్ల ప్రేంకుమార్‌ పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌



శిబిరాన్ని పరిశీలిస్తున్న గరిమా అగర్వాల్‌

కరీంనగర్‌టౌన్‌: 18 ఏళ్లు పైబడిన ప్రతీఒక్కరు కంటి పరీక్షలు చేయించుకునేలా చూడాలని అదనపు కలెక్టర్‌ గరిమా అగర్వాల్‌ తెలిపారు. గురువారం కరీంనగర్‌ పట్టణంలోని 54వ డివిజన్‌ కాశ్మీర్‌గడ్డలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. కంటి సమస్యలు ఉన్న వారందరూ శిబిరాలలో కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి చూపునకు సరిపోయే రీడింగ్‌ అద్దాలు అప్పటికప్పుడే ఇవ్వడం జరుగుతుందని, ప్రిస్కిబ్‌ అద్దాలు వారంరోజుల్లోగా అందజేయడం జరుగుతుందని అన్నారు. కంటివెలుగు శిబిరాలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీడీ మెప్మా కార్యాలయ కో–ఆర్డినేటర్‌ అనిత, దీప, వైద్యాధికారులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో నిర్వహించే కంటి వెలుగు శిబిరాలు

జిల్లాలో శుక్రవారం 22ప్రాంతాల్లో కంటి వెలుగు శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్‌ లలితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌ పట్టణంలోని 54, 60వ డివిజన్‌లలో, హుజూరాబాద్‌ పట్టణంలో 3వ వార్డులో, మండలంలోని రంగాపూర్‌, జమ్మికుంట పట్టణంలోని వార్డునంబర్‌ 18, మండలంలోని జగ్గయ్యపల్లి, వెంకటేశ్వర్లపల్లిలో శిబిరాలు నిర్వహిస్తారు. వీణవంక మండలం నర్సింగాపూర్‌, చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి, చొప్పదండి మండలం భూపాలపట్నం, గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌, రామడుగు మండలం వెదిర, కొత్తపల్లి మండలం ఎలగందుల, మానకొండూరు మండలం ఖాదర్‌గూడెం, లింగాపూర్‌, వెల్ది, సైదాపూర్‌ మండలం ఆకునూర్‌, కేశవపట్నం మండలం కన్నాపూర్‌, రాజాపూర్‌, తిమ్మాపూర్‌ మండలం మల్లాపూర్‌, చీమలకుంటపల్లి గ్రామాల్లో కంటివెలుగు శిబిరాలు కొనసాగుతాయని వివరించారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

గన్నేరువరం(మానకొండూర్‌): ఆయిల్‌పాం పంటసాగుతో ఆశించిన లాభాలు పొందవచ్చని మానకొండూర్‌ నియోజకవర్గ హార్టికల్చర్‌ అధికారి స్వాతి, వ్యవసాయశాఖ అధికారి కిరణ్మయి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని మాదాపూర్‌, గోపాల్‌పూర్‌ గ్రామాల్లో ఆయిల్‌పాం పంటసాగుపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. నాటిన మొక్క 3నుంచి 30ఏళ్ల వరకు కొనసాగుతుందని, వరిపంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పాంను సాగు చేసుకోవాలన్నారు. అకాల వర్షాలకు నష్టం జరుగకుండా ఉండటంతో పాటు మార్కెటింగ్‌ సౌకర్యంపుష్కలంగా ఉంటుందని వివరించారు. రాయితీపై డ్రిప్‌ సౌకర్యం కల్పిస్తామని, ఎకరానికి ఏడాది రూ.4200 చొప్పున నాలుగేళ్ల వరకు నిర్వహణ ఖర్చులు అందజేస్తామని వివరించారు. కోతుల బెడద ఉండదని, మూడేళ్ల అంతర పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. మండలంలో ప్రస్తుతం 50ఎకరాల్లో సాగు అవుతోందని, ఎకరానికి నికరంగా లక్ష వరకు ఆదాయం పొందవచ్చన్నారు. ఆసక్తి గల రైతులు ఆయా గ్రామాల్లోని వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించాలని కోరారు. సర్పంచ్‌ సంపత్‌, ఏఈవో సౌమ్య, రైతులు మల్లేశం, తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నిధుల స్వాహాపై విచారణ జరిపించండి



డీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌: జిల్లాలోని పలు ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్‌ ఇవ్వకుండా కాజేస్తున్న వైనంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచమల్ల రాజు, బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీధర్‌రాజులు గురువారం బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ రాజమనోహర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్‌ పట్టణంతోపాటుగా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలలు బ్రాంచ్‌లు స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం విడుదల చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులు బీసీ విద్యార్థులకు చెల్లించకుండా కొన్నేళ్లుగా కళాశాల యాజమాన్యాలే కాజేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులకు రూ.1760,రెండో సంవత్సరం విద్యార్థులకు రూ.1960 చొప్పున బోధన రుసుం చెల్లిస్తోందని అన్నారు. కానీ కార్పొరేట్‌స్థాయి కళాశాలలు ఒక్కో విద్యార్థి నుంచి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు, ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న కళాశాలలపై తగు విచారణ జరిపి ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రెవెన్యూ రికవరీ యాక్ట్‌ ప్రకారం ప్రభుత్వానికి చెల్లించి అక్రమార్కులను శిక్షించాలని కోరారు.

శ్మశానవాటికలో అర్ధరాత్రి క్షుద్రపూజలు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మోతె శ్మశానవాటికలో ఓ వ్యక్తి నగ్నంగా క్షుద్రపూజలు చేయడం జిల్లాలో కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి శ్మశానవాటికలోని బూడిదను శరీరంపై చల్లుకొని, హరహర మహాదేవ శంభోశంకర అంటూ అరిచాడు. ఈ వీడియో సోషల్‌ మీడియాలో వైరల్‌ కావడంతో ప్రజలు భయపడుతున్నారు. అసలు పూజలు చేసిన వ్యక్తి ఎవరు, నగ్నంగా ఎందుకు చేశాడనే విషయం అంతు పట్టడం లేదని అంటున్నారు.

సుందరేశ్వరుడికి ఫలపంచామృతాభిషేకం



మాస శివరాత్రి సందర్భంగా గురువారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో కొలువై ఉన్న సుందరేశ్వరస్వామి వారలకు వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణశర్మ అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేషహారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. - విద్యానగర్(కరీంనగర్)

డ్రెయినేజీలు నిర్మించండి



నగరంలోని కోతిరాంపూర్ రోడ్ నం.5లో డ్రెయినేజీలు లేక మురుగునీరంతా రహదారిపైనే ప్రవహిస్తూ కుంటగా మారింది. నగర పాలక సంస్థ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

చల్లదనానికి 'తాటి ముంజలు'

వేసవిలో చల్లదానికి దొరికే వాటిలో ముఖ్యమైనవి తాటి ముంజలు. చూడటానికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మృధువుగా ఉండే ఇవి ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తాయి. వీటిలో అధిక మొత్తంలో ఉండే విటమిన్ బి, ఐరన్, క్యాల్షియం శరీరానికి చాలా ఉపయోగకరం. కొండగట్టు నుంచి వీటిని తీసుకొచ్చి కరీంనగర్‌లోని మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో నగరవాసులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. రూ.100కు 12నుంచి 13 తాటి ముంజలు అమ్ముతున్నట్లు కొండగట్టుకు చెందిన కరీం చెబుతున్నాడు.

- విద్యానగర్(కరీంనగర్)



క్లుప్తంగా

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న జోజిరెడ్డి

విద్యానగర్(కరీంనగర్): ఎండ తీవ్రతలు పెరుగుతున్న దృష్ట్యా నగరంలోని ప్రధాన కేంద్రాల్లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని పలుచోట్ల మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యంరావు, జిల్లా కమిటీ సభ్యులు కురువెల్లి శంకర్, జి.ప్రశాంత్ కుమార్, చొప్పదండి నియోజకవర్గం కన్వీనర్ పెద్దెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీలో 'కోరా' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో బుధవారం జరిగిన సీఎం కప్ పోటీల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో నగరంలోని కోరా ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని రెండోస్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభకనబర్చిన యోగేశ్వరి, దివ్య, సాయి శరణ్య, రాగిణి, శ్రీహిత, సాహితి, పూజితలను గురువారం పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరాప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగళ సంతోష్‌రెడ్డితో పాటు పలువురు అభినందించారు.

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిల నియామకం

కరీంనగర్: తెలుగుదేశం పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలను నియమిస్తూ ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గంగాధర కనకయ్య(కరీంనగర్), ఆపునూరి దయాకర్‌రావు(సిరిసిల్ల), జంగం అంజయ్య (చొప్పదండి), బత్తుల శ్రీనివాస్ (హుస్నాబాద్) నియమితులయ్యారు. కనకయ్య గతంలో టీడీపీ నాయకుడిగా ఉమ్మడి జిల్లాలో క్రియాశీలకంగా పనిచేశారు. ఫిషరీష్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొనసాగారు. మిగతా చొప్పదండి, హుస్నాబాద్, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రస్తుత కోఆర్డినేటర్లనే ఇన్‌చార్జిలుగా నియమించారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం పార్టీ సోషల్ మీడియా, విద్యార్థి, యూత్ విభాగం నాయకులతో మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తుంటే కొందరు పనిగట్టుకొని చేస్తున్నా దుష్ప్రచారాలను తిప్పి కొట్టాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

మాతా శిశు కేంద్రంలో ఆగని వసూళ్లు

- ప్రక్షాళనపై దృష్టి పెట్టని అధికారులు
- సిబ్బంది పనితీరుపై విమర్శలు

''ఎంసీహెచ్‌లో ఇటీవల సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. వరుస ఘటనలతో ఓ వైపు ఆసుపత్రి ప్రతిష్టకు భంగం వాటిల్లుతుంటే, మరోవైపు సిబ్బంది తీరు మరింత ఇబ్బందికరంగా మారుతుండడం అధికారులకు తలనొప్పిగా మారుతోంది.''



కరీంనగర్‌లోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

కరీంనగర్‌టౌన్: మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వరుసగా జరుగుతున్న శిశువుల మృతి ఘటనలతో వైద్యుల నిర్లక్ష్యంపై ఆరోపణలు వినిపిస్తుంటే.. కిందిస్థాయి సిబ్బంది వసూళ్లపై గర్భిణులు, బాలింతల బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంసీహెచ్‌లో ప్రతీ పనికో రేటు పెట్టి సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాబు పుడితే ఒక రేటు.. పాప పుడితే మరో రేటు.. బెడ్ షీట్ వేసినా.. పట్టుకున్నా.. ముట్టుకున్నా.. డబ్బులు వసూళ్లు చేస్తుండడంతో ఆసుపత్రికి వచ్చే వారు విసుగుచెందుతున్నారు. ఎంసీహెచ్‌కు 90 శాతం మంది నిరుపేదలే కాన్పు కోసం వస్తుంటారు. ఇది తెలిసి కూడా చేతిలో చిల్లి గవ్వ లేని వారిని కూడా వదలడం లేదు. వీరి వద్ద నుంచి కూడా ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు కాన్పు కోసం వచ్చిన వారి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన ఆరోపణలు ఉన్నాయి.

ముడుపులతో కదలని సిబ్బంది

ఉద్యోగులు, సిబ్బందికి రోస్టర్ ప్రకారం డ్యూటీల్లో మార్పులు చేయాల్సిన అధికారులు ఎక్కడి వారిని అక్కడే ఉంచుతున్నారు. కొంత మంది ఆర్నెళ్లు, ఇంకొంత మంది ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు డ్యూటీల్లో కొనసాగేందుకు తమకు సహకరించే వారికి ముడుపులు ముట్టజెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎంసీహెచ్‌లో డ్యూటీలు చేస్తే పేషెంట్ల నుంచి అందిన కాడికి దండుకోవచ్చనే ఉద్దేశ్యంతో ఇక్కడే తిష్టవేస్తున్నట్లు తెలుస్తోంది.

పేషెంట్లతో దురుసు ప్రవర్తన

ఎంసీహెచ్‌లో పనిచేసే సిబ్బంది పేషెంట్లతో దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. డబ్బుల కోసం నానా బూతులు మాట్లాడుతున్నారని గర్భిణులు, బాలింతల బంధువులు ఆవేదన వ్యక్తం చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో సిబ్బంది వసూళ్లకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

వసూళ్లకు పాల్పడితే చర్యలు

ఎంసీహెచ్‌లో కాన్పు కోసం వచ్చిన వారి కుటుంబసభ్యుల వద్ద డబ్బులు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతాం. ఆసుపత్రిలో సేవలు అన్నీ ఉచితం. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవరైనా డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయాలి.

– డాక్టర్ నవీన, అదనపు ఆర్‌ఎంవో

ఫిర్యాదులపై స్పందన కరువు

ఆసుపత్రిలో వసూళ్లపై గర్భిణులు, బాలింతల బంధువులు అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. ఇప్పటివరకు జరుగుతున్న ఘటనలతో అధికారులు సతమతమవుతుంటే, సిబ్బంది వసూళ్లు మరో తలనొప్పిగా మారుతున్నాయి. ఎంసీహెచ్‌ను ప్రక్షాళన చేసి సేవలు మెరుగుపర్చేందుకు చర్యలకు చేపట్టాలని కోరుతున్నారు.

శ్మశానవాటికలో పైపైనే పనులు



శ్మశానవాటికలో ఉన్న చెట్ల కొమ్మలు, చెత్త

- చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు
- సక్రమంగానే జరిగాయంటున్న అధికారులు

కరీంనగర్‌కార్పొరేషన్: రంజాన్ పండుగ సందర్భంగా నగరంలోని కాపువాడ తకియ మహల్ల శ్మశాన వాటికలో చేపట్టిన అభివృద్ధి పనులు వివాదాస్పదంగా మారాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసిన నెల రోజుల తర్వాత కొంతమంది యువజన కాంగ్రెస్ నాయకులు పనులు జరగలేదని ఆరోపణలు చేస్తుండగా.. నగరపాలకసంస్థ అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. రంజాన్ పర్వదినం సందర్భంగా పెద్దల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. ఈక్రమంలో స్మశానవాటికలను నగరపాలక సంస్థ ఏటా శుభ్రం చేయిస్తుంది. ఇందుకు టెండర్ పిలిచి, కాంట్రాక్ట్ అప్పగిస్తుంది. ఇటీవల రంజాన్ పండుగ సందర్భంగా కూడా కాపువాడలోని తకియ మహల్ల శ్మశాన వాటికలో చెత్తాచెదారం తొలగించి శుభ్రపర్చడం, ప్రహరీకి పెయింట్ వేయడం కోసం అధికారులు టెండర్ పిలిచారు. సుమారు రూ.2 లక్షల 80వేల పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారు. అయితే ఈ పనులు పూర్తిస్థాయిలో చేపట్టలేదని, పైపైనే పనులు జరిగాయని ఎక్కడ చెత్త అక్కడే ఉందంటూ యూత్ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేస్తున్నారు.

చర్యలు తీసుకోకపోతే ఆందోళన

తకియ మహల్ల శ్మశాన వాటికలో పైపైనే పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో మున్సిపల్ కార్పొరేషన్‌ను ముట్టడిస్తాం. శ్మశానాన్ని పూర్తిగా శుభ్రపర్చలేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉంది. మూలల్లో అసలు తొలగించనే లేదు. అక్కడక్కడా తొలగించిన చెత్తను కూడా బయటకు తరలించలేదు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

- అబ్దుల్ రెహ్మాన్, యూత్‌కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్

ఎలాంటి అక్రమాలు జరగలేదు

శ్మశాన వాటికలో రంజాన్ సందర్భంగా జరిగిన పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదు. నిబంధనల మేరకే కాంట్రాక్ట్ అప్పగించాం. పనులు కూడా పూర్తిస్థాయిలో చేపట్టారు. స్థానికులు కొంతమంది అక్కడ చెత్త వేస్తున్నారు. ఆ చెత్తనే నగరపాలకసంస్థ తొలగించింది. ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదు.

– మసూద్, డీఈ, నగరపాలక సంస్థ

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ విజయవంతం చేయాలి

- మేయర్ సునీల్‌రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో శుక్రవారం నుంచి నిర్వహించనున్న స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను విజయవంతంగా పూర్తి చేయాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ సేవా ఇస్లావత్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డివిజన్లవారీగా చేపట్టనున్న శానిటేషన్ డ్రైవ్‌లో ఇన్‌స్పెక్టర్లు, జవానులు బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్పొరేటర్ల సహకారంతో డివిజన్ కమిటీ సమావేశాలు నిర్వహించుకొని, సమస్యలు గుర్తించి పరిష్కరించుకోవాలన్నారు. ఎనిమిది రోజుల పాటు ఇంటింటికీ వందశాతం చెత్త సేకరణ, సెగ్రిగేషన్, రోడ్లను శుభ్రం చేయడం, డ్రెయినేజీల్లో సిల్ట్ తొలగింపు పనులు ముమ్మరం చేయాలని తెలిపారు. వర్షాకాలం రానున్నందున శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించాలని, పూర్తిగా కూలిపోయే స్థితిలో ఉంటే వాటిని తొలగించాలని ఆదేశించారు. మేరీ లైఫ్, మేరా స్వచ్ఛశహర్ పనులు కూడా స్పెషల్ డ్రైవ్‌తో పాటు కొనసాగాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ త్రియంభకేశ్వర్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతర అభివృద్ధి పనులతో కొత్త రూపు

నిరంతరంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులతో నగరం కొత్త రూపు సంతరించుకుంటోందని మేయర్ సునీల్‌రావు అన్నారు. గురువారం 50వ డివిజన్ గణేశ్‌నగర్‌లో రూ.52.60 లక్షలతో మూడు చోట్ల చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. గతంలో గణేశ్‌నగర్ వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. చాలా రోజుల క్రితం వేసిన రోడ్లు, డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరి స్థానికులకు సమస్యగా ఉందని తెలిపారు. వాటి స్థానంలో నూతనంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ సేవా ఇస్లావత్, కార్పొరేటర్ కొలిపాక అంజయ్యతో పాటు స్థానిక ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

'నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు కూల్చడం అన్యాయం'



బాధితులతో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: ముప్పై ఏళ్లుగా నివాసముంటూ గ్రామపంచాయతీ పర్మిషన్ తీసుకొని ఇంటి పన్నులు చెల్లిస్తున్న పేదల ఇళ్లు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చేయడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. రేకుర్తి అంబేడ్కర్ కూడలి వద్ద ధర్నా చేస్తున్న షేకాబీకాలనీ బాధితులను గురువారం పరామర్శించి మాట్లాడారు. పేదల ఇళ్లు కూల్చేయమని ఎక్కడా కోర్టు పేర్కొనలేదని, మిగితా భూమి జోలికి ఎవరు రావడం లేదని ఇందులో ఏదో అదృశ్యశక్తి వెనుకాల ఉండటం వల్లనే ఇదంతా జరుగుతుందన్నారు. ఇళ్లు కూల్చివేయబడ్డ బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమద్ నవాబ్, ఎండీ చాంద్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, గడ్డం విలాస్‌రెడ్డి, అస్తపురం రమేశ్, కుర్ర పోచయ్య, మెతుకు కాంతయ్య, షబానా మహమ్మద్, ముక్క భాస్కర్, ముల్కల కవిత, పొరండ్ల రమేశ్, మామిడి సత్యనారాయణరెడ్డి, చంద్రయ్యగౌడ్, షాహిద్, తమ్మడి ఎజ్రా, గాదె శివరాం, షేహెన్షా, అష్రఫ్ ఖురేషి, బొబ్బిలి విక్టర్, జిలకర రమేష్, హనీఫ్, కమల్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు బహూకరణ

ఇల్లందకుంట: శ్రీసీతారామచంద్రస్వామిదేవస్థానం, పోలీస్‌స్టేషన్‌కు గురువారం ఎనిమిది సీసీ కెమెరాలను బహూకరించారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంకేఆర్ డెవలపర్స్ హైదరాబాద్ సామాజిక సేవా సంస్థ ఎండీ కృష్ణారెడ్డి రూ.లక్ష విలువ చేసే కెమెరాలను అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కరీంనగర్: భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌శరణ్‌సింగ్, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌లను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో గురువారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ బేటీ బచావో బేటీ పడావో మాటలు గొప్పతనంలో ఉన్నట్లు ఆచరణలో తన బీజేపీ నాయకులు దేశంలోని మహిళలను అనేక లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. భారత రెజ్లర్ల పోరాటానికి ప్రజానీకం మద్దతు ఇవ్వాలని తెలిపారు. బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకొని భారత రేజర్ల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మిల్కూరి వాసుదేవరెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి తిరుపతి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రాయికంటి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం పూజ, జిల్లా అధ్యక్షుడు కంపెల్లి అరవింద్, నాయకులు అశోక్, మణికంఠ, మనోజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మధుకర్

హుజూరాబాద్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి గెలవాలని బీఆర్‌ఎస్ 14వ వార్డు అధ్యక్షుడు గంట మధుకర్‌ముదిరాజ్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లి పెద్దమ్మ గుడిలో 101 కొబ్బరికాయలు కొట్టిన అనంతరం పట్టణంలోని సాయిబాబా ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ సదానందం గంట మధుకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గంట కొమురయ్య, కనకయ్య, సమ్మయ్య, మోహన్ రెడ్డి, గంట శ్రీధర్, బన్నీ, గంట రాజు, తులసి లక్ష్మణ మూర్తి, ఎండీ ఖలీద్ హుస్సేన్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో పారిశుధ్య పనులు తనిఖీ




పనులు పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యుడు

తిమ్మాపూర్: ఎస్ఎస్‌జీ–2023, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో చేపట్టిన పనులను రాష్ట్ర బృందం సభ్యుడు ఎస్ఎన్.విజయరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్యం, సోక్‌పిట్స్, కిచెన్ గార్డెన్స్, నర్సరీ, వైకుంఠధామం, కంపోస్ట్‌షెడ్, చెత్త ట్రాక్టర్, ఇళ్లలో తడి,పొడి చెత్త వేరు చేయడం, పీపీపీ, బీపీపీపీ తదితర పనులను పరిశీలించారు. అన్ని పనులు బాగున్నాయని అభినందించారు. ప్రత్యేక అధికారి వెంట సర్పంచ్ దుంద్ర నీలమ్మ, డీపీవో వీర బుచ్చయ్య, డీఆర్డీవో శ్రీలత, డీఎల్పీవో హరికిషన్, ఎంపీవో కిరణ్, పంచాయతీ కార్యదర్శి కె. మహేందర్ రావు, ఎస్‌బీఎం కిషన్‌స్వామి, రమేష్, వేణు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు శిబారాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. గురువారం మూడో వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీనివాస్, కుమారస్వామి, సుశీల, కమిషనర్ సమ్మయ్య, నాయకులు ప్రతాపకృష్ణ, నరేష్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. శిబిరాన్ని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రవీందర్ ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి ప్రజలందరూ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, సీహెచ్‌వో ఎండీ సాజిద్ హుస్సేన్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


చొప్పదండి: మున్సిపల్ కార్యాలయంలో కరీంనగర్‌లోని మెడికర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ శాంతికుమార్‌లు ప్రారంభించిన శిబిరంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి, మెప్మా ఆర్‌పీలకు ఈసీజీ, బీపీ, షుగర్, తదితర ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, ఎన్నం అంజయ్య, పి.రవీందర్, కె.శ్రీధర్ రెడ్డి, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

కోతల్లేని కరెంట్..

రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేనంతగా పెరిగిన వినియోగం

రోజుకు 248 మిలియన్ యూనిట్లు దాటిన వాడకం

- గత ఏడాది కంటే 27.51 శాతం అధిక డిమాండ్
- అయినా ఎక్కడా కోతల్లేకుండా నిరంతరాయంగా సరఫరా
- సీఎం జగన్ ముందుచూపు వల్లే ఇది సాధ్యం
- డిమాండ్ పెరిగి.. సాంకేతిక కారణాల వల్లే అక్కడక్కడ ట్రిప్
- నిమిషాల వ్యవధిలో సరిచేస్తున్న అధికారులు, సిబ్బంది
- గత ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలతో అల్లాడిన ప్రజలు
- అధికారికంగానే గంటల తరబడి కోతలు
- ఆ రోజులు మరిచి దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా


విద్యుత్ వెలుగుల్లో విజయవాడ

నాడు చీకటి రోజులు

గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 'పట్టణాల్లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే పగలంతా విద్యుత్ సరఫరా ఉండదు' అని అధికారికంగా ప్రకటనలు జారీ అయ్యేవి. 'ఎండా కాలం కదా.. పవర్ కట్ మామూలే' అని అప్పటి పాలకులు దబాయించే వారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలిసేది కాదు. వంటింట్లో మిక్సీలు తిరక్క గృహిణులు, హాల్లో ఫ్యాన్ తిరక్క పిల్లలు, ఆఫీసుల్లో ఏసీలు పనిచేయక ఉద్యోగులు, జిరాక్స్ సెంటర్ల వద్ద విద్యార్థుల పాట్లు అన్నీ ఇన్నీ కాదు. విద్యుత్ ఎప్పుడొస్తుందా అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వచ్చేది. ఆ రోజులను గుర్తు చేస్తే చాలు ప్రజలు కథలు కథలుగా చెబుతారు.

నేడు వెలుగు జిలుగులు

ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న పదానికి తావు లేకుండా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించారు. గృహాలకు, పరిశ్రమలకు, వ్యవసాయానికి ఏ రీతినా సమస్య లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం బొగ్గు నిల్వలు సరిపడా ఉండేలా చూసుకోవడంతోపాటు బయటి మార్కెట్‌లోనూ విద్యుత్ కొనుగోలు చేశారు. సరఫరాలో నాణ్యత పెరిగేలా వ్యవస్థాగత మార్పులు చేశారు. ఈ ఏడాది ఇదివరకెన్నడూ లేనంతగా అనూహ్యంగా డిమాండ్ పెరగడంతో అక్కడక్కడ ఓవర్‌లోడ్‌తో ట్రిప్ కావడం తప్పించి ఏ సమస్యా లేకుండా శ్రద్ధ పెట్టారు. అలాంటి చోట్ల నిమిషాల వ్యవధిలోనే మరమ్మతులు చేసేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేశారు. తద్వారా ఇళ్లలో, కార్యాలయాల్లో ఎక్కడా 'విద్యుత్ కోత' అన్న మాటే వినిపించడం లేదు. ఫ్యాన్లు, ఏసీలు, ఫ్రిజ్‌లు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి.

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇదివరకెన్నడూ లేని విధంగా విద్యుత్ డిమాండ్ పెరిగినప్పటికీ, ఎక్కడా కోతలన్నదే లేకుండా సరఫరా సవ్యంగా సాగుతోంది. ఆర్థిక కార్యకలాపాలు గణనీయంగా పెరగడం, ఎండలు మండిపోతుండటం వల్ల విద్యుత్ వినియోగం అమాంతం పెరిగింది. అయినా కాసేపు కూడా విద్యుత్ కోత లేకుండా నిరంతరాయంగా సరఫరా జరిగేలా సీఎం వైఎస్ జగన్ ముందుచూపుతో వ్యవహరించారు. గత సంవత్సరం గరిష్ట డిమాండ్‌తో పోలిస్తే ఇప్పుడు 27.51 శాతం అధికంగా ఉంది. ఉష్ణోగ్రత 46 డిగ్రీలు దాటుతోంది. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఫలితంగా ఇంట్లో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు వంటి గృహోపకరణాలు నిరంతరం పనిచేస్తున్నాయి. ఎక్కువ సమయం ఇంట్లోనే గడపడం వల్ల మిక్సీలు, గ్రైండర్లు, టీవీలు, కంప్యూటర్ల వినియోగం కూడా అధికంగానే ఉంటోంది. మరోవైపు పారిశ్రామిక వినియోగం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం రాకార్డు స్థాయిలో పెరిగిపోయింది. రోజువారీ డిమాండ్ 248.985 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గత ఏడాది ఇదే సమయానికి 195.266 మిలియన్ యూనిట్లుగా ఉండింది. రోజులో పీక్ డిమాండ్ 12,482 మెగావాట్లుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 9,308 మెగావాట్లు మాత్రమే. అంటే 34.10 శాతం పెరిగింది. పగటి పూట సగటు పీక్ డిమాండ్ 10,374 మెగావాట్లు, సాయంత్రం వేళల్లో 9,582 మెగావాట్లకు చేరుకుంది. అయినప్పటికీ గృహ, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా, డిమాండ్‌కు తగ్గట్టుగా విద్యుత్ సంస్థలు నిరంతరం కరెంట్ సరఫరా చేస్తున్నాయి. ఇలా దేశంలోనే ఎక్కడా జరగడం లేదని, రాష్ట్రం అభివృద్ధిపథంలో పయ నిస్తోందని చెప్పడానికి ఇదొక పెరామీటర్‌గా చెప్పవచ్చని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు.

ముందుచూపుతో విద్యుత్ కొనుగోలు

ప్రస్తుతం ఏపీజెన్కో థర్మల్ నుంచి 89.981 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 5.414 మి.యూ, సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్ల నుంచి 43.012 మి.యూ, సెయిల్, హెచ్‌పీసీఎల్, గ్యాస్ వంటి ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ల నుంచి 28.510 మి.యూ, సోలార్ నుంచి 25.605 మి.యూ, విండ్ నుంచి 11.591 మి.యూ, ఇతర మార్గాల్లో 1.496 మిలియన్ యూనిట్ల చొప్పున విద్యుత్ సమకూరుతోంది. అయితే ఇది మాత్రమే సరిపోవడం లేదు. దీంతో బహిరంగ మార్కెట్ నుంచి యూనిట్ సగటు రేటు రూ.7.537 చొప్పున రూ.33.936 కోట్లతో 45.023 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ప్రతిరోజూ కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈవిధంగా డిమాండ్‌ను అందుకోలేక భారీగా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. జార్ఖండ్‌లో 4.62 మి.యూ, హర్యానాలో 2.64 మి.యూ, ఉత్తరప్రదేశ్‌లో 2.08 మి.యూ, కర్ణాటకలో 1.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఏర్పడింది.

కోతల్లేకుండా ఇదే ప్రథమం

మాది పాలిమర్ ప్రాసెసింగ్ యూనిట్. రోజుకు 500 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగిస్తుంటాం. అయినప్పటికీ ఈ వేసవిలో ఏ రోజూ విద్యుత్ కొరత రాలేదు. ఏపీఈపీడీసీఎల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నారు. ఫలితంగా ప్రొడక్షన్ ఆగడం లేదు. గతంలో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండేవి. గంటల తరబడి మెషీన్లు ఆపితే తిరిగి అవి వేడెక్కేందుకు చాలా సమయం పట్టేది. మధ్యలో ఆగిపోవడం వల్ల సరుకు పాడయ్యేది. అందువల్ల ఆర్థికంగా చాలా నష్టపోయేవాళ్లం. ఇప్పుడు ఆ బాధలే లేవు. – ఐ.సురేష్ బాబు, పారిశ్రామికవేత్త, విశాఖపట్నం జిల్లా

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు

నేను 300 ఎకరాల చెరువుల్లో చేపలు, రొయ్యలు సాగు చేస్తున్నాను. ఏమాత్రం విద్యుత్ సరఫరా ఆగినా చాలా ఇబ్బంది పడిపోతాం. గతంలో అలాగే చాలా నష్టపోయాం. అప్పట్లో కరెంటు కోతలు ఎక్కువగా ఉండేవి. జనరేటర్లు పెట్టుకునే వాళ్లం. డీజిల్ మోటార్లతో నీరు తోడుకునేవాళ్లం. దానివల్ల పెట్టుబడి ఖర్చులు ఎక్కువయ్యేవి. చేతికొచ్చేది ఏమీ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆక్వాకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ను సబ్సిడీతో అందించడంతో పాటు విద్యుత్ కోతలు లేకుండా మా వంటి రైతులకు మేలు చేస్తోంది.

– ముంగర నరసింహారావు, ఆక్వా రైతు, ఆకివీడు, పశ్చిమగోదావరి జిల్లా

గత ప్రభుత్వ హయాంలో కోతలిలా

ఏడాది	మిలియన్ యూనిట్లు
2014–15	2202.07
2015–16	20.98
2016–17	34.89
2017–18	10.06
2018–19	6.50
2019–20	36.11

వాస్తవాలు మరచి దుష్ప్రచారం

ఎక్కడా విద్యుత్ కోతలు లేకపోయినప్పటికీ చంద్రబాబుకు లబ్ధి చేకూర్చేలా ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తోంది. గత చంద్రబాబు ప్రభుత్వం హయాంలో విద్యుత్ సరఫరా దుస్థితిని వ్యూహాత్మకంగా విస్మరిస్తోంది. గంటల తరబడి కోతలు విధించారనే విషయాన్ని దాస్తోంది. అప్పట్లో వేసవిలో కరెంటు పరిస్థితి చెప్పనలవి కాదు. వేసవిలో కాకుండా కూడా కోతలు విధించిన రోజులున్నాయి. పరిశ్రమలకైతే ఏకంగా పవర్ హాలిడేలు ఇచ్చారు. వారంలో మూడు రోజులు పరిశ్రమలన్నింటికీ తాళం వేయాల్సి వచ్చేది. జిరాక్స్ మెషీన్లు, పిండి మరలు, కూల్ డ్రింక్స్ దుకాణాలు, కూలింగ్ వాటర్ ప్లాంట్లు గంటల తరబడి పని చేయక చిరు వ్యాపారులు నష్టాలు చవిచూశారు. విద్యుత్ కోతల గురించి మాట్లాడితే అప్పటి ప్రభుత్వ పెద్దలు, మంత్రులు దబాయించే వారు. ఈ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ సీఎం జగన్ ప్రభుత్వం కోత అన్నదే లేకుండా విద్యుత్ సరఫరా చేస్తుంటే ఎల్లో మీడియాకు కడుపు మండుతోంది. వంకర బుద్ధి చూపిస్తూ.. చిన్న చిన్న సాంకేతిక కారణాలతో విద్యుత్ పోయిన ప్రాంతాలను చూపుతూ దుష్ప్రచారం చేస్తోంది.

'గుండెపోటు' మాటే లేదు

ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం

- సీబీఐ ఎస్పీ నన్ను కలసినప్పుడు ఆ పదమే చర్చకు రాలేదు
- నేను చెప్పని అంశాలను చెప్పినట్లు ఆంధ్రజ్యోతి ఎలా రాస్తుంది?
- జర్నలిజం దిగజారుడుతనానికి పరాకాష్ట అంటే ఇదే

సాక్షి, అమరావతి: మేనిఫెస్టో కమిటీ సమావేశానికి, హత్య కేసుకు సంబంధం ముడిపెడుతూ కథనాలను ప్రచురించటాన్ని బట్టి ఆంధ్రజ్యోతి ఏ స్థాయికి దిగజారిందో అర్థం అవుతోందని ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం వ్యాఖ్యానించారు. వైఎస్ వివేకా గుండెపోటుతో మృతి చెందినట్లు వైఎస్ జగన్ తనకు చెప్పారంటూ ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్త పచ్చి అబద్ధమని అజేయ కల్లం ఖండించారు. అంతకుముందే మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగిందని, అందులో పాల్గొన్న వారిని విచారించాలంటూ గతంలో ఓ కథనం వెలువరించిందని, అందులో భాగంగానే మళ్లీ పచ్చి అబద్ధాలను ప్రచురించిందన్నారు. ఏదో ఒకవిధంగా ముఖ్యమంత్రి జగన్ పేరును లాగాలనే ప్రయత్నం మినహా ఆంధ్రజ్యోతి కథనాల్లో వాస్తవాలు లేవని స్పష్టం చేశారు. సీబీఐ తనను విచారించిందంటూ ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తను గురువారం సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అజేయ కల్లం తీవ్రంగా ఖండించారు. కొద్దిరోజుల క్రితం సీబీఐ ఎస్పీ తన ఇంటికి వచ్చి ఐదు నిమిషాలు మాట్లాడి సమాచారం తీసుకున్నారని, ఆ సమయంలో గుండెపోటు అంశం చర్చకే రాలేదని, దాని గురించి అడగలేదని అజేయ కల్లం వెల్లడించారు. వైఎస్ వివేకానందరెడ్డి మృతి చెందిన రోజు యాధృచ్ఛికంగా పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతోందన్నారు. సమావేశం జరుగుతుండగా కొంతసేపటికి 'వివేకానందరెడ్డి గారు నో మోర్..' అని ఇంగ్లిష్‌లో చెప్పడంతో ఇక లేచి వచ్చేశామన్నారు. అదే విషయాన్ని సీబీఐ ఎస్పీకి చెప్పానన్నారు. 'మీరు స్వచ్ఛందంగా అంగీకరిస్తే రికార్డు చేసుకుంటామని సీబీఐ ఎస్పీ కోరారు. సెక్షన్ 161 కింద సమాచారాన్ని అడిగారు. అయితే ఆ సమాచారం, రికార్డుకు న్యాయపరమైన విలువ ఉండదు. సంతకాలు తీసుకోలేదు' అని కల్లం పేర్కొన్నారు.



"నేను సీబీఐ ఎస్పీకి చెప్పని వాటిని కూడా చెప్పినట్లుగా ఆంధ్రజ్యోతి కథనాలను ప్రచురించడం దిగజారుడు జర్నలిజానికి పరాకాష్ట. వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి చెందారని వైఎస్ జగన్ నాతో అన్నారని నేను సీబీఐకి వెల్లడించినట్లు వెలువడ్డ కథనం పచ్చి అబద్ధం" – అజేయ కల్లం

గుండెపోటు మాటే చర్చకు రాలేదు..

అసలు గుండెపోటు అనే పదమే సీబీఐ ఎస్పీని కలుసుకున్న సందర్భంగా చర్చకు రాలేదని అజేయ కల్లం స్పష్టం చేశారు. కేసు దర్యాప్తులో ఉన్న సమయంలో రహస్యంగా ఉండాల్సిన తమ ఇద్దరి సంభాషణ సమాచారం లీకుల పేరుతో ఆంధ్రజ్యోతిలో రావడం అంటే సీబీఐ విశ్వసనీయత కూడా దెబ్బతిన్నట్లేనని పేర్కొన్నారు. ఇది సీబీఐ పేరును దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. 'మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆ పనిమీద దృష్టి పెడతాం కానీ గడియారం చూసుకుంటూ కూర్చోం కదా! ఎవరు ఎప్పుడు బయటకు వెళ్లారో ఎలా తెలుస్తుంది? అయినా ఈ సమావేశాన్ని సీరియస్ మర్డర్ కేసుకు ముడిపెట్టి ఆంధ్రజ్యోతి తనకు కావాల్సినట్లు రాసుకోవడం కంటే అనైతికం మరొకటి ఉండదు..' అని కల్లం మండిపడ్డారు.

ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉంది

తన దగ్గర నుంచి తీసుకున్న సమాచారం చార్జిషీటు వేసేవరకు రహస్యంగా ఉండాలని, లీకుల పేరుతో తప్పుడు సమాచారం మీడియాలో ప్రచురితమైనందున ఆ వార్తను ఖండించాల్సిన బాధ్యత సీబీఐపై ఉందని కల్లం పేర్కొన్నారు. తప్పుడు సమాచారంతో మీడియాలో సమాంతర దర్యాప్తు జరగకూడదని, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీలు మీడియాకు వివరాలు వెల్లడించరాదని సుప్రీం కోర్టు తీర్పులున్నాయని కల్లం ప్రస్తావించారు.

నా భార్యకు కూడా తెలియదు..

'దర్యాప్తు అంశాలను ఇష్టానుసారం ప్రచురించేందుకు, మీడియా తమ ఇష్టం అనేందుకు వీల్లేదని సుప్రీంకోర్టు తాజా తీర్పులున్నాయి. కనీస క్రమ శిక్షణ, కోడ్ ఆఫ్ కాండక్ట్ మీడియాకు అవసరం. నేను సీబీఐ ఎస్పీకి చెప్పని అంశాలను చెప్పినట్లుగా నా ఫొటోతో పెద్ద శీర్షిక పెట్టి కథనాలు ప్రచురించటాన్ని బట్టి ఆ పత్రిక ఏ స్థాయికి దిగజారిందో తెలుస్తోంది. ఆ సమయంలో నేను, సీబీఐ ఎస్పీ మాత్రమే ఉన్నాం. మా ఇంటికి సీబీఐ ఎస్పీ వచ్చిన విషయం నా భార్యకు కూడా తెలియదు. ఆంధ్రజ్యోతిలో తప్పుడు వార్త ప్రచురించిన తరువాతే మిగతా వారికి తెలిసింది' అని కల్లం తెలిపారు. తప్పుడు వార్తపై తగిన సమయంలో చర్యలు తీసుకుంటా' అని చెప్పారు.

సమాంతర విచారణ తగదు..

ఏదైనా క్రిమినల్ కేసు దర్యాప్తు జరుగుతున్నప్పుడు దానికి సమాంతరంగా విచారణను ప్రభావితం చేసేలా మీడియా కథనాలను రాయకూడదు, చర్చలు పెట్టకూడదు. దర్యాప్తు సమయంలో విచారణాధికారికి సాక్షులు వెల్లడించిన అంశాలను చార్జిషీట్ వేసేవరకు బహిర్గతం చేయకూడదు. విచారణలో వెల్లడైన అంశాలను బహిర్గతం చేస్తూ కథనాలను ప్రచురిస్తే వ్యక్తిగత స్వేచ్ఛను హరించినట్లేనని పలు కేసుల్లో సుప్రీంకోర్టు, హైకోర్టులు తీర్పులిచ్చాయి. దీన్ని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా స్వాగతించింది' అని కల్లం చెప్పారు.



ఎండమావులు

ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు 44, 45 డిగ్రీల సెల్సీయస్‌గా నమోదవుతుండడంతో ఎండ నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ సమీపంలోని జాతీయ రహదారిపై ఎండమావులు వర్షపుధారలను తలపిస్తున్నాయి. దూరం నుంచి చూస్తే వర్షం కురుస్తుందా అన్నట్లుగా ఉన్న ఎండమావులు జిల్లాలోని భానుడి ఉగ్రరూపానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పేపర్ లీకేజీలో ఒకరి అరెస్ట్?

నార్నూర్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనలో ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుండాల గ్రామానికి చెందిన రాజేష్‌ను సిట్ అధికారులు బుధవారం అరెస్టు చేసినట్లు తెలిసింది. ఈ విషయం ఆలస్యంగా గురువారం బయటకు వచ్చింది. రాజేష్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇప్పటికే దర్యాప్తు వేగవంతం చేసిన సిట్ అధికారులు గత రెండ్రోజులుగా మండలంలో మకాం వేసి రాజేష్ వ్యవహారశైలిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. టీఎస్‌పీఎస్సీ ద్వారా జేఈఈ పరీక్ష రాసినట్లు సమాచారం. ముగ్గురు సిట్ అధికారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తహసీల్దార్ ఆర్కా మోతిరాంను సంప్రదించగా.. బధవారం ముగ్గురు సిట్ అధికారులు కార్యాలయంలోనికి వచ్చారని తెలిపారు. సీట్ ఎస్ఐగా పరిచయం చేసుకోని ధరణి అపరేటర్‌పై ఆరా తీశారని, అప్పుడే ధరణి ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకుని జీబులో ఎక్కించుకు వెళ్లారని పేర్కొన్నారు. సీఐ ప్రేమ్‌కుమార్‌ను సంప్రదించగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.







చారిత్రక ఆనవాళ్లకు చలనం..!

నిర్మల్ పాలకులు నిమ్మనాయుడు కాలం నాటి చారిత్రక ఆనవాళ్లకు చలనం వచ్చింది. దశాబ్దాలుగా ప్రస్తుత కలెక్టరేట్ ఎదుట, నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న భారీ పంచలోహ మర ఫిరంగులు క్రమంగా మట్టిలో కూరుకుపోతున్నాయి. ఎట్టకేలకు వాటిని నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలోకి తరలిస్తున్నారు. వీటికి రంగులు వేసి కొత్త కలెక్టరేట్ ఆవరణలో అలంకరణగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. – సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్

వానాకాలం.. పత్తి సాగు భారం

- పెరిగిన విత్తనాల ధర
- కరీంనగర్ జిల్లా రైతులపై రూ.1.29 కోట్ల భారం
- ఇప్పటికే దుక్కులు, ఎరువులకు భారీగా ఖర్చు



కరీంనగర్ అర్బన్: ఆదిలోనే హంసపాదు అన్నట్లుగా తయారైంది అన్నదాత పరిస్థితి. వానాకాలం సీజన్ రాకముందే పెరుగుతున్న ధరలు గుబులు రేపుతున్నాయి. ఇప్పటికే డీజిల్ రేటు పెరిగి దుక్కులపై భారం పడగా, ఎరువుల ధరలూ పెరగడంతో రైతులు కుదేలయ్యారు. తాజాగా పత్తి విత్తనాల ధరలు పెంచడంతో వారిలో ఆందోళన నెలకొంది. కరీంనగర్ జిల్లాలో వరి తర్వాత పత్తి సాగు విస్తీర్ణమే సింహభాగం. లక్ష ఎకరాల్లో పత్తి సాగవుతుండగా విత్తనాలతో జిల్లా రైతులపై 1.29 కోట్ల భారం పడనుంది.

ప్యాకెట్ ధర రూ.853..

జిల్లాలో పంటల ప్రణాళిక ఈ వానాకాలం నుంచి మారనుంది. ఎక్కువగా వరి సాగవుతుండగా ఈసారి పత్తి సాగు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏటా వానాకాలంలో లక్ష ఎకరాల వరకు పత్తి వేస్తుండగా ఈ సీజన్ నుంచి 1.30 లక్షలకు పెంచనున్నట్లు సమాచారం. తిమ్మాపూర్, మానకొండూరు, హుజూరాబాద్, చొప్పదండి, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, శంకరపట్నం, గన్నేరువరం, చిగురుమామిడి తదితర మండలాల్లో వరి సాగు ఎక్కువ. సదరు ప్రాంతాల్లోనూ పత్తిని సాగు చేసేలా అధికారులు చర్యలు చేపట్టనుండగా పెరిగిన ధరలు అయోమయానికి గురిచేస్తున్నాయి. బీజీ–1 పత్తి విత్తనాన్ని రైతులెవరూ కొనుగోలు చేయరు. బీజీ–2 విత్తనాలపైనే ఆసక్తి ఎక్కువ. సదరు ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ.853 కాగా గతంలో రూ.810 ఉంది. రూ.43 పెరగడం రైతులకు మరింత భారమవుతుంది.

విత్తనోత్పత్తే ప్రత్యామ్నాయం..

విత్తనోత్పత్తికి కరీంనగర్ జిల్లా అనుకూలం. కానీ సరైన ప్రణాళిక, కార్యాచరణ లేకపోవడంతో ఏటా ప్రైవేట్ కంపెనీలు విత్తనంపై పెత్తనం చేస్తున్నాయి. అవి నిర్ణయించిన ధరకే ప్రభుత్వం కొనుగోలు చేసి, ఆ భారాన్ని రైతులపై మోపడం పరిపాటిగా మారుతోంది. రైతులపై విత్తన భారం పడకూడదంటే విత్తనోత్పత్తే ఏకైక మార్గం. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. మూడేళ్లుగా వరి, కంది, మొక్కజొన్న విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నా అవి అరకొరే. జిల్లాలో ఏటా అన్ని రకాల విత్తనాలపై రూ.83 కోట్ల వ్యాపారం జరుగుతోంది.

జిల్లాలో దుక్కుల ఖర్చు ఇలా..

రైతులు	: 1.70 లక్షల మంది
సాగు భూమి	: 3.38 లక్షల ఎకరాలు
గతేడాది దున్నేందుకు గంటకు వ్యయం	: రూ.750–రూ.900
ప్రస్తుతం గంటకు వ్యయం	: రూ.1,000–రూ.1,200
పొలంలో దున్నేందుకు కేజ్‌వీల్‌కు గంటకు	: రూ.1,300–రూ.1,500
ప్రస్తుతం డీజిల్ ధర	: రూ.89.15
రైతులపై పడే భారం	: సుమారు రూ.8 కోట్లు

ఒక సీజన్‌లో ఎరువుల వినియోగం

యూరియా	: 37,219
డీఏపీ	: 7,115
యంవోపీ	: 7,317
కాంప్లెక్స్ ఎరువులు	: 11,227
ఎస్ఎస్‌పీ	: 500
ఏటా ఎరువుల వినియోగం	:1.40లక్షల మెట్రిక్ టన్నులు
ధరల పెరుగుదలతో భారం	: రూ.1.91 కోట్లు

ప్రభుత్వం రాయితీ ఇవ్వాలి



ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి, కుటుంబ పోషణకు ఉక్కిరిబిక్కిరవుతున్నం. సాగు రంగంలో నిలవాలంటే ప్రభుత్వ ప్రోత్సాహకం తప్పనిసరి. విత్తనాలపై రాయితీ ఇచ్చి, ప్యాకెట్‌ను రూ.600కే ఇవ్వాలి. – మల్లేశం, రైతు, శంకరపట్నం

రైతుల బాధలు పట్టించుకుంటలేరు



ధరలను పెంచుతున్నారే తప్ప రైతుల బాధలను ఎవరూ పట్టించుకుంటలేరు. ఓ చేత్తో ఇచ్చి, మరో చేత్తో లాక్కున్నట్లుగా ఉంది పరిస్థితి. ప్రభుత్వమే పత్తి విత్తనాలు ఇవ్వాలి. విత్తనోత్పత్తిని ప్రోత్సహించాలి. – రాజయ్య, రైతు, చొప్పదండి

గుండెపోటుతో విద్యార్థి మృతి


సచిన్ (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్‌లో గుండెపోటుతో విద్యార్థి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుణవంత్ రావ్, లలిత దంపతుల కుమారుడు చునార్కర్ సచిన్(16) ఇటీవలే పదో తరగతి పాసయ్యాడు. గురువారం కడుపునొప్పి రావడంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు. మంచిర్యాలలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు.

డంపింగ్ యార్డులో మంటలు


కాలుతున్న డంపింగ్ యార్డు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని డంపింగ్ యార్డులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. మండల కేంద్రం శివారులో పిప్పల్‌ధరి గ్రా మానికి వెళ్లే దారిలో ఉన్న డంపింగ్ యార్డులో బుధవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే డంపింగ్ యార్డులో ప్లాస్టిక్, వ్యర్థపదార్థాలు ఉండటంతో మంటలు ఎక్కువగా వ్యాపించాయి. ఈవో అంజయ్య పంచాయతీ కార్మికులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని గమనించారు. మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. గురువారం ఉదయం వాటర్ ట్యాంకర్‌తో మంటలు ఆర్పివేశారు.

వేములవాడలో వేద సమ్మేళనం

వేములవాడ: రాజన్న సిరిసిల్లజిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో తెలుగు రాష్ట్రాల వేదసమ్మేళనం గురువారం నిర్వహించారు. శారదాపీఠం సీఈవో వీఆర్ గౌరీశంకర్ వేదమంత్రోచ్ఛరణల మధ్య వేదసమ్మేళనాన్ని ప్రారంభించారు. గౌరీశంకర్ మాట్లాడుతూ శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థస్వామి, విధుశేఖర భారతీ మహాస్వామి ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు రాజన్నకు ప్రత్యేక పూజలుచేసి, కోడెమొక్కును చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు. శృంగేరి జగద్గురు మహాసంస్థాన్ ధర్మాత్మ డాక్టర్ యజ్ఞ సుబ్రమణ్యం, ఆచార్య కేఎస్ఎస్ అవధాని, రాధాకృష్ణశర్మ, ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మతోపాటు 150 మంది పండితులు పాల్గొన్నారు.



ఫ్యాషన్


క్రోచెట్ డిజైన్ డ్రెస్‌లో మోడల్

మనవైన చేనేతలు అంతర్జాతీయ మార్కెట్లోకి
వెళ్లినప్పుడు ఉపాధి అవకాశాలు కూడా అంతే ఘనంగా లభిస్తాయి.
ఫ్యాబ్రిక్‌తోనే కాదు దారంతోనూ
అద్భుతాలు చేయచ్చు, అంతర్జాతీయ మార్కెట్లోకి
మన కళను కళ్లకు కట్టచ్చు ..అని మన నవతరం
మరో అడుగు ముందుకు వేసింది.
హైదరాబాద్ ఎఫ్‌డిడిఐ ఇన్‌స్టిట్యూట్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు
వెస్ట్‌గోదావరిలోని నర్సాపురం, మండవారి పేటలో
క్రొచెట్ (అల్లిక) వర్క్ చేసే క్లస్టర్స్‌తో కలిసి
మోడర్న్ డ్రెస్ డిజైన్స్ రూపొందించారు.
మన క్రొచెట్ వర్క్‌కి అంతర్జాతీయంగా పేరు తీసుకురావాలని
వీరు చేసిన కృషి ఇటీవల అందరి ప్రశంసలు అందుకుంది.
ఈ సందర్భంగా టీమ్‌వర్క్ డిజైనర్లు దీక్షిక, వాక్షిక, షామిలీ, పవన్ లు
ఎన్నో విషయాలను మన ముందుంచారు.

డిజైన్లు అల్లినారు


దారాల అల్లికతో రూపు కట్టిన అందం

బర్డ్ ఇన్ ద నెస్ట్

'పిచుకలు గడ్డితోనూ, ఇతర వ్యర్థాలతోనూ తమ గూడును ఎంత నైపుణ్యంగా అల్లుకుంటాయో మనకు తెలుసు. అవి చాలా చూడముచ్చటగా ఉంటాయి. ఆ థీమ్‌ని మా కలెక్షన్‌లో చూపాలనుకున్నాం. ఒక పిచుక రకరకాల గడ్డి పరకలతో ఎలా తన ఇల్లు కట్టుకుంటుందో, అలా 'బర్డ్ ఇన్ ద నెస్ట్' పేరుతో క్రోచెట్ అల్లిక ద్వారా చూపాం. అలాగే, గూడు లోపల పిచుక కూచొని, బయటకు వెళ్లిపోయినప్పుడు ఆ గూడు ఎలా ఉంటుందో .. కూడా మా డిజైన్ ద్వారా ప్రజెంట్ చేశాం. ఈ థీమ్ తీసుకోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి.. ఇంటర్నేషనల్ కలెక్షన్ 2024- 25 సమ్మర్ - వింటర్ ట్రెండ్‌లో క్రొచెట్ ఉంది. అందుకు ముందస్తుగా మేమే ఒక కలెక్షన్ చేయాలనుకున్నాం. రెండవది.. వెస్ట్ గోదావరి జిల్లా, నర్సాపురం, మండపేట గ్రామంలో అంతా క్రోచెట్ వర్క్‌లో నిపుణులని, మన క్రోచెట్ క్లస్టర్ వర్క్‌కి అంతర్జాతీయ మార్కెట్‌లోకి తీసుకురావాలన్నది మా ఆలోచన.


క్రోచెట్ వర్క్ చేస్తున్న మహిళలు

లక్షన్నర ఖర్చు

హ్యాండ్లూమ్స్‌తో మన దగ్గర చాలా మంది చాలా రకాల థీమ్ ఫ్యాషన్స్ తీసుకువచ్చారు. అలా ఆలోచిస్తున్నప్పుడే మాకు మండపేట క్లస్టర్స్‌కి మా డిజైన్స్ గురించి చెప్పి, వారి నైపుణ్యాలను బయటి వారందరికీ పరిచయం చేయచ్చు అనిపించింది. ఫ్యాబ్రిక్‌తోనే కాదు దారంతోనూ మనదైన నైపుణ్యం చూపించవచ్చు అని ఎంచుకున్నాం. అల్లిక కోసం దారాలను ఢిల్లీ, సూరత్, అహ్మదాబాద్‌ల నుంచి తెప్పించాం. ఈ కలెక్షన్‌కి మొత్తం లక్షన్నర రూపాయల వరకు ఖర్చు అయ్యింది.

ఏడుగురు మహిళలు

మండపేట గ్రామంలో ముందుగా కొందరు మహిళలతో మాట్లాడాం. వారికి టైలరింగ్ అంటే తెలుసు కానీ, ఫ్యాషన్ డిజైనింగ్ అంటే తెలియదు. అప్పటివరకు వాళ్లంతా ఒకే స్టైల్‌ని అనుసరిస్తున్నారు. వాళ్లకు లేస్ వర్క్ చేస్తున్నామని మాత్రమే తెలుసు. అందులో టేబుల్, సోఫా కవర్లు మొదలైనవి ఉన్నాయి. 50 మంది మహిళలకు మేమే స్వయంగా వర్క్ షాప్స్ నిర్వహించాం. వారిలో ఏడుగురిని ఎంపిక చేసుకుని, ఈ వర్క్ ఇచ్చాం. ఈ మోడల్ క్రోచెట్ వర్క్‌కి ఓ రూపం రావడానికి 25 రోజులు పట్టింది. మొత్తం ఆరు డ్రెస్సులు రూపొందించాం. ఇప్పటివరకు వాళ్లెవరూ ఇలాంటి డ్రెస్సులను రూపొందించలేదు. అసలు కాన్సెప్ట్ అర్థం చేసుకోవడానికే వారికి నాలుగు రోజులు పట్టింది. ఫుట్‌వేర్, లెదర్ వస్తువు తయారీలోనూ ఈ క్రోచెట్‌ను ఇన్‌క్లూడ్ చేయచ్చు. వెస్ట్ గోదావరి కలెక్టర్‌ను కలిసి, డిజైనింగ్ స్టూడెంట్స్- ప్రభుత్వం కలిస్తే మండపేట క్లస్టర్స్ వర్క్‌ని ఒక అడుగు ముందుకు తీసుకెళ్లచ్చు అని వివరించాం. వాళ్లు అందుకు తమ అంగీకారాన్ని తెలిపారు.


క్రోచెట్ వర్క్ డ్రెస్ డిజైన్స్ చేసిన మహిళలతో డిజైనర్లు

బెస్ట్ క్రాఫ్ట్ రివైవల్ అవార్డు

దాదాపు 26 టీమ్స్ తమ భిన్నమైన వర్క్స్‌తో మా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. అందులో మేం చేసిన ఈ ఆలోచనకు, ప్రయత్నానికి మా కాలేజీ నుంచి 'బెస్ట్ క్రాఫ్ట్ రివైవల్ అవార్డు' అందుకున్నాం. ఈ అవార్డు అందుకున్నప్పుడు మాకు కలిగిన ఆనందం మాటల్లో చెప్పలేం' అని వివరించారు ఈ డిజైనర్లు.

• • •

నేర్చుకున్న విద్య ద్వారా కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలనే తపనతోపాటు, అంతర్జాతీయంగా మన కళల నైపుణ్యాన్ని పరిచయం చేయాలని తపిస్తున్న యువతరాన్ని అభినందిద్దాం.

– నిర్మలారెడ్డి

కిచెన్ టిప్స్

వెండి వస్తువులు శుభ్రం చేసే పద్ధతి

కెచప్‌తో క్లీన్



వెండి వస్తువులను శుభ్రం చేయడానికి శ్యాండ్ విచ్, సమోసాలతో తినే కెచప్‌ను వాడొచ్చు. ఒక టిష్యూ పేపర్ మీద కాస్త కెచప్ వేసుకుని నలుపు ఉన్న దగ్గర రుద్దాలి. అలాగే ఓ 15 నిమిషాలు వదిలేయండి. ఆ తరువాత మెత్తని వస్త్రంతో తుడుచుకోవాలి. డిజైన్లున్న వస్తువులైతే మెత్తగా ఉండే టూత్ బ్రష్ తో ఒకసారి రుద్దండి. కెచప్‌లో ఉండే ఆమ్లతత్వం వల్ల వెండి వస్తువులు తెల్లబడతాయి.



వెనిగర్‌తో...

సగం కప్పు వెనిగర్‌లో, రెండు టేబుల్ స్పూన్ల బేకింగ్ సోడా, గోరువెచ్చని నీళ్లు కలిపి దాంట్లో వెండి వస్తువులు పూర్తిగా మునిగేనేలా పెట్టుకోవాలి. ఒక రెండు గంటల తరువాత చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి.

ఇత్తడి వస్తువులకు బియ్యప్పిండి, వెనిగర్



మూడు స్పూన్ల ఉప్పు, చెంచా మైదా లేదా బియ్యప్పిండి, నీళ్లు కలిపిన వెనిగర్ తీసుకుని పేస్ట్ లాగా చేసుకోవాలి. స్పాంజి లేదా ఏదైనా బట్ట సహాయంతో రాగి వస్తువులకు రాసుకోవాలి. ఆరిన తర్వాత వేడి నీళ్లతో కడిగేసుకుంటే చాలు. ఇత్తడి వస్తువుల నలుపు వదిలిపోతుంది. వెనిగర్‌కు బదులుగా నిమ్మరసం కూడా వాడొచ్చు.

రాగి వస్తువులు శుభ్రం చేసే పద్ధతి



రాగి వస్తువులను నిమ్మరసంతో, వెనిగర్‌తో, కెచప్ తో కూడా శుభ్రం చేసుకోవచ్చు. టూత్ పేస్ట్ కూడా ఉపయోగించొచ్చు. కానీ అస్సలే నలుపు తగ్గకపోతే ఈ పద్ధతిలో శుభ్రం చేసి చూడండి.

లోతు ఎక్కువగా ఉన్న స్టీల్ పాత్ర తీసుకోవాలి. దాంట్లో రాగి వస్తువులు మునిగేలా నీళ్లు పోసుకోవాలి. మూడు వంతుల నీళ్లకు 1 వంతు వెనిగర్ వేయాలి. దీంట్లోనే 3 చెంచాల ఉప్పు కూడా వేసుకోవాలి. ఇప్పుడు దీంట్లో రాగి వస్తువును మునిగేలా పెట్టుకుని, నీళ్లను వేడి చేసుకోవాలి. నీళ్లు మరగడం మొదలవ్వగానే జిడ్డు వదలడం గమనిస్తారు. ఇప్పుడు వెంటనే గ్యాస్ కట్టేయండి. నీళ్లు చల్లబడ్డాక రాగి వస్తువులు బయటకు తీసి నిమ్మరసం, ఉప్పు కలిపిన మిశ్రమంతో ఒకసారి రుద్ది కడిగేయండి.

● ఐడియా

ఇంట్లో అందరికీ షుగర్ వస్తే మంచి డాక్టర్ ఎవరా అని వెతుకుతారు అంతా.
కాని ఎంబీఏ చేసి మంచి హోదాలో ఉన్న నవనూర్ కౌర్ మాత్రం ఉద్యోగం వదిలేసింది.
లోకంలో ఇంత మందికి షుగర్ ఉందంటే చక్కెరకు ప్రత్యామ్నాయమైన బెల్లం అమ్మితే
అటు ఆరోగ్యం, ఇటు లాభం అని నిశ్చయించుకుంది.
'జాగర్‌కేన్' అనే బ్రాండ్ స్థాపించి నాణ్యమైన బెల్లం పొడిని తెగ అమ్మేస్తోంది.
టీలో కలపాలన్నా, స్వీట్ చేయాలన్నా బెల్లం పొడి బెస్ట్ అంటోంది. ఈమె వ్యాపారం జామ్మని సాగుతోంది.

బెల్లం పొడి అమ్మేస్తోంది


నవనూర్ కౌర్

నవనూర్ కౌర్ ప్రచార చిత్రాలు ఎవరినైనా ఆకర్షిస్తాయి. ఒక పోస్టర్‌లో 'బెల్లం పాలు తాగితే ఎన్ని ఉపయోగాలో తెలుసా? వత్తిడి తగ్గుతుంది, స్త్రీలలో రుతుస్రావ సమస్యలు తగ్గుతాయి, హిమోగ్లోబిన్ పెరుగుతుంది, చర్మానికి మంచిది, జీర్ణక్రియ బాగుంటుంది, కీళ్ల నొప్పులు తగ్గుతాయి'. ఆ పోస్టర్ చూసినవారెవరైనా బెల్లం పాలు తాగాలనే అనుకుంటారు.

ఇంకో పోస్టర్‌లో చక్కెరకు బెల్లానికి ఉన్న వ్యత్యాసాలు చూపిస్తుందామె. 'చక్కెర రక్తంలో వెంటనే కరిగిపోతుంది. కాని బెల్లం మెల్లగా కరిగి మెల్లగా శక్తిని విడుదల చేస్తుంది. చక్కెరలో ఏ పోషకాలూ లేవు. బెల్లంలో ఐరన్, పొటాషియం ఉంటాయి. చక్కెర అసిడిటీ ఇస్తుంది. బెల్లం జీర్ణానికి అవసరమైన ఆల్కలైన్‌గా మారుతుంది'.

నవనూర్ కౌర్ బెల్లం అమ్మకాల్లో ఏదో గుడ్డిగా ప్రవేశించలేదు. ఒక సంపూర్ణ అవగాహన, లక్ష్యంతో తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది.

బిజినెస్ స్కూల్ విద్యార్థి

నవనూర్ కౌర్‌ది లూధియానా. తండ్రి ప్రొఫెసర్. తల్లి స్కూల్ ప్రిన్సిపాల్. చురుకైన విద్యార్థి అయిన నవనూర్ కౌర్ ఐఎంటి ఘజియాబాద్ నుంచి ఎంబీఏ చేసింది. వెంటనే కొటాక్ మహేంద్ర బ్యాంక్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. కాని తనకు వేరే ఏదో చేయాలని ఉండేది. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే చేయదగ్గ వ్యాపారం ఏమిటా అని ఆలోచిస్తే తమ కుటుంబంలో బంధువుల్లో షుగర్ పేషెంట్లు ఎక్కువగా ఉన్నారని అర్థమైంది. డయాబెటిస్ పేషెంట్లు, డయాబెటిస్ ఉన్న వాళ్లు తీపి కోసం బెల్లం ఉపయోగించాలని అనుకున్నా మార్కెట్‌లో దొరుకుతున్న బెల్లం నాణ్యంగా లేదని తెలుసుకుంది. ఆర్గానిక్ బెల్లం అని చెప్పి అమ్ముతున్నది కూడా కల్తీయే అని అర్థమయ్యాక ఒక వైపు ఉద్యోగంలో తాను సంపాదించిన ఐదు లక్షల రూపాయలతో బెల్లం పొడి తయారీ కేంద్రం పెట్టి, అందులో బెల్లం పొడి తయారు చేసి అమ్మాలని నిశ్చయించుకుంది.

అవాంతరాలు

ఆర్గానిక్‌గా చెరకు పండించి, రసాయనాలు లేకుండా బెల్లం తయారు చేసి సరుకు వేసేవారి కోసం నవనూర్ కౌర్ పంజాబ్, ఉత్తర ప్రదేశ్ చాలా తిరగాల్సి వచ్చింది. అలా ఇస్తామని చెప్పిన వారు కూడా మోసం చేయక తప్పని పరిస్థితిలో ఉన్నారని గ్రహించింది. అయితే అదృష్టవశాత్తు తన తండ్రి దగ్గర చదువుకుని సేంద్రియ పద్ధతిలో చెరకు పండిస్తున్న కౌశల్ అనే రైతు పంజాబ్‌లోనే ఆమెకు దొరికాడు. అతనికి బెల్లం తయారీ కేంద్రం కూడా ఉంది. 'నువ్వు నాణ్యమైన బెల్లం తయారు చేయ్. నేను మార్కెటింగ్, బ్రాండ్ చూసుకుంటాను. ఇద్దరం కలిసి వ్యాపారం చేద్దాం' అని చెప్పింది. కౌశల్ సరే అన్నాడు. ఇద్దరూ కలిసి 'జాగర్‌కేన్' అనే బ్రాండ్ మొదలుపెట్టారు.

వెంటనే ఆదరణ

నవనూర్ కౌర్ తయారు చేసిన బెల్లం పొడి వెంటనే ఆదరణ పొందింది. కల్తీ లేనిది కావడాన... రుచి కూడా బాగుండటాన అందరూ కొనడం మొదలెట్టారు. దుకాణం దారులు నిల్వ ఉండటం లేదని ఫిర్యాదు చేస్తే తగిన ప్రయోగాలు చేసి 9 నెలల పాటు నిల్వ ఉండేలా తయారు చేశారు.



ఇప్పుడు 22 జిల్లాల్లో ఆమెకు డిస్ట్రిబ్యూషన్ ఉంది. గత సంవత్సరం 2 కోట్ల టర్నోవర్ వచ్చింది. మరో ఐదేళ్లలో 100 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంటామని భావిస్తోంది.

కృత్రిమమైన చక్కెర కంటే బెల్లం ఎక్కువ ఆరోగ్యకరమైనదని తెలుసుకునే కొద్దీ తనలా బెల్లం ఉత్పత్తులు చేసేవారు తప్పక విజయం సాధిస్తారని ఆమె గట్టిగా సందేశం ఇస్తోంది.

ఉద్యోగాలు మంచివే అయినా ఒక మంచి వ్యాపార ఐడియా ఎక్కడికో చేర్చగలదు. నవనూర సక్సెస్ స్టోరీ అందుకు ఉదాహరణ.

వంటిల్లు

బీరాలు పోవట్లేదు

రుచికీ, ఆరోగ్యానికీ బీర అదుర్స్

డయాబెటిస్... హైబీపీ... రాజ్యమేలుతున్న రోజులివి.
ఈ జంట సమస్యలు లేని ఇంటి కోసం భూతద్దంతో వెతకాల్సిందే.
స్క్రీన్‌లతో స్మార్ట్‌గా కళ్లకు అద్దాలు జోడవుతున్నాయి.
వీటికి జవాబులు మన 'వంటిల్లు'లో వెతుకుదాం.
వేడిని తగ్గించి, కంటికి మేలు చేసి, రక్తాన్ని వృద్ధి చేసే...
బీరకాయతో... రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం.
బీరాలు పోవడం లేదు... బీరకాయ కూరలు చేస్తున్నాం.

బీరకాయ పల్లీ కర్రీ

కావలసినవి: బీరకాయ ముక్కలు – అర కేజీ; పల్లీలు (వేరు శనగపప్పు) – పావు కప్పు (వేయించాలి); కొబ్బరి ముక్కలు – పావు కప్పు; **నూనె** – 2 టేబుల్ స్పూన్‌లు; **ఆవాలు** – టీ స్పూన్; **జీలకర్ర** – టీ స్పూన్; **కరివేపాకు** – 2 రెమ్మలు; **ఎండుమిర్చి** – 2; **పసుపు** – పావు టీ స్పూన్; **ఇంగువ**– చిటికెడు; **ఉల్లిపాయ ముక్కలు** – అర కప్పు; **ధనియాల పొడి**– 2 టీ స్పూన్‌లు; **మిరప్పొడి**– టీ స్పూన్; **ఉప్పు** – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర– ఒక కట్ట (తరగాలి); నీరు – ముప్పావు కప్పు.



తయారీ: ● వేరుశనగపప్పు, కొబ్బరి ముక్కలు కలిపి గ్రైండ్ చేయాలి ● బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, ఇంగువ, కరివేపాకు, పసుపు వేయాలి. అవి వేగిన తరవాత ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి ● ఉల్లిపాయ ముక్కలు వేగిన తర్వాత ధనియాల పొడి, ఉప్పు, మిరప్పొడి వేసి నీరు పోసి మరిగించాలి. ఇప్పుడు బీరకాయ ముక్కలు వేసి కలిపి మగ్గనివ్వాలి. మిక్సీలో గ్రైండ్ చేసిన పల్లీలు– కొబ్బరి మిశ్రమాన్ని వేసి సమంగా కలిపి రుచి బీరకాయ ముక్కలకు పట్టేవరకు సన్న మంట మీద ఉడికించి, చివరగా కొత్తిమీర చల్లి దించేయాలి. ఇది అన్నంలోకి చపాతీలోకి కూడా మంచి కాంబినేషన్.

బీరకాయ నువ్వుల పచ్చడి

కావలసినవి: బీరకాయ ముక్కలు – కప్పు; **టొమాటో ముక్కలు** – అర కప్పు; **చింత పండు**– చిన్న గోళీ అంత; **మినప్పప్పు** – టీ స్పూన్; **పచ్చి శనగపప్పు** – టీ స్పూన్; **నువ్వులు** – 2 టేబుల్ స్పూన్లు; **ఆవాలు**– పావు టీ స్పూన్; **జీలకర్ర** – పావు టీ స్పూన్; **ఎండుమిర్చి లేదా పచ్చిమిర్చి** – 6; **నూనె** – టీ స్పూన్; **ఉప్పు** – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.
పోపు కోసం... **ఆవాలు**– అర టీ స్పూన్; **జీలకర్ర**– అర టీ స్పూన్; **వెల్లుల్లి రేకలు** – 6; **కరివేపాకు రెమ్మలు** – 2; **తెల్ల నువ్వులు** – అర టీ స్పూన్.



తయారీ: ● మందపాటి పెనంలో (నూనె లేకుండా) పచ్చి శనగపప్పు, మినప్పప్పు, నువ్వులు, మిర్చి, జీలకర్ర వేయించి ఒక ప్లేట్‌లోకి తీసుకోవాలి ● అదే పెనంలో నూనె వేడి చేసి బీరకాయ ముక్కలను ఒక మోస్తరుగా వేయించి పక్కన పెట్టాలి ● అదే పెనంలో టొమాటో ముక్కలను వేసి సన్న మంట మీద మగ్గనివ్వాలి ● ఈ లోపు వేయించిన గింజలు, మిర్చి చల్లారి ఉంటాయి. వాటిని మిక్సీ జార్‌లో మెత్తగా చేసి అందులో బీరకాయ ముక్కలు వేసి గ్రైండ్ చేయాలి. చివరగా టొమాటో ముక్కలు, చింతపండు, ఉప్పు వేసి గ్రైండ్ చేయాలి ● ఇప్పుడు పోపు పెట్టాలి. పెనంలో నూనె వేడి చేసి పోపుకోసం తీసుకున్న దినుసులన్నీ వేసి వేగిన తరవాత అందులో మిక్సీలో గ్రైండ్ చేసిన చట్నీని వేసి కలిపితే బీరకాయ చట్నీ రెడీ. ఇది ఇడ్లీ, దోశెలు, చపాతీలు, అన్నంలోకి కూడా మంచి రుచినిస్తుంది.

బీరకాయ వేపుడు

కావలసినవి: బీరకాయ ముక్కలు – 250 గ్రాములు; **నూనె** – టేబుల్ స్పూన్; **పచ్చి శనగపప్పు** – టీ స్పూన్; **మినప్పప్పు** – టీ స్పూన్; **ఆవాలు** – పావు టీ స్పూన్; **జీలకర్ర**– అర టీ స్పూన్; **ఇంగువ**– చిటికెడు; **కరివేపాకు రెమ్మలు** – 2; **వెల్లుల్లి రేకలు** – 4; **ఎండుమిర్చి**– 2; **ఉప్పు** – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; **పసుపు**– పావు టీ స్పూన్; **వేరుశనగ పప్పు** – టేబుల్ స్పూన్ (వేయించాలి). **పొడి కోసం:** పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; **మినప్పప్పు** – టేబుల్ స్పూన్; **ఎండు కొబ్బరి తురుము**– టేబుల్ స్పూన్; **నువ్వులు** – టేబుల్ స్పూన్; **జీలకర్ర**– టీ స్పూన్; **వెల్లుల్లి రేకలు** – 4; **ఎండుమిర్చి**– 2.



తయారీ: ● బీరకాయలు లేతవి అయితే ఈనెలు తొలగించి చెక్కుంచి ముక్కలు తరగవచ్చు. ముదురు కాయలకు చెక్కు కూడా తొలగించిన తరవాత ముక్కలు తరగాలి ● బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, పోపు గింజలన్నీ వేసి అవి వేగిన తరవాత ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ, వెల్లుల్లి రేకలు వేసి వేగిన తర్వాత బీరకాయ ముక్కలు వేయాలి ● రెండు – మూడు నిమిషాల సేపు మగ్గనిచ్చి, పసుపు, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి మంట తగ్గించి సన్న మంట మీద వేగనివ్వాలి ● మరొక బర్నర్ మీద మరొక బాణలి పెట్టి (నూనె లేకుండా) శనగపప్పు, మినప్పప్పు, ఎండుమిర్చి, నువ్వులు, జీలకర్ర, వెల్లుల్లి, కొబ్బరి తురుము వేసి మంచి వాసన వచ్చే వరకు సన్నమంట మీద వేయించి దించేయాలి. అన్నీ చల్లారిన తరవాత మిక్సీలో పొడి చేయాలి. ● బీరకాయ ముక్కలను అడుగు నుంచి ఒకసారి కలిపి పొడి చల్లి కలపాలి. ఒకసారి ఉప్పు సరి చూసుకుని అవసరమైతే మరికొంత కలుపుకుని చివరగా వేరుశనగపప్పు చల్లి దించేయాలి.

ఇలా చేసిన బీరకాయ వేపుడును సాంబార్ వంటివాటిలో సైడ్ డిష్‌గానూ వడ్డించుకోవచ్చు. వేడి అన్నంలో నెయ్యితోపాటు కలుపుకోవచ్చు. చపాతీలకు కూడా బాగుంటుంది. వేపుడు అనగానే పోషకాలు కోల్పోయే వంట అనే సందేహం కలుగుతుంది. కానీ ఇలా చేస్తే పోషకాలను నిలుపుకోవచ్చు.



200 మీటర్ల విభాగంలో జ్యోతికి స్వర్ణ పతకం

జాతీయ ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ రెండో స్వర్ణ పతకం సాధించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి గురువారం జరిగిన మహిళల 200 మీటర్ల విభాగంలో విజేతగా నిలిచింది. జ్యోతి 200 మీటర్ల రేసును అందరికంటే వేగంగా 23.42 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని సంపాదించింది. బుధవారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్‌లోనూ జ్యోతి బంగారు పతకం గెలిచింది. ఏడు క్రీడాంశాల సమాహారమైన హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సౌమ్య మురుగన్ పసిడి పతకాన్ని దక్కించుకుంది.

జాగ్‌నిడ్జెను నిలువరించిన హారిక

మహిళల గ్రాండ్‌ప్రి అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక వరుసగా రెండో 'డ్రా' నమోదు చేసింది. సైప్రస్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో యూరోపియన్ మాజీ చాంపియన్ నానా జాగ్‌నిడ్జె (జార్జియా)తో గురువారం జరిగిన మూడో రౌండ్ గేమ్‌ను హారిక 19 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ప్రస్తుతం హారిక ఖాతాలో 1.5 పాయింట్లు ఉన్నాయి. నేడు జరిగే నాలుగో రౌండ్‌లో అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో హారిక ఆడుతుంది.



కోహ్లి ధమాకా...

63 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో 100

- చితగ్గొట్టిన డుప్లెసిస్
- హైదరాబాద్‌పై 8 వికెట్లతో బెంగళూరు ఘనవిజయం
- క్లాసెన్ వీరోచిత సెంచరీ వృథా

సాక్షి, హైదరాబాద్: కోహ్లి కొడితే కొండ కూడా పిండి కావాలి. ఉప్పల్‌లో గురువారం సరిగ్గా అదే జరిగింది. ఛేజింగ్‌లో కోహ్లి ఉప్పెనల్లే చెలరేగడంతో బెంగళూరు 8 వికెట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను సులువుగా ఓడించింది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను క్లాసెన్ (51 బంతుల్లో 104; 8 ఫోర్లు, 6 సిక్సర్లు) అంతా తానై మెరిపించాడు. హైదరాబాద్ అంతపెద్ద స్కోరు చేస్తే సొంత గడ్డపై సిరాజ్ (4–0–17–1) పొదుపుగా బౌలింగ్ చేశాడు. అనంతరం బెంగళూరు 19.2 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి 187 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (63 బంతుల్లో 100; 12 ఫోర్లు, 4 సిక్సర్లు) ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఆరో సెంచరీ నమోదు చేయగా... డుప్లెసిస్ (47 బంతుల్లో 71; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా ఆడుకున్నాడు. ఈ శతకంతో ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా క్రిస్ గేల్ (6 సెంచరీలు) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సమం చేశాడు. అంతేకాకుండా ఒకే జట్టు తరఫున అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా కోహ్లి నిలిచాడు.

అతనొక్కడే...

హైదరాబాద్ ఓపెనర్లు అభిషేక్ (11), రాహుల్ త్రిపాఠి (15) నిరాశపరిచారు. వీరిద్దరిని బ్రేస్‌వెల్ ఒకే ఓవర్లో పడగొట్టేశాడు. వాళ్లు చేసింది తక్కువే అయినా ఆ ప్రభావం ఇన్నింగ్స్‌పై పడకుండా క్లాసెన్ దూకుడుగా నడిపించాడు. కెప్టెన్ మార్క్‌రమ్ (20 బంతుల్లో 18) అండతో సన్‌రైజర్స్ స్కోరును అదే పనిగా పెంచాడు. ఈ క్రమంలో బౌండరీలు సిక్సర్లు అవలీలగా బాదేశాడు. క్లాసెన్ వీరబాదుడుతో బలమైన భాగస్వామ్యం వేగంగా నమోదైంది. మార్క్‌రమ్‌ను బౌల్డ్ చేసి షహబాజ్ 76 పరుగుల భాగస్వామ్యానికి ముగింపు పలికినా... క్లాసెన్ బ్యాటింగ్ జోరు, పరుగుల హోరెం తగ్గనేలేదు. 49 బంతుల్లోనే శతక్కొట్టేశాడు. ఎట్టకేలకు 19వ ఓవర్లో అతని విధ్వంసానికి హర్షల్ తెరదించాడు.


క్లాసెన్


కోహ్లి

చకచకా లక్ష్యం వైపు...

లక్ష్యం కష్టమైందే... మ్యాచ్ ఆర్‌సీబీకి కీలకమైంది. అందుకే ఓపెనర్లు కోహ్లి, డుప్లెసిస్ ఛేదనకు తగ్గట్లే అడుగులు వేశారు. చకచకా పరుగులు చేశారు. బౌండరీలతో స్కోరుబోర్డును పరుగెత్తించి... సిక్సర్లతో స్టేడియాన్ని హుషారెత్తించారు. ప్రేక్షకులంతా సొంతజట్టు కంటే బెంగళూరు జట్టుకే జై కొట్టడంతో రెట్టించిన ఉత్సాహంతో ఓపెనింగ్ జోడీ చెలరేగిపోయింది. ఇద్దరు కూడా కలసికట్టుగా చితగ్గొట్టేయడంతో పవర్‌ప్లేలో ఆర్సీబీ 64/0 స్కోరు చేసింది. 11.1 ఓవర్లలో వంద పరుగుల్ని ఏ కష్టం లేకుండా దాటింది. లక్ష్యతీరానికి చేరాక ఓపెనర్లిద్దరు అవుటైనప్పటికీ మ్యాక్స్‌వెల్ (5 నాటౌట్), బ్రేస్‌వెల్ (4 నాటౌట్) డ్రామా లేకుండా ముగించారు.



ఉప్పల్‌లో ఊపేశాడు...

ముందుగా డుప్లెసిస్ (34 బంతుల్లో) ఫిఫ్టీ చేస్తే తర్వాతి ఓవర్లోనే కోహ్లి 35 బంతుల్లో పూర్తి చేసుకున్నాడు. అర్ధసెంచరీ అయ్యాక కోహ్లి ఆట మరో లెవెల్‌కు చేరింది. ఛేదనలో మొనగాడిగా పేరున్న కోహ్లి తన పాత 'విరాట్‌రూపం' చూపించాడు. డ్రైవ్, కట్, హుక్ ఇలా కచ్చితత్వంతో కూడిన షాట్లు అతని బ్యాట్ నుంచి జాలువారడంతో కొండంత లక్ష్యం ఐస్‌ముక్కలా కరిగిపోయింది. మరో 27 బంతుల్లోనే కింగ్ కోహ్లి 50 నుంచి 100 పరుగులకు చేరుకున్నాడు. భువీ వేసిన 18వ ఓవర్ నాలుగో బంతికి కోహ్లి డీప్ మిడ్‌వికెట్ మీదుగా కొట్టిన సిక్సర్‌తో స్టేడియం ఊగిపోయింది. డగౌట్‌లోని సహచరులే కాదు... గ్యాలరీలోని ప్రేక్షకులంతా కరతాళధ్వనులతో సవ్వడి చేశారు. అతని అసాధారణ ఇన్నింగ్స్‌కు ముగ్ధులైన ప్రత్యర్థులు సైతం హ్యాట్సాఫ్ చెప్పారు. మరుసటి బంతికి అతను అవుటై నిష్క్రమిస్తుంటే స్టేడియం హోరెత్తింది.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) మహిపాల్ (బి) బ్రేస్‌వెల్ 11; త్రిపాఠి (సి) హర్షల్ (బి) బ్రేస్‌వెల్ 15; మార్క్‌రమ్ (బి) షహబాజ్ 18; క్లాసెన్ (బి) హర్షల్ 104; బ్రూక్ (నాటౌట్) 27; ఫిలిప్స్ (సి) పార్నెల్ (బి) సిరాజ్ 5; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 186. వికెట్ల పతనం:** 1–27, 2–28, 3–104, 4–178. 5–186. **బౌలింగ్:** సిరాజ్ 4–0–17–1, పార్నెల్ 4–0–35–0, బ్రేస్‌వెల్ 2–0–13–2, షహబాజ్ 3–0–38–1, హర్షల్ 4–0–37–1, కరణ్ శర్మ 3–0–45–0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) ఫిలిప్స్ (బి) భువనేశ్వర్ 100; డుప్లెసిస్ (సి) త్రిపాఠి (బి) నటరాజన్ 71; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 5; బ్రేస్‌వెల్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (19.2 ఓవర్లలో 2 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1–172, 2–177. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–48–1, అభిషేక్ శర్మ 3–0–28–0, నటరాజన్ 4–0–34–1, త్యాగి 1.2–0–21–0, నితీశ్ కుమార్ రెడ్డి 2–0–19–0, మయాంక్ డాగర్ 4–0–25–0, ఫిలిప్స్ 1–0–10–0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
లక్నో	13	7	5	1	15	0.304
బెంగళూరు	13	7	6	0	14	0.180
ముంబై	13	7	6	0	14	-0.128
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	13	6	7	0	12	-0.308
ఢిల్లీ	13	5	8	0	10	-0.572
హైదరాబాద్	13	4	9	0	8	-0.558

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × రాజస్తాన్ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



ఓటమి వ్యత్యాసం కూడా కీలకమే

సునీల్ గావస్కర్

మూడు ప్లే ఆఫ్ బెర్త్‌ల కోసం ఐదు జట్లు ఇంకా బరిలో ఉన్నాయి. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఇప్పటికే ప్లే ఆఫ్ బెర్త్‌ను ఖరారు చేసుకోవడంతోపాటు టాప్ ర్యాంక్‌తో లీగ్ దశను ముగించనుంది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌ల్లో గెలిస్తే చెన్నై, లక్నో జట్లకు రెండో స్థానంతో లీగ్‌ను ముగించే అవకాశం ఉంది. ఇందులో రన్‌రేట్ కూడా ముఖ్యపాత్ర పోషించనుంది. అందుకే లీగ్ మ్యాచ్‌ల్లో విజయ వ్యత్యాసం కీలకంగా మారింది. బెంగళూరుతో మ్యాచ్‌లో ఈ విషయం రాజస్తాన్ మర్చిపోయినట్టుంది. ఒకవేళ రాజస్తాన్ లీగ్ దశలో సంయుక్తంగా నాలుగో స్థానంలో నిలిస్తే రన్‌రేట్ వ్యత్యాసం వారి ప్లే ఆఫ్ అవకాశాలను ప్రభావితం చేస్తుంది. టి20 ఫార్మాట్‌లో ఎప్పుడు ఏమి జరుగుతుందో కచ్చితంగా చెప్పలేం. అయితే మ్యాచ్ చేజారిపోతున్న దశలో ఓటమి వ్యత్యాసం సాధ్యమైనంత తగ్గించేందుకు ఆయా జట్ల బ్యాటర్లు కృషి చేయాలి. కానీ బెంగళూరుతో మ్యాచ్‌లో రాజస్తాన్ బ్యాటర్లు అలా చేయలేదు. క్రీజులో వచ్చిన ప్రతి బ్యాటరు భారీ షాట్‌లకు యత్నించి వికెట్లు పారేసుకున్నారు. రాజస్తాన్‌పై భారీ విజయంతో బెంగళూరుకు ఒక్కసారిగా ప్లే ఆఫ్‌నకు అర్హత పొందే అవకాశాలు పెరిగాయి. ఈ అవకాశాన్ని బెంగళూరు ఎలా సద్వినియోగం చేసుకుంటుందో చూడాలి. ఢిల్లీతో మ్యాచ్‌లో పంజాబ్ జట్టుకు ఆడిన అనుభవజ్ఞులైన విదేశీ బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. గత సీజన్‌లో ఆకట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్ ఈసారి మాత్రం తేలిపోయాడు. అతడిని ఎలా ఎదుర్కోవాలో అన్ని జట్ల బ్యాటర్లకు తెలిసిపోయింది. తాను ఎందుకు విఫలమవుతున్నానో అర్ష్‌దీప్ సింగ్ తెలుసుకొని మళ్లీ గాడిలో పడాల్సిన అవసరముంది. భవిష్యత్‌లో భారత్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ ఆడే సత్తా అర్ష్‌దీప్‌లో ఉంది. ఢిల్లీతో మ్యాచ్‌లో లివింగ్‌స్టోన్ అద్భుతంగా ఆడినా విజయం మాత్రం దక్కలేదు. అయితే మిగతా ఆటగాళ్లు కూడా పోరాటపటిమను కనబర్చాల్సిన అవసరముంది. మొత్తానికి నాలుగో ప్లే ఆఫ్ బెర్త్ కోసం ఐపీఎల్ లీగ్ దశకు అద్భుతమైన ముగింపు లభించనుంది.



పరాజయంతో మొదలు...

అడిలైడ్: ఆస్ట్రేలియా మహిళల హాకీ జట్టుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత మహిళల హాకీ జట్టు ఓటమితో ప్రారంభించింది. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 2–4 గోల్స్‌తో పరాజయం పాలైంది. భారత్ తరఫున సంగీత (29వ ని.లో), షర్మిలా దేవి (40వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ మ్యాచ్‌తో భారత ప్లేయర్ మోనిక తన కెరీర్‌లో 200 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. సిరీస్‌లోని రెండో మ్యాచ్ శనివారం జరుగుతుంది.

సెమీస్‌లో అవ్‌నీత్ కౌర్



షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీ కాంపౌండ్ మహిళల వ్యక్తిగత విభాగంలో అవ్‌నీత్ కౌర్... పురుషుల వ్యక్తిగత విభాగంలో ప్రథమేశ్ జావ్కర్ సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్లో అవ్‌నీత్ 147–144తో డాఫ్నీ క్వింటెరో (మెక్సికో)పై, ప్రథమేశ్ 149–148తో చోయ్ యోంగి (దక్షిణ కొరియా)పై నెగ్గారు. భారత స్టార్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి సురేఖ మూడో రౌండ్‌లోనే వెనుదిరిగింది.

ఫ్రెంచ్ ఓపెన్‌కు తొలిసారి నాదల్ దూరం



పారిస్: తుంటి గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో తన కెరీర్‌లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నుంచి రాఫెల్ నాదల్ వైదొలిగాడు. ఈనెల 28 నుంచి పారిస్‌లో మొదలయ్యే ఈ మెగా ఈవెంట్‌లో తాను పాల్గొనడం లేదని 36 ఏళ్ల నాదల్ గురువారం అధికారికంగా ప్రకటించాడు. 2005లో తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో బరిలోకి దిగిన నాదల్ 2022 వరకు క్రమం తప్పకుండా ఈ టోర్నీలో పోటీపడ్డాడు. ఎవరికీ సాధ్యంకానిరీతిలో 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సాధించాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి కొన్ని నెలలు పట్టే అవకాశం ఉందని... వింబుల్డన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ తాను బరిలోకి దిగకపోవచ్చని... వచ్చే ఏడాది తర్వాత ఆటకు వీడ్కోలు పలికే ఆలోచనతో ఉన్నట్లు నాదల్ తెలిపాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ సందర్భంగా నాదల్‌కు తుంటి గాయం తిరగబెట్టింది.

సినిమా

స్విస్‌లో సాంగ్


చిరంజీవి

అసలే ఎండాకాలం.. పైగా కొన్ని చోట్ల ఎండలు మండిపోతున్నాయి. ఇలాంటి టైమ్‌లో కూల్ కూల్‌గా ఉండే ప్రాంతానికి వెళ్లే చాన్స్ వస్తే.. హాయి హాయిగా ఉంటుంది. ప్రస్తుతం 'భోళా శంకర్' టీమ్ ఆ హాయినే అనుభవిస్తోంది. ఇటీవల స్విట్జర్లాండ్‌లో ల్యాండ్ అయ్యాడు 'భోళా శంకర్'. అక్కడి కూల్ కూల్ క్లైమేట్‌లో ప్రేయసితో ఫుల్ స్వింగ్‌లో స్ప్రింగ్‌లాంటి స్టెప్పులేస్తున్నాడట. చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. చిరంజీవి సరసన తమన్నా నటిస్తున్న ఈ చిత్రంలో ఆయన చెల్లెలి పాత్రలో హీరోయిన్ కీర్తీ సురేష్ నటిస్తున్నారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. ఇటీవల ఈ సినిమా షూటింగ్ స్విట్జర్లాండ్‌లో ప్రారంభమైంది. చిరంజీవి, తమన్నాలపై సాంగ్ చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణను కూడా ప్లాన్ చేశారు. సుశాంత్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు మహతి స్వరసాగర్ స్వరకర్త. 'భోళా శంకర్' సినిమా ఆగస్టు 11న విడుదల కానుంది.

నెగటివ్ రోల్‌లో..?

ఎన్టీఆర్‌లో నెగటివ్ యాంగిల్ ఎలా ఉంటుందో చూపించిన చిత్రం 'జై లవ కుశ'. ఆ చిత్రంలో 'జై' పాత్రలో విలన్‌గా విజృంభించారు ఎన్టీఆర్. పాజిటివ్ షేడ్స్ ఉన్న లవ, కుశలో హీరోయిజం చూపించారు. తాజాగా మరోసారి ఎన్టీఆర్ నెగటివ్ షేడ్ ఉన్న రోల్‌లో కనిపించనున్నారని టాక్. అది కూడా హిందీ తెరపై. బాలీవుడ్ యశ్ రాజ్ ఫిలింస్‌పై ఫ్రాంచైజీలోని 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రధారులుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కనుంది. ఇందులో ఎన్టీఆర్ పాత్రకు కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయని, అలాగే ఆయన పాత్ర నెగటివ్‌గా ఎందుకు మారుతుంది? అనేదానికి ఓ బలమైన కారణం ఉండేలా అయాన్ ముఖర్జీ స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నారని బాలీవుడ్ టాక్. ఈ చిత్రంలో కథానాయికల పాత్రల కోసం దీపికా పదుకోన్, శర్వరీ వాఘ్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. అత్యంత భారీ బడ్జెట్‌తో ఆదిత్యా చోప్రా ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ ఏడాది చివర్లో రెగ్యులర్ షూటింగ్‌ను ఆరంభించాలని అనుకుంటున్నారట. ఇక ప్రస్తుతం దర్శకుడు కొరటాల శివతో సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదల కానుంది.


ఎన్టీఆర్


ఆల్ సెట్

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుంది. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమా షూటింగ్‌ను ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో ఆరంభించే ఆలోచనలో ఉన్నట్లుగా ఈ చిత్ర కథారచయిత విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇందుకు తగ్గట్లుగా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను సెట్ చేస్తున్నారట రాజమౌళి అండ్ కో. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దీపికా పదుకోన్, ఆలియా భట్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. ఇక ఇటీవలే వెకేషన్‌కు వెళ్లిన మహేశ్ స్పెయిన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. కాగా ప్రస్తుతం త్రివిక్రమ్‌తో సినిమా చేస్తున్నారు మహేశ్‌బాబు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ జూన్ మొదటి వారంలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా సంక్రాంతికి జనవరి 13న విడుదల కానుంది.


మహేశ్ బాబు

లెజెండ్స్ కలిశారు

సిల్వర్‌స్క్రీన్ సూపర్‌స్టార్ రజనీకాంత్, క్రికెట్ స్టార్ కపిల్ దేవ్ 'లాల్‌సలామ్' సినిమా కోసం స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. రజనీకాంత్, విష్ణువిశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పోర్ట్స్ డ్రామా 'లాల్ సలామ్'. రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో సుభాస్కరన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల ముంబైలో మొదలైంది. ఈ చిత్రంలో కపిల్‌దేవ్ నటిస్తున్నారు. ''ప్రముఖులు, మానవతావాది, భారతదేశానికి క్రికెట్‌లో తొలి వరల్డ్ కప్‌ను తీసుకువచ్చిన కపిల్‌దేవ్‌గారితో వర్క్ చేయడం గౌరవంగా ఉంది'' అని రజనీకాంత్ ట్వీట్ చేశారు. ''ఈ ఇద్దరు లెజండ్స్ (రజనీ, కపిల్‌దేవ్) 'లాల్ సలామ్' కోసం స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు'' అన్నారు విష్ణు విశాల్. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో 'లాల్ సలామ్' రూపొందుతోంది. అందుకే కపిల్ దేవ్‌ని కీలక పాత్రకు సంప్రదించి ఉంటుంది చిత్ర యూనిట్.


కపిల్ దేవ్, రజనీకాంత్

ఛూ మంతర్ !

చరణ్ లక్కరాజు, యశశ్రీ జంటగా 'ఛూ మంతర్' అనే సినిమా షురూ అయింది. ఈ చిత్రంతో బి.కల్యాణ్ కుమార్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. వెంకట్ కిరణ్‌కుమార్ కాళ్లకూరి నిర్మిస్తున్న ఈ మూవీ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి చిత్ర నిర్మాత కిరణ్ తల్లి శ్రీలక్ష్మీ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు సంజీవ్‌రెడ్డి క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు శ్రీనివాస్ తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. కిరణ్‌కుమార్ కాళ్లకూరి మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నిర్మించిన తొలి చిత్రం 'గ్రే' ఈ నెల 26న విడుదలకానుంది. అలాగే రెండో చిత్రంగా 'హాష్‌టాగ్ కృష్ణా రామ' నిర్మించాను. ఇప్పుడు 'ఛూ మంతర్' ఓ సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందుతోంది'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: సందీప్, పల్లవి, రవి, సంగీతం: సుధా శ్రీనివాస్, కెమెరా: మధుసూదన్ కోట.


చరణ్, యశశ్రీ

యాక్షన్.. థ్రిల్

మణి సాయితేజ, పవన్ వర్మ, వైడూర్య, రేఖ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రాక్షపురం 3 కి.మీ.'. ఆర్‌కే గాంధీ దర్శకత్వం వహించారు. దీక్షిక సమర్పణలో కొండ్రాసి ఉపేందర్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా టీజర్‌ని నటుడు వెంకట్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. మంచి యాక్షన్‌తో కూడిన థ్రిల్లర్ చిత్రమనిపించింది. ఈ సినిమాని థియేటర్లలో చూసి హిట్ చేయండి'' అన్నారు. ''జూన్ 23న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని అనుకుంటున్నాం'' అన్నారు ఆర్‌కే గాంధీ. ''గాంధీగారు కష్టపడి మంచి అవుట్‌పుట్ తీసుకొచ్చారు'' అన్నారు కొండ్రాసి ఉపేందర్. ఈ చిత్రానికి కెమెరా: ఎం. నాగేంద్ర కుమార్, సంగీతం: ఘంటాడి కృష్ణ, ఎమ్ఎల్ రాజా, జయసూర్య బొంపెం.


వెంకట్, మణి సాయితేజ


అమీజాక్సన్

దేశీ హంగామా


'కాన్స్' ఉత్సవాల్లో మధుర్ భండార్కర్, ఖుష్బూ, విజయ్‌వర్మ, ఈషా గుప్తా

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 76వ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో భారత సినీ తారలు మెరుస్తున్నారు. ఈ నెల 16న ప్రారంభమైన ఈ వేడుకలు 27 వరకు జరుగుతాయి. ఇప్పటికే కాన్స్ రెడ్ కార్పెట్‌పై సారా అలీ ఖాన్, ఈషా గుప్తా, ఊర్వశీ రౌతేలా క్యాట్ వాక్‌తో ఆకట్టుకున్నారు. తాజాగా ఆస్కార్ అవార్డు విన్నింగ్ ప్రొడ్యూసర్ గునీత్ మోంగా, ఖుష్బూ, అమీ జాక్సన్, దర్శక–రచయిత, నిర్మాత, నటుడు విఘ్నేష్ శివన్, దర్శక–నటుడు ప్రదీప్ రంగనాథన్‌లు పాల్గొన్నారు. ఇక మృణాల్ ఠాకూర్, ఐశ్వర్యా రాయ్ మరికొన్ని గంటల్లో ఈ రెడ్ కార్పెట్‌పై మెరవనున్నట్లు టాక్. మొత్తానికి కాన్స్‌లో దేశీ హంగామా బాగానే కనబడుతోంది.


మురుగన్, గునీత్ మోంగా

ప్రతీకారం మామూలుగా ఉండదు

'పోలీసాఫీసర్ భన్వర్ సింగ్ షెకావత్ (ఫహద్ ఫాజిల్) ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధం అయ్యారు.. ఈసారి ఆయన ప్రతీకారం మామూలుగా ఉండదు' అంటూ 'పుష్ప–2 ది రూల్' యూనిట్ పేర్కొంది. అల్లు అర్జున్, రష్మికా మందన్న జంటగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప: ది రైజ్' తొలి భాగం 2021 డిసెంబరు 17న విడుదలై పాన్ ఇండియా స్థాయిలో సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప–2 ది రూల్' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. కాగా 'పుష్ప: ది రైజ్'లో మలయాళ నటుడు ఫాహద్ ఫాజిల్ పోషించిన పోలీసాఫీసర్ భన్వర్ సింగ్ షెకావత్ పాత్ర ప్రేక్షకుల్ని అలరించింది. 'పుష్ప–2 ది రూల్'లోనూ ఆయన పాత్ర కీలకంగా ఉండబోతున్న సంగతి విదితమే. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో ఫాహద్ ఫాజిల్‌పై కొన్ని కీలక సన్నివేశాలను తెరకెక్కించారు సుకుమార్. ఆ షెడ్యూల్ పూర్తవడంతో సుకుమార్, ఫాహద్ ఫాజిల్ సెట్‌లో ఉన్న వర్కింగ్ స్టిల్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్.


సుకుమార్, ఫాహద్ ఫాజిల్

సాక్షి బిజినెస్
శుక్రవారం
19-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)				బులియన్ రూ.లలో ముంబై	
సెన్సెక్స్ ▽ 129 61,432	నిఫ్టీ ▽ 52 18,130	నాస్‌డాక్	12,612	△	111	బంగారం (99.9 స్వచ్ఛత)	60,474
		డోజోన్స్	33,276	▽	145	బంగారం (99.5 స్వచ్ఛత)	60,232
		ఎఫ్‌టీఎస్ఈ 100	7,742	△	19	వెండి (కిలో)	71,496
		డాక్స్	16,163	△	212		
		షాంఘై	3,297	△	13		
		నికాయ్	30,574	△	480		

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి
• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఇండిగోకు లాభాలు

క్యూ4లో రూ.919 కోట్లు



న్యూఢిల్లీ: ఇండిగో బ్రాండ్‌పై విమానయాన సేవలు అందించే ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్చి త్రైమాసికంలో లాభాల్లోకి అడుగు పెట్టింది. రూ.919 కోట్ల లాభాన్ని ప్రకటించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఆర్జించిన రూ.253 కోట్లను మినహాయించి చూస్తే నికర లాభం రూ.664 కోట్లుగా ఉన్నట్టు అర్థం చేసుకోవచ్చు. అంతక్రితం ఏడాది ఇదే మూడు నెలల కాలంలో ఇండిగో రూ.1682 కోట్ల నష్టాన్ని చూడడం గమనార్హం. మొత్తం ఆదాయం మార్చి త్రైమాసికంలో 78 శాతం పెరిగి రూ.14,600 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.8,207 కోట్లుగా ఉంది. ప్రయాణికుల టికెట్ల రూపంలో ఆదాయం 80 శాతం పెరిగి రూ.12,434 కోట్లుగా ఉంటే, యాన్సిలరీ ఆదాయం (బ్యాగేజీ, ఫుడ్ తదితర) 37 శాతం వృద్ధితో రూ.1,445 కోట్లుగా ఉన్నట్టు ఇండిగో ప్రకటించింది. 2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి విదేశీ మారకం ప్రభావాన్ని మినహాయించి చూస్తే రూ.2,654 కోట్ల లాభం సమకూరింది. కానీ, విదేశీ మారకం ప్రభావాన్ని కలిపి చూస్తే రూ.306 కోట్ల నష్టం సమకూరింది. రూ.44,854 కోట్ల నికర రుణ భారం ఉన్నట్టు కంపెనీ ప్రకటించింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో షేరు రెండు శాతం నష్టపోయి రూ.2,264 వద్ద క్లోజయింది.

జోయాలుక్కాస్ జ్యువెలరీ ఫెస్టివల్‌కు విశేష స్పందన

హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్‌- జోయాలుక్కాస్ జ్యువెలరీ ఫెస్టివల్‌కు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. సంస్థ ప్రకటించిన ఈ సంవత్సరపు అతిపెద్ద జ్యువెలరీ ఫెస్టివల్‌లో మే 12 నుంచి గోల్డ్, డైమండ్స్, ప్రెషస్ స్టోన్స్, వెండి జ్యువెలరీపై పలు ఆఫర్లు అమలవుతు



న్నాయి. జూన్ 11 వరకూ ఈ ప్రత్యేక 'ఆభరణాల పండుగ' నిర్వహణ జరుగుతుంది. మజూరీ చార్జీలపై 50 శాతం వరకూ తగ్గింపు, ప్రతి కొనుగోలుపై కస్టమర్‌కు ఉచిత జీవితకాల నిర్వహణ, సంవత్సరంపాటు ఉచిత బీమా, బైబ్యాక్ హామీ వంటి ఎన్నో ఆఫర్లు ఇందులో భాగంగా ఉన్నాయి.

ఎస్‌బీఐ లాభం జూమ్

- 83 శాతం వృద్ధితో రూ.16,695 కోట్లు
- షేరుకు రూ.11.30 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ మార్చి త్రైమాసికానికి మెరుగైన పనితీరు చూపించింది. ఎన్‌పీఏలకు కేటాయింపులు తగ్గడంతో విశ్లేషకుల అంచనాలకు మించి ఫలితాలను ప్రకటించింది. స్టాండలోన్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 83 శాతం వృద్ధితో రూ.16,695 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి లాభం రూ.9,113 కోట్లుగా ఉంది. నికర వడ్డీ ఆదాయం 29 శాతం పెరిగి రూ.40,393 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి నికర వడ్డీ ఆదాయం రూ.31,198 కోట్లుగా ఉండడం గమనార్హం. ఒక్కో షేరుకు రూ.11.30 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని ఎస్‌బీఐ నిర్ణయించింది. మొండి రుణాలకు (ఎన్‌పీఏలు) కేటాయింపులు, కంటింజెన్సీలు 54 శాతం తగ్గి రూ.3,316 కోట్లకు పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో కేటాయింపులు రూ.7,237 కోట్లుగా ఉన్నాయి. ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 2.78 శాతానికి తగ్గాయి. ఇవి క్రితం ఏడాది ఇదే త్రైమాసికం నాటికి



3.97 శాతంగా ఉంటే, 2022 డిసెంబర్ చివరికి 3.14 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు 0.67 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం ఏడాది మార్చి చివరికి ఇవి 1.08 శాతం, 2022 డిసెంబర్ చివరికి 0.77 శాతంగా ఉండడం గమనార్హం. దేశీయ వ్యాపారంపై నికర వడ్డీ మార్జిన్ 3.84 శాతానికి పుంజుకుంది.

- మార్చి త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ నికర లాభం (అనుబంధ సంస్థలతో కలిపి) క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.9,994 కోట్ల నుంచి రూ.18,343 కోట్లకు వృద్ధి చెందింది. 90 శాతానికి పైగా పెరిగింది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.1,08,034 కోట్ల నుంచి, రూ.1,36,852 కోట్లకు పెరిగింది.
- మార్చి త్రైమాసికానికి నిర్వహణ లాభం 25 శాతం వృద్ధితో రూ.24,621 కోట్లకు చేరుకుంది.
- ప్రొవిజన్ కవరేజ్ రేషియో 1.35 శాతం మెరుగుపడి 76.39 శాతంగా ఉంది.
- రుణాల్లో 16 శాతం వృద్ధి నమోదైంది. మార్చి చివరికి రూ.32.69 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ రుణాలు వార్షికంగా 12 శాతం పెరిగాయి. రిటైల్ రుణాలు 18 శాతం పెరిగాయి.
- డిపాజిట్లు 9 శాతం వృద్ధితో రూ.44.23 లక్షల కోట్లకు చేరాయి.
- 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ స్టాండలోన్ నికర లాభం రూ.50,232 కోట్లకు చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2021–22)తో పోలిస్తే 58 శాతం పెరిగింది. స్టాండలోన్ ఆదాయం రూ.1,06,912 కోట్లుగా నమోదైంది.
- 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కన్సాలిడేటెడ్ లాభం రూ.35,374 కోట్ల నుంచి రూ.56,558 కోట్లకు చేరింది. ఆదాయం రూ.4,06,973 కోట్ల నుంచి రూ.4,73,378 కోట్లకు చేరింది.
- బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 2 శాతానికి పైగా నష్టపోయి రూ.574 వద్ద క్లోజ్ అయింది. ఇంట్రాడేలో రూ.571.40 కనిష్ట స్థాయిని చూసింది.

ఐటీసీ లాభం భళా

- మార్చి క్వార్టర్‌లో రూ.5,225 కోట్లు
- ఎఫ్ఎంసీజీలో బలమైన వృద్ధి
- ఒక్కో షేరుకు రూ.9.5 డివిడెండ్

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ, హోటళ్లు, పేపర్ తదితర వ్యాపారాల్లోని ఐటీసీ లిమిటెడ్ మార్చి త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో పోల్చి చూసినప్పుడు 23 శాతం వృద్ధితో రూ.5,225 కోట్లుగా నమోదైంది. ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 7 శాతం వృద్ధితో రూ.18,799 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.4,260 కోట్లు, ఆదాయం రూ.17,754 కోట్లు చొప్పున ఉంది. కంపెనీ వ్యయాలను సమర్థవంతంగా అదుపు చేసింది. కేవలం 2 శాతమే పెరిగి రూ.12,901 కోట్లుగా ఉన్నాయి. అన్ని విభాగాల్లోనూ బలమైన వృద్ధిని కొనసాగించినట్టు ఐటీసీ లిమిటెడ్ తెలిపింది. 2022–23 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఐటీసీ కన్సాలిడేటెడ్‌గా రూ.19,428 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం (2021–22)లో లాభం రూ.15,486 కోట్లతో పోలిస్తే 25 శాతం వృద్ధి చెందింది. ఆదాయం క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 17 శాతానికి పైగా



పెరిగి రూ.75,826 కోట్లకు చేరుకుంది. ఐటీసీ నిర్వహణ ఆదాయం రూ.75,000 కోట్లు దాటడం ఇదే మొదటిసారి.

విభాగాల వారీగా..

మార్చి త్రైమాసికంలో ఎఫ్ఎంసీజీ విభాగం (సిగరెట్లు సహా) ఆదాయం 15 శాతం పెరిగి రూ.13,033 కోట్లుగా ఉంది. ఇందులో సిగరెట్ల ఆదాయం వరకే చూస్తే 13 శాతం వృద్ధితో రూ.8,082 కోట్లుగా ఉంది. చట్టవిరుద్ధమైన మార్గాల్లో సిగరెట్ల సరఫరాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీ తీసుకున్న చర్యలు ఫలితమిచ్చినట్టు ఐటీసీ తెలిపింది. సిగరెట్లు కాకుండా ఇతర ఎఫ్ఎంసీజీ ఆదాయం వరకే చూస్తే 19 శాతానికి పైగా పెరిగి రూ.4,951 కోట్లుగా ఉంది. పేపర్‌బోర్డ్స్, ప్యాకేజింగ్ ఆదాయం 2% పెరిగి రూ.2,221 కోట్లుగా ఉంది. షేరుకి తుది డివిడెండ్ కింద రూ.6.75, ప్రత్యేక డివిడెండ్ కింద రూ.2.75 (మొత్తం రూ.9.5) చొప్పున ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

చివరికి నష్టాల్లో..



మార్కెట్లు వరుసగా మూడో రోజు డౌన్


ముంబై: దిగ్గజ సంస్థలు ఐటీసీ, ఎస్‌బీఐ ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లను మెప్పించలేకపోవడం తదితర అంశాల కారణంగా దేశీ మార్కెట్లు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. గురువారం దాదాపు రోజంతా లాభాల్లోనే ట్రేడయినప్పటికీ ఆఖర్లో సెన్సెక్స్ 129 పాయింట్లు కోల్పోయి 61,432 వద్ద, నిఫ్టీ 52 పాయింట్ల నష్టంతో 18,130 వద్ద క్లోజయ్యాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 61,956–61,349 పాయింట్ల గరిష్ట, కనిష్ట స్థాయిలో తిరుగాడింది. అంతర్జాతీయంగా సానుకూల ధోరణులు నెలకొన్నప్పటికీ, ఆరంభ లాభాలను కోల్పోయి నిఫ్టీ వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ విభాగం హెడ్ దీపక్ జసానీ తెలిపారు. వారాంతపు ఎక్స్‌పైరీ రోజున మార్కెట్లు ఒడిదుడుకుల్లో ట్రేడయినట్లు, నిర్దిష్ట స్టాక్స్‌లో లాభాల స్వీకరణతో సూచీలు నష్టాల్లో ముగిసినట్లు రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో టైటాన్, పవర్ గ్రిడ్, ఎల్‌అండ్‌టీ, టాటా మోటార్స్ మొదలైనవి నష్టపోయాయి. ఐటీసీ 2%, ఎస్‌బీఐ 1.77% క్షీణించాయి. బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్ భారతి ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ మొదలైనవి లాభపడ్డాయి. మిడ్‌క్యాప్ సూచీ 0.67%, స్మాల్‌క్యాప్ 0.26% క్షీణించాయి. ఇతర సూచీల్లో రియల్టీ 2.29%, సర్వీసెస్ 1.60%, పవర్ 1.43% తగ్గాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకెక్స్ లాభపడ్డాయి. ఆసియా మార్కెట్లు చూస్తే.. దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లో ట్రేడయ్యాయి.

25 పైసలు తగ్గిన రూపాయి..

విదేశీ మార్కెట్లలో డాలరు బలపడటం, దేశీ ఈక్విటీల్లో బలహీన ట్రెండ్‌తో దేశీ కరెన్సీ రూపాయి మారకం విలువ గురువారం 25 పైసలు క్షీణించింది. డాలరుతో పోలిస్తే 82.62 వద్ద క్లోజయ్యింది.

టైమెక్స్ చేతికి జస్ట్ వాచెస్

న్యూఢిల్లీ: గడియారాల తయారీలో ఉన్న యూఎస్ కంపెనీ టైమెక్స్ గ్రూప్ తాజాగా ప్రీమియం వాచ్ రిటైల్ బ్రాండ్ జస్ట్ వాచెస్‌ను కొనుగోలు చేసింది. డీల్ విలువను కంపెనీ వెల్లడించలేదు. ఈ డీల్ ద్వారా టైమెక్స్ ఇండియా చేతికి జస్ట్ వాచెస్ స్టోర్లు, ఈ–కామర్స్ పోర్టల్ అయిన జస్ట్‌వాచెస్.కామ్ వచ్చి చేరాయి. 'మా భవిష్యత్ వృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా ఈ కొనుగోలు ఉంటుంది. రెండు బ్రాండ్‌ల కలయిక మధ్య ఒక కచ్చితమైన సహకారం తెస్తుంది. వినియోగదారులకు విస్తృత స్థాయిలో వాచెస్‌ను ఎంపిక చేసుకునేందుకు వీలు కల్పిస్తుందని విశ్వసిస్తున్నాము' అని టైమెక్స్ గ్రూప్ తెలిపింది. జస్ట్ వాచెస్‌ను దక్కించుకోవడం ద్వారా దేశవ్యాప్తంగా కస్టమర్ల సంఖ్యను పెంచుకోవడానికి సన్నద్ధం అయ్యామని టైమెక్స్ ఇండియా ఎండీ దీపక్ ఛబ్రా అన్నారు. టైమెక్స్ వరల్డ్ పేరుతో టైమెక్స్ ఇండియా దేశవ్యాప్తంగా 35 ఎక్స్‌క్లూజివ్ ఫ్రాంచైజీ స్టోర్లను నిర్వహిస్తోంది.



భారత్‌లో రూ. 1.05 లక్షల కోట్ల పెట్టుబడులు

2030 నాటికి క్లౌడ్ ఇన్‌ఫ్రాపై అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రణాళికలు

న్యూఢిల్లీ: భారత్‌లో క్లౌడ్ సేవలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) భారీ పెట్టుబడుల ప్రణాళికలను ప్రకటించింది. 2030 నాటికి క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై 12.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 1,05,600 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 2016–2022 మధ్య కాలంలో చేసిన 3.7 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 30,900 కోట్లు) కూడా కలిపితే దీర్ఘకాలంలో 2030 నాటికి తమ పెట్టుబడులు 16.4 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 1,36,500 కోట్లు) చేరినట్లవుతుందని ఏడబ్ల్యూఎస్ పేర్కొంది. డేటా సెంటర్ మౌలిక సదుపాయాలపై కొత్త ప్రతిపాదిత పెట్టుబడులతో భారతీయ వ్యాపార సంస్థల్లో ఏటా సగటున 1,31,700 పూర్తి స్థాయి కొలువులకు సరిసమానమైన ఉద్యోగాల కల్పన జరగగలదని వివరించింది. నిర్మాణం, ఫెసిలిటీ మెయింటెనెన్స్, ఇంజినీరింగ్, టెలీకమ్యూనికేషన్స్ మొదలైన విభాగాల్లో ఇవి ఉం



డగలవని ఏడబ్ల్యూఎస్ పేర్కొంది.

రెండు డేటా సెంటర్లు..

ఏడబ్ల్యూఎస్‌కు భారత్‌లో రెండు డేటా సెంటర్ ఇన్‌ఫ్రా రీజియన్లు ఉన్నాయి. ఏడబ్ల్యూఎస్ ఏషియా పసిఫిక్ రీజియన్‌లను 2016లో ముంబైలో ఒకటి, 2022లో హైదరాబాద్‌లో మరొకటి ప్రారంభించింది. వ్యయాలు తగ్గించుకునేందుకు, నవకల్పనలను వేగవంతంగా అభివృద్ధి చేసేందుకు, మార్కెట్‌ను సత్వరం అందిపుచ్చుకునేందుకు దేశీయంగా వేలకొద్దీ క్లయింట్లు తమ సేవలను ఉపయోగిస్తున్నట్లు ఏడబ్ల్యూఎస్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చండోక్ చెప్పారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మొదలుకుని అశోక్ లేల్యాండ్, యాక్సిస్ బ్యాంక్ వంటి దిగ్గజాలు, ఇతరత్రా స్టార్టప్‌లు మొదలైనవెన్నో వీటిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

యువర్స్

• గేమింగ్

అదిగో...ఆ బంకర్‌లోనే!



ఈ నెలలో విడుదల అనుకున్న ఫస్ట్ పర్సన్ హారర్ గేమ్ 'అమ్నేసియా: ది బంకర్' జూన్ 6న విడుదల కానుంది. అమ్నేసియా సిరీస్‌లో భాగంగా వస్తున్న నాలుగో ఇన్‌స్టాల్‌మెంట్ ఇది. మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో సాగే ఈ గేమ్‌లో ప్లేయర్స్ ఫ్రెంచ్ సైనికుడు హెన్రీ క్లైమెంట్ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయాలి. సేఫ్ ప్లేస్ ఏమిటో తెలుసుకోవాలి. ఒక బంకర్ మిస్టరీని ఛేదించాలి.

జానర్స్: అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్
ఇంజిన్: హెచ్‌పీఎల్ ఇంజిన్, హెచ్‌పీఎల్ ఇంజిన్ 3.5 **ప్లాట్‌ఫామ్స్:** ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సీరీస్ ఎక్స్ అండ్ సీరీస్ ఎస్

అవును... ఇది నిజమే!



క్వీన్ విక్టోరియన్ శకం (బ్రిటన్)లో పువ్వుల భాష 'ఫ్లోరియోగ్రఫీ'గా ప్రసిద్ధి పొందింది. వ్యక్తులు తమ భావాలు, సెంటిమెంట్లను ఇతరులతో పంచుకోవడానికి రకరకాల పువ్వులను ఉపయోగించేవారు. ప్రతి పువ్వుకు సింబాలిక్ మీనింగ్ ఉండేది. ఉదా: రెడ్ రోజ్–స్వచ్ఛమైన ప్రేమ, ఎల్లో రోజ్–స్నేహం, పింక్ రోజ్–ఆరాధన, సన్‌ఫ్లవర్–నమ్మకం, విశ్వాసం. కలర్స్, అరేంజ్‌మెంట్స్ అనేవి 'రహస్య సందేశం'లో కీలకపాత్ర పోషించేవి. ఒక్కో పువ్వుకు మాత్రమే కాకుండా పువ్వుల సముదాయానికి కూడా ప్రత్యేక అర్థాలు ఉండేవి. ఆ కాలంలో ప్రేమవ్యక్తీకరణకు అంతగా స్వేచ్ఛ లేకపోవడంతో ఈ పువ్వుల భాషను ఉపయోగించేవారు.

అడవి రాసిన కవిత్వం

అమ్మ... తియ్యనైన పదం. అమ్మ భాష... మృదుమధురం. అడవిలో పుట్టిన సంస్కృతి... అడవి పురుడు పోసిన సాహిత్యం. నాగరకత దాడికి లోనవుతుంటే... అడవి బిడ్డ గుండె కన్నీరవుతోంది. అమ్మ భాష కోసం కలం పట్టాడు... అందమైన గ్రంథరూపమిస్తున్నాడు. కొలామ్ భాష కోసం ఆత్రం మోతీరామ్ చేస్తున్న సాహిత్య సేవ ఇది.

• మోతీరామ్ సాహితీయజ్ఞం

తెలంగాణ రాష్ట్రం, కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా(ఉమ్మడి ఆదిలాబాద్) వాంకిడి మండలంలోని నగర్‌గుట్టలో పుట్టాడు ఆత్రం మోతీరామ్. కొలామ్ తెగకు చెందిన మోతీరామ్ తమ భాషలో పుట్టిన అచ్చమైన స్వచ్ఛమైన పదాలు అంతరించిపోతున్నాయని తెలుసుకుని ఆవేదన చెందాడు. గ్రంథస్థం చేయడమే పరిష్కారం అని భావించి మౌఖికంగా ఉన్న అడవి పదాలు, పాటలను అక్షరబద్ధం చేస్తున్నాడు. తన అనుభవాలు, అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నాడీ యువకుడు.

అడవి నేర్పిన అక్షరాలు

''మా ఊరి పాఠశాలలో రెండోతరగతి చదివాను. ఆ తరవాత చౌపన్‌గూడ శాటిలైట్ సెంటర్ ఆశ్రమ పాఠశాలలో చేర్చేటప్పుడు మళ్లీ ఒకటో తరగతిలో చేర్చాడు మా నాన్న. నాలుగవ తరగతి తర్వాత ఆసిఫాబాద్ పీటీజీ గురుకుల పాఠశాలలో పదవ తరగతి వరకు చదివాను. ఉట్నూరు గవర్నమెంట్ కాలేజ్‌లో బీఎస్సీ, ఐటీడీఏ శిక్షణ కళాశాలలో బీఈడీ చేశాను. ఇప్పుడు కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య విధానంలో ఎం.ఏ తెలుగు చేస్తున్నాను.


మోతీరామ్ రచనలు

బొమ్మల సాహిత్యం

నా సాహిత్య ప్రస్థానం గురించి చెప్పాలంటే... అది చిత్రలేఖనంతో మొదలైంది. మా నాన్న వ్యవసాయంతోపాటు వడ్రంగం కూడా చేసేవాడు. తలుపుల మీద నెమలి, పూలు, చెట్లు, పండ్లు... ఇలా రకరకాలు చిత్రించేవాడు. వాటిని పరిశీలనగా చూసి నేనూ బొమ్మలు వేసేవాడిని. గురుకుల పాఠశాలలో చిత్రలేఖనం పోటీల్లో కూడా పాల్గొన్నాను. ఎనిమిదవ తరగతికి వచ్చినప్పటి నుంచి నేను వేసిన బొమ్మలకు చిన్న వ్యాఖ్యానం రాయడం మొదలు పెట్టాను. నాకు పెద్ద పెద్ద విషయాలు తెలిసి కాదు, నా మనసుకు అనిపించిన విషయాన్ని అచ్చంగా అలాగే రాసేవాడిని. మా సత్యనారాయణ సార్ నేను రాసిన వ్యాఖ్యానంలో అక్షరదోషాలు, వ్యాకరణ దోషాలను దిద్దేవారు. నేను వ్యక్తం చేసిన భావాలనే వాక్యాలుగా రాస్తే అదే కవిత్వం అవుతుందని, కవిత్వం రాయడంలో మెళకువలు నేర్పించారు.


ఆత్రం మోతీరామ్

తొలి పుస్తకం కుమ్రుం సూరు

కవిత్వం రాయడంలో ఒడుపు తెలిసిన తర్వాత ఇక నేను వెనుదిరిగి చూడలేదు. నా తొలి పుస్తకం కుమ్రుం సూరు జీవిత చరిత్ర. ఆత్రం భీమ్‌రావు అనే మా కొలామ్ నాయకుడు సూరు జీవితాన్ని మౌఖికంగా చెప్పడంతో నేను అక్షరబద్ధం చేశాను. ఆ తర్వాత దండారి కైతికాలు అని దండారి నృత్యం గురించి రాశాను. మా కొలామ్‌ల ఆరాధ్యదైవం దంతన్‌పల్లి భీమయ్యక్ మహాత్మ్యం రాసిన తర్వాత మా నాన్న కోసం మోతీరామ్ శతకం రాశాను. మానవుడు ఎలాంటి వాడు అనేది కథాంశం. ఇవన్నీ తెలుగు లిపిలోనే రాశాను. ఎందుకంటే మా కొలామ్ భాషకు లిపి లేదు. కవిత్వం కూడా కొలామ్ భాషలోనే తెలుగు లిపితో రాశాను. కొన్ని కవితలు తెలుగులోనూ రాశాను.

అముద్రితం

ఉట్నూరుకు వచ్చిన తర్వాత నా అక్షరాల ఆకలి తీరిందని చెప్పాలి. అక్కడ 'ఉట్నూరు సాహితీ వేదిక'లో ప్రతి నెలా తొలి ఆదివారం కవి సమ్మేళనం జరిగేది. ప్రతి కవి సమ్మేళనంలోనూ నా కవిత ఉండాలని నిర్వాహకులు నన్ను బాగా ప్రోత్సహించారు. అలాగే రాశాను. నేను ఇంటర్‌లో ఉన్నప్పుడు తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిలో ఉంది. ఉద్యమం కోసం ఒక పుస్తకం రాశాను. అది ప్రచురణకు నోచుకునే లోపు తెలంగాణ రావడంతో అది చేతిరాత ప్రతిగానే ఉండిపోయింది.

ఆకాశవాణిలో కొలామీ కవిత్వం

కొలామీ భాషలో రాసిన కవిత్వం ఆకాశవాణిలో ప్రసారమైంది. అలాగే 2021లో విజయవాడలో జరిగిన గిరిజన సాహిత్య సదస్సులో పాల్గొని మా భాషలో కవిత చదివాను. ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ రవీంద్రభారతిలో 'దక్షిణ భారత కవుల కలయిక'లోనూ అవకాశం వచ్చింది. కొలామీలో కవిత, దానికి తెలుగు అనువాదం కూడా చేశాను. ఒడిశా రాష్ట్రం, భువనేశ్వర్‌లో జరిగిన 'అఖిల భారత గోండ్వానా సాహిత్య సభలు'కు ఆహ్వానం వచ్చింది. కానీ పరీక్షల కారణంగా వెళ్లలేకపోయాను. ఈ సాహిత్య ప్రస్థానంలో నా ఆకాంక్ష ఒక్కటే... మా కొలామీ భాషను అంతరించి పోనివ్వకుండా కాపాడుకోవడం. ఇప్పటికే చాలా నష్టం జరిగింది. ఈ తరం చిన్న పిల్లలు చాలా పదాలను మర్చిపోయారు. తల, దేహం, ఉడుత, చిలుక వంటి పదాలను తెలుగులో చెప్తున్నారు తప్ప కొలామీలో చెప్పడం మర్చిపోయారు. అందుకే అలాంటివి కనుమరుగు కాకుండా అక్షరాల్లో, ఆడియోల్లోనూ రికార్డ్ చేయాలనేదే నా ఆకాంక్ష.

మౌఖిక సాహిత్యం అక్షరాల్లోకి...


మా కొలామీ భాష మధ్య ద్రావిడ భాష. దీనికి లిపి లేదు. కానీ విస్తృతమైన సాహిత్యం ఉంది. బాల సాహిత్యం, పొడుపు కథలు, భీమయ్యక్ పాటలు, దేవుడి పాటలు, పెళ్లి, ఇతర వేడుకల పాటలన్నీ మౌఖికంగా ఒక తరం నుంచి మరొక తరానికి ప్రసారం అవుతున్నాయి. ఇప్పుడు వస్తున్న మార్పులతో ఈ తరం పిల్లలు మా పాటలను మర్చిపోతే ఇక ఈ తరంలోనే మా సాహిత్యం కూడా అంతర్ధానమైపోతుంది. అందుకే ఈ పని మొదలుపెట్టాను. ప్రతి పదాన్ని పొల్లుపోకుండా గ్రంథస్థం చేస్తాను.
– ఆత్రం మోతీరామ్

– వాకా మంజులారెడ్డి,
ఫొటోలు: ఆత్రం జగదీశ్,
సాక్షి, ఇంద్రవెల్లి

ఆర్ట్ అండ్ కల్చర్

ముందైతే నీళ్లు తాగు నాయనా!

టర్కీ కార్టూనిస్ట్ మూస గుమ్‌స్ గీసిన ఈ కార్టూన్ చూసి చిన్న కథ చెప్పమంటే ఇలా చెప్పవచ్చు... దారినపోయే దానయ్య దారి తప్పాడు. ఎటెటో వెళుతున్నాడు. ఎండకు విపరీతమైన దాహం వేస్తోంది. నిర్జన ప్రాంతంలో చుక్క నీరు కనిపించడం లేదు. దాహంతో కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. అప్పుడే ఏదో మెరుపు



మెరిసింది. చూస్తే....అల్లావుద్దీన్ అద్భుత దీపం!

దాన్ని టచ్ చేయగానే 'ఏం కావాలో కోరుకో నాయనా. ఒకటే ఛాన్సు అని గుర్తుంచుకో' అన్నది జీన్నీ భూతం.'లెక్క లేనన్ని వజ్రవైఢూర్యాలు కావాలి. వాటిని తీసుకెళ్లడానికి గుర్రపుబండ్లు కావాలి' అని అడిగాడు. అతడు కోరుకున్నవి వచ్చాయి. వజ్రవైఢూర్యాలను తీసుకువెళుతున్నప్పుడు దానయ్యలో దాహం పెరిగిపోయింది. 'ఈ దాహంతో చనిపోయేలా ఉన్నాను. చచ్చిన తరువాత ఈ వజ్రవైఢూర్యాలను ఏం చేసుకుంటాను. జీన్నీని గుక్కెడు నీళ్లు అడిగే ఉంటే బతికి ఉండేవాడిని కదా' అనుకుంటున్న సమయంలో జీన్నీ ప్రత్యక్షమై 'ముందైతే నీళ్లు తాగు నాయనా!' అని దయతలిచింది. 'విచక్షణ' అనేదాని గురించి వివరించి చెప్పింది. ఇక మూస గుమ్‌స్ విషయానికి వస్తే... బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్ చదువుకున్న మూస ఎన్నో పత్రికలలో పనిచేశాడు. పిల్లల పుస్తకాలకు బొమ్మలు వేశాడు. 'ఫన్నీ న్యూస్' అనే రేడియో ప్రోగ్రాం కోసం కలం పట్టాడు.

• టెక్... టాక్

రియల్ మీ నార్జో ఎన్53



డిస్‌ప్లే: 6.72 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 8–మెగా పిక్సెల్
ర్యామ్: 4జీబీ 6జీబీ స్టోరేజ్: 64 జీబీ 128జీబీ బ్యాటరీ: 5000 ఎంఏహెచ్ వోఎస్: ఆండ్రాయిడ్ 13
రిజల్యూషన్: 2400×1080 పిక్సెల్స్ రిఫ్రెష్ రేట్: 90 హెచ్‌జడ్ కలర్స్: బ్లాక్ అండ్ గోల్డ్

గూగుల్ 'ఎబౌట్ దిజ్ ఇమేజ్' టూల్



గూగుల్ 'ఎబౌట్ దిజ్ ఇమేజ్' అనే టూల్‌ని తీసుకురానుంది. దీని ద్వారా ఒక ఇమేజ్ లేదా సిమిలర్ ఇమేజ్ గూగుల్‌లో మొదటిసారిగా ఎప్పుడు కనిపించిందో తెలుసుకోవచ్చు. ఇమేజ్ తాలూకు కంటెంట్, కాంటెక్స్‌లను బాగా అర్థం చేసుకోవచ్చు. బ్యాక్‌గ్రౌండ్ ఇన్ఫర్మేషన్ మరింతగా తెలుసుకోవచ్చు. ఒక ఇమేజ్‌కు సంబంధించిన విశ్వసనీయత (సహజమైన ఇమేజా? ఏఐ ఇమేజా?)పై స్పష్టత వస్తుంది.

ఫెయిర్‌బడ్స్ ఎక్స్‌ఎల్ హెడ్‌ఫోన్స్



ఫెయిర్‌ఫోన్ 'ఫెయిర్‌బడ్స్ ఎక్స్‌ఎల్' పేరుతో హెడ్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. ఇది మాడ్యూలర్ మరియు రిపేర్ ఫ్రెండ్లీ హెడ్‌ఫోన్. ఇయర్ కుషన్‌ను సులభంగా రీప్లేస్ చేసుకోవచ్చు. **బ్యాటరీ:** 800 ఎంఏహెచ్ (ఈజీ-టు-రీప్లేస్ బ్యాటరీ) • వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ • 40ఎంఎం డ్రైవర్స్ • **బ్లూటూత్:** 5.1

గెలాక్సీ వాచ్ 5 ప్రో



ట్రెక్కింగ్, మౌంటెన్ క్లైంబింగ్‌లాంటి ఔట్‌డోర్ యాక్టివిటీలకు సౌకర్యంగా ఉండేలా శాంసంగ్ గెలాక్సీ వాచ్‌ను డిజైన్ చేశారు.
డిస్‌ప్లే: 1.4 అంగుళాలు **కలర్స్:** బ్లాక్ అండ్ గ్రే • కోర్నింగ్ గోరిల్లా గ్లాస్ • బ్లూటూత్ కాలింగ్ **ఫీచర్:** చెకింగ్ నోటిఫికేషన్స్, సెట్టింగ్ టైమర్స్...మొదలైనవి. • డ్యూయల్–కోర్ ప్రాసెసర్ • 1.5జీబీ ర్యామ్ ప్లస్ 16జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ **ధర:** • ₹44,999 (రెగ్యులర్ బ్లూటూత్ మోడల్) • ₹49,999 (ఎల్‌టీఈ వేరియంట్)

కెనాన్ పవర్ షాట్



కెనాన్ 'పవర్ షాట్ వీ10' పేరుతో కొత్త వ్లోగింగ్ కెమెరాను లాంచ్ చేసింది. తేలికగా ఉండే ఈ కెమెరాను సులభంగా పాకెట్‌లో పెట్టుకోవచ్చు. క్రౌడ్ ప్లేసెస్‌లో కంఫర్టబుల్‌గా రికార్డ్ చేయడానికి వ్లాగర్స్‌కు ఉపయోగపడుతుంది. సింగిల్ హ్యాండ్‌తో దీన్ని ఆపరేట్ చేయవచ్చు. • 2.0 అంగుళాల ఎల్‌సీడీ టచ్‌స్క్రీన్ • హెచ్‌డీఎంఐ, యుఎస్‌బీ పోర్ట్ • **ధర:** ₹39,995

నేడు నాందేడ్‌కు సీఎం కేసీఆర్

మహారాష్ట్ర బీఆర్‌ఎస్ కార్యకర్తల శిక్షణా శిబిరాన్ని ప్రారంభించనున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్లనున్నారు. ఉదయమే ప్రత్యేక విమానంలో ఆయన నాందేడ్‌కు చేరుకుంటారు. 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు అక్కడ జరగనున్న బీఆర్‌ఎస్ కార్యకర్తల శిక్షణ కార్యక్రమాన్ని ఉదయం 11 గంటలకు కేసీఆర్ ప్రారంభిస్తారు. ఈ శిక్షణ శిబిరాన్ని 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించాలని తొలుత నిర్ణయించినా.. కేసీఆర్ ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉండటంతో వాయిదా వేశారు. ప్రస్తుతం నాందేడ్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ముగ్గురి చొప్పున ప్రతినిధులను ఈ శిక్షణా కార్యక్రమానికి ఎంపిక చేశారు. శిక్షణ ముగిశాక మే 22 నుంచి జూన్ 22 వరకు మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు చేపట్టాలని నిర్ణయించారు.

దిశా నిర్దేశం చేయనున్న కేసీఆర్

శిక్షణ కార్యక్రమంలో.. సభ్యత్వ నమోదు, స్థానిక ఎన్నికల్లో పోటీ, గ్రామస్థాయిలో బీఆర్‌ఎస్ కమిటీల ఏర్పాటు, రైతు, యువజన, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగాలకు కమిటీలు వంటి అంశాలపై కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ వివరాలను బీఆర్‌ఎస్ జాతీయ కార్యదర్శి హిమాన్షు తివారీ, మహారాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు మాణిక్ కదమ్ 'సాక్షి'కి వెల్లడించారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ బలోపేతానికి వరుస కార్యక్రమాలు చేపడుతున్న కేసీఆర్.. ఇప్పటికే నాందేడ్, కాందార్ లోహ, ఔరంగాబాద్‌లలో జరిగిన బహిరంగ సభల్లో పాల్గొనడం తెలిసిందే.

టీఎస్‌పీఎస్సీ లీకేజీ కేసులో మరో ఇద్దరు అరెస్ట్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసులో సిట్ గురువారం మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటికే అరెస్టయిన మురళీధర్ నుంచి ఈ ఇద్దరూ రూ.2 లక్షల చొప్పున చెల్లించి ప్రశ్నపత్రాలు కొనుగోలు చేసినట్టు సిట్ గుర్తించింది. ఖమ్మం జిల్లా చిన్నమదంపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అజ్మీరా పృథ్వీ ఏఈఈ పేపర్‌ను.. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న రాజేశ్వర్ జాదవ్ ఏఈ పేపర్‌ను కొనుగోలు చేసినట్టు తేల్చి.. అరెస్టు చేసింది.

నిందితుల బెయిల్‌కు హైకోర్టు నో

ఈ లీకేజీ కేసులో నిందితులు సాయి లౌకిక్, సాయి సుస్మితలకు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో కొందరికి బెయిల్ ఇచ్చారని, కానీ ఈ ఇద్దరూ 42 రోజులుగా జైలులో ఉన్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. కానీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్ ఇవ్వొద్దని వాదించారు. ఇద్దరు నిందితులు ప్రశ్నపత్రం కాపీని పొంది పరీక్ష రాయడంతోపాటు ఇతరుల నుంచి భారీగా డబ్బులు తీసుకుని ప్రశ్నపత్రాన్ని సర్క్యులేట్ చేశారని కోర్టుకు వివరించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి బెయిల్ నిరాకరించారు.

రూ. 3 వేల కోట్లతో.. 'మెడ్‌ట్రానిక్' విస్తరణ

- రాష్ట్రంలో హెల్త్ కేర్ టెక్నాలజీ రంగానికి ఊతం
- వచ్చే ఐదేళ్లలో 1,500కు పైగా ఉద్యోగాల కల్పన
- మంత్రి కేటీఆర్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ



ఆక్యూజెన్ సంస్థ ప్రతినిధుల బృందంతో ఐటీ మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్‌రంజన్

సాక్షి, హైదరాబాద్: వైద్య పరికరాల ఉత్పత్తి, ఆరోగ్య రక్షణ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెడ్‌ట్రానిక్ సంస్థ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లో రూ.3 వేల కోట్ల పెట్టుబడితో మెడ్‌ట్రానిక్ ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ (ఎంఈఐసీ) కార్యకలాపాలను విస్తరిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో మెడ్‌ట్రానిక్‌కు అమెరికా అవతల ఇది అతిపెద్ద పరిశోధన, అభివృద్ధి కేంద్రం కానుంది. ఆరోగ్య రక్షణ సాంకేతిక పరిశోధన, ఆవిష్కరణల రంగంలో తెలంగాణను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు సంస్థ నిర్ణయం ఊతమివ్వనుంది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో మెడ్‌ట్రానిక్ ప్రతినిధుల బృందం గురువారం భేటీ అయింది. ప్రస్తుత పెట్టుబడితో వచ్చే ఐదేళ్లలో 1,500కు పైగా ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందని సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.

హైదరాబాద్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతకు నిదర్శనం

వైద్య పరికరాల ఉత్పత్తికి భారతదేశంలో అపారమైన మార్కెట్ ఉందని గుర్తించిన తొలి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో తాము ప్రపంచంతోనే పోటీ పడుతున్నామని, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో హైదరాబాద్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతకు మెడ్‌ట్రానిక్ పెట్టుబడి నిదర్శనమని అన్నారు. హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, తీసుకున్న చర్యలను కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో హెల్త్‌కేర్ టెక్నాలజీ రంగం వృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు మెడ్‌ట్రానిక్ విస్తరణ ప్రణాళికలకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.

ఆవిష్కరణలకు కొత్త గమ్యస్థానం

లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగంలో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయికి నాయకత్వం వహించేలా తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రభుత్వ ప్రయత్నంలో భాగస్వాములం అవుతున్నందుకు సంతోషంగా ఉందని మెడ్‌ట్రానిక్ సర్జికల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మైక్ మరీనా అన్నారు. మానవ జీవితాలను మార్చే టెక్నాలజీ ఆవిష్కరణలకు భారతదేశం నయా గమ్యస్థానంగా మారిందని చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమలు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈఓ శక్తి నాగప్పన్, మెడ్‌ట్రానిక్ వైస్ ప్రెసిడెంట్ దివ్య ప్రకాష్ జోషి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో 'ఆక్యూజెన్ కేంద్రం'

అమెరికాలోని పెన్సిల్వేనియా కేంద్రంగా పనిచేస్తున్న బయో టెక్నాలజీ కంపెనీ 'ఆక్యూజెన్' హైదరాబాద్‌లో తన పరిశోధన, అభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జీన్ థెరపీ, రీజనరేటివ్ సెల్ థెరపీ వ్యాక్సిన్ల తయారీకి సహకారం అందించడం వంటి ముఖ్యమైన కార్యకలాపాలను ఈ కేంద్రం నుంచి నిర్వహిస్తుంది. ఆక్యూజెన్ చైర్మన్ శంకర్ ముసునూరి, చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ అరుణ్ ఉపాధ్యాయ తదితరులు గురువారం అమెరికాలో కేటీఆర్‌తో సమావేశమయ్యారు. తెలంగాణలో ఏర్పాటు చేసే పరిశోధన అభివృద్ధి కేంద్రం ద్వారా తమ సంస్థ కార్యకలాపాలను విస్తరిస్తామని శంకర్ ముసునూరి తెలిపారు. దీని ద్వారా రీజనరేటివ్ జెనెటిక్ చికిత్సలకు అవసరమైన మందుల తయారీలో తమకు అవకాశం కలుగుతుందని అరుణ్ ఉపాధ్యాయ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అద్భుతమైన బయోటెక్ పరిశ్రమలు, ఆ రంగానికి అవసరమైన నైపుణ్యాలు ఉన్నందున దేశీయ, అంతర్జాతీయ సంస్థలు నగరంలో పెద్ద ఎత్తున రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని కేటీఆర్ అన్నారు. 2030 నాటికి తెలంగాణ బయోటెక్ పరిశ్రమ 250 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

అవసరమైతే ఆత్మాహుతి దాడులకూ ప్లాన్!



హైదరాబాద్-భోపాల్ మాడ్యూల్స్‌ను రెచ్చగొట్టిన గుర్తు తెలియని వ్యక్తి

- సలీమ్, యాసిర్ ఫోన్ల నుంచి సదరు ప్రసంగాల ఆడియోలు రికవరీ
- వాటిలో ఫిదాయీన్ దాడులకు సంబంధించిన పలు అంశాలు
- పంపింది ఎవరో గుర్తించే పనిలో కేంద్ర నిఘా వర్గాలు
- నేటితో ముగియనున్న 16 మంది ఉగ్రవాదుల పోలీస్ కస్టడీ

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) ఇటీవల హైదరాబాద్-భోపాల్‌లలో అరెస్టు చేసిన 16 మంది ఉగ్రవాదుల కేసులో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు చేయడానికి ఈ మాడ్యూల్స్ సిద్ధమయ్యాయని, వీటికి విదేశాల నుంచి ఆదేశాలు అందుతున్నాయని ప్రాథమిక ఆధారాలు లభించాయి. మహ్మద్ సలీం, యాసిర్ ఖాన్ సహా ముగ్గురి నుంచి రికవరీ చేసిన ఫోన్లను ఏటీఎస్ అధికారులు విశ్లేషించారు. అవసరమైతే ఆత్మాహుతి దాడులకు సిద్ధం కావాలంటూ ఓ వ్యక్తి నుంచి వీరికి ఆదేశాలు అందినట్టు గుర్తించారు.

ఫోన్ల నుంచి ఆడియోలు రికవరీ

ఏటీఎస్ అధికారులు అరెస్టు చేసిన 16 మందిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఉగ్రవాదులు సమాచార మార్పిడికి రాకెట్ చాట్, త్రీమా యాప్స్ వినియోగించారని.. ఎప్పటికప్పుడు డేటాను డిలీట్ చేయడం వల్ల కీలకమైన సమాచారమేదీ లభించలేదని పోలీసు వర్గాలు చెప్తున్నాయి. ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా 50 ఆడియో ఫైళ్లను రికవరీ చేసినట్టు సమాచారం. ఈ ఆడియోల్లో ప్రసంగించిన వ్యక్తి.. ఒకేసారి అనేక మందిని చంపడం (మాస్ కిల్లింగ్), సాబోటేజ్ (విధ్వంసాలు సృష్టించడం), ఎంపిక చేసుకున్న వ్యక్తులను హతమార్చడం (టార్గెట్ కిల్లింగ్)తోపాటు ఆత్మాహుతి (ఫిదాయీన్) దాడులకు సిద్ధంగా ఉండాలని సూచించినట్టు తేల్చారు. ఈ ఆడియోలతోపాటు వీరికి అందిన ఆదేశాలు, సూచనల సందేశాలూ రికవరీ అయ్యాయి. ఇక ఈ ఫోన్లకు పాకిస్తాన్ నంబర్ల నుంచి కాల్స్ వచ్చాయని, కాంటాక్ట్స్ లిస్టులోనూ ఆ దేశ నంబర్లు ఉన్నాయని గుర్తించారు. ఆ ఫోన్ నంబర్లు ఎవరివి, ఆడియోల్లోని వ్యక్తి ఎవరు అనేది గుర్తించేందుకు కేంద్ర నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి.

కొన్ని ఆడియోల్లో కఫీల్ అహ్మద్ ప్రస్తావన

ఫోన్ల నుంచి రిట్రీవ్ చేసిన ఆడియోల్లో లండన్‌లోని గ్లాస్గో విమానాశ్రయంపై 2007లో మానవ బాంబు దాడికి ప్రయత్నించిన బెంగళూరు వాసి, వృత్తిరీత్యా డాక్టర్ అయిన కఫీల్ అహ్మద్ ప్రస్తావన ఉన్నట్లు ఏటీఎస్ గుర్తించింది. ఇతను హిజ్బ్ ఉత్ తెహరీర్ (హెచ్‌యూటీ) సంస్థ తరఫునే మానవబాంబుగా మారాడు. హైదరాబాద్-భోపాల్ మాడ్యూల్ ఉగ్రవాదులూ తొలినాళ్లలో ఇదే ఉగ్రవాద సంస్థ తరఫున పనిచేశారు. ఈ క్రమంలో ఫోన్లలోని ఆడియోలు హెచ్‌యూటీ హ్యాండ్లర్‌విగా భావిస్తున్నారు. ఇక ఏటీఎస్ విచారిస్తున్న 16 మంది పోలీసు కస్టడీ శుక్రవారంతో ముగియనుంది. మరో ఐదు రోజులు కస్టడీ కోరాలని ఏటీఎస్ భావిస్తోంది. ఈ కేసులో మరో ముగ్గురు హైదరాబాద్ వాసులను సాక్షులుగా చేరుస్తున్నారు.

జూలైలో ఆర్మీ బీఎస్‌సీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- 8–14 ఏళ్ల విద్యార్థులకు అవకాశం
- శరీరంపై టాటూ ఉంటే అనర్హులు

కంటోన్మెంట్: ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ(బీఎస్‌సీ)లో క్రీడాకారుల ఎంపిక కోసం తిరుమలగిరిలోని 1ఈఎంఈ సెంటర్ ఆధ్వర్యంలో జూలైలో రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. జూలై 3 నుంచి 15 వరకు నిర్వహించే ఈ ర్యాలీలో వాలీబాల్, కయాకింగ్, కనోయింగ్ విభాగాల్లో ఎనిమిది నుంచి 14 ఏళ్ల మధ్య వయసున్న క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఆర్మీ పీఆర్ఓ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో పాల్గొనే వారు 2009 జూలై 3 నుంచి 2015 జూలై 15 మధ్య జన్మించిన వారై కనీసం మూడో తరగతి పూర్తి చేసిన వారై, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో కనీస పరిజ్ఞానం ఉండాలి. ఆర్మీ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆఫీసర్, ఆర్మీ స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ స్పెషలిస్ట్‌ల ధ్రువీకరణ కలిగి ఉండాలి. ఏదేనీ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు గెలిచిన వారికి ప్రాధాన్యత ఉంటుంది. శరీరంపై ఎక్కడైనా శాశ్వత టాటూ వేయించుకున్న వారు అనర్హులు. ఎంపికైన అభ్యర్థులను స్పోర్ట్స్ క్యాడెట్‌లుగా పరిగణిస్తారు. వీరికి ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు పదోతరగతి వరకు ఉచిత విద్య అవకాశాలు కల్పిస్తారు. శిక్షణా కాలంలో ఉచిత బీమా, వైద్య సదుపాయాలు కూడా కల్పిస్తారు. వివరాలకు వాట్సాప్ ద్వారా 9398543351 నంబర్‌లో లేదా తిరుమలగిరిలోని 1 ఈఎంఈ సెంటర్ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ ట్రెయినింగ్ బెటాలియన్‌లో సంప్రదించవచ్చు.

వ్యాపారం ఏదైనా వనరులు సమకూరుస్తాం

- ఐటీ మంత్రి కేటీఆర్ వెల్లడి
- యూఎస్ పర్యటనలో భాగంగా కీలక భేటీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు అనువైన గమ్యస్థానమని, ఏ తరహా వ్యాపారాన్ని అయినా ప్రారంభించేందుకు అవసరమైన వనరులను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాపార, వాణిజ్య అనుకూల విధానాలు, దృఢమైన ఆవిష్కరణల వాతావరణంతో 14 ప్రాధాన్యత రంగాల్లో పెట్టుబడులు, ఉపాధి కల్పనకు అనేక అవకాశాలున్నాయన్నారు. న్యూయార్క్‌లో భారత కాన్సులేట్ జనరల్, యూఎస్, భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక గురువారం సంయుక్తంగా నిర్వహించిన పెట్టుబడుల రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. అంతర్జాతీయ వాణిజ్య చర్చల్లో తెలంగాణ, హైదరాబాద్ అంతర్భాగంగా మారాయని న్యూయార్క్‌లో భారత్ కాన్సుల్ జనరల్ రణధీర్ జైస్వాల్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా కేటీఆర్ గురువారం పలు అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఇన్సూరెన్స్ టెక్ రంగంలో పేరొందిన వింగ్‌స్యూర్ వ్యవస్థాపకుడు అవి బసుతో జరిగిన భేటీలో వ్యవసాయం, వ్యవసాయ సంబంధిత రంగాల్లో ఆర్థిక సేవలకు సంబంధించి, వ్యాపార అవకాశాల అన్వేషణపై చర్చించారు. పెట్టుబడుల బ్యాంకింగ్ కంపెనీ ఆరోన్ క్యాపిటల్ చైర్మన్ డేవిడ్ వోల్ఫ్‌తో జరిగిన భేటీలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలపై, 'బ్రిస్టల్ మైర్స్ స్క్విబ్' ప్రతినిధి బృందంతో జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో తాము ప్రకటించిన సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ పురోగతిపై చర్చించారు.

ఎడ్‌సెట్‌కు 86% హాజరు



కోడ్‌ను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్

సాక్షి, హైదరాబాద్/నల్లగొండ రూరల్(ఎంజీయూ): బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి గురువారం నిర్వహించిన టీఎస్ ఎడ్‌సెట్-2023 ప్రశాంతంగా ముగిసింది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 49 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. ఉదయం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఎంజీయూ వీసీ, ఎడ్‌సెట్ చైర్మన్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ టి.కృష్ణారావు, ఓఎస్డీ ప్రొఫెసర్ అల్వాల రవి, ఎడ్‌సెట్ కో కన్వీనర్ ప్రొఫెసర్ శంకర్ ఎంజీయూలో సమావేశమై ప్రశ్నపత్రాల కోడ్‌లను విడుదల చేశారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరీక్షకేంద్రాలను పరిశీలించారు. మూడు విడతలుగా జరిగిన పరీక్షకు 27,495 మంది (86 శాతం) హాజరయ్యారు.

ఆదివాసీ బిడ్డకు అరుదైన గౌరవం



పర్వతారోహణ బృందానికి కన్నిబాయి సారథ్యం

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వంద మందితో సాహస కృత్యాలు

కెరమెరి(ఆసిఫాబాద్): రాపెల్లింగ్, ట్రెక్కింగ్ వంటి సాహస కృత్యాలతో పేరు ప్రఖ్యాతులు సంపాదించిన ఆదివాసీ బిడ్డ, అడ్వెంచర్ క్లబ్ బ్రాండ్ అంబాసిడర్ మడావి కన్నిబాయి మరో గౌరవం అందుకున్నారు. కుమురంభీం జిల్లా కెరమెరి మండలం భీమన్‌గొంది గ్రామానికి చెందిన కన్నిబాయి.. ఎన్టీఆర్ శతజయంతి, తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రెండు రాష్ట్రాల్లో నిర్వహించే సాహస కృత్యాల్లో పాల్గొనే పర్వతారోహణ బృందానికి సారథ్యం వహించనున్నారు. ఈ మేరకు ఉభయ రాష్ట్రాల అడ్వెంచర్ క్లబ్ ఫౌండర్ కె.రంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బృందంలో వంద మంది సభ్యులు ఉంటారని ఆయన వెల్లడించారు. ఈ బృందం సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తాడిచర్ల మండలంలోని కాపురం గుట్టలపై ట్రెక్కింగ్ చేయడంతోపాటు, ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో దండుబాడు పర్వతాన్ని అధిరోహిస్తారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని కన్నిబాయి తెలిపారు.

బంగారం బాక్స్ కొట్టేసిన ఎయిర్‌లైన్స్ ఉద్యోగి

శంషాబాద్: బంగారం బాక్స్‌ను ఓ ఎయిర్‌లైన్స్ ఉద్యోగి చోరీ చేశాడు. గురువారం ఉదయం సత్యనారాయణ అనే వ్యక్తి 300 గ్రాముల బంగారం బాక్సును ఢిల్లీకి పంపాడు. ఢిల్లీ వెళ్లిన తర్వాత బాక్స్ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంతోష్ అనే వ్యక్తి తస్కరించినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు.

టెన్త్ మార్కుల వెరిఫికేషన్‌కు గడువు 25

రీ వెరిఫికేషన్‌కు రూ. వెయ్యి

రీ కౌంటింగ్‌కు రూ. 500

సాక్షి, హైదరాబాద్: ఏప్రిల్ నెలలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల మార్కుల రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్య పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు కోరారు. రీ వెరిఫికేషన్ కావాలనుకునే అభ్యర్థులు రూ.వెయ్యి, రీ కౌంటింగ్ కోరుకునే వారు రూ.500 చెల్లించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు.

రేపు 91 కేంద్రాల్లో టీఎస్ఈసెట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఏపీతో పాటు తెలంగాణవ్యాప్తంగా ఈనెల 20న జరగనున్న టీఎస్ఈసెట్-2023కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం ఓయూ కార్యాలయంలో టీఎస్ఈసెట్-2023 నియమ నిబంధనలను కన్వీనర్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో 40 పరీక్ష కేంద్రాలతో పాటు తెలంగాణ జిల్లాలో 44, ఏపీలో 7 కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరగనున్న ఈసెట్ ఆన్‌లైన్ పరీక్షకు 7.30 గంటలకు చేరుకోవాలని సూచించారు.

21న 17 రైళ్లు రద్దు

సాక్షి, హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణ పనుల దృష్ట్యా ఈ నెల 21న ఆ మార్గంలో నడిచే 17 రైళ్లను రద్దు చేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్ నుంచి వరంగల్, రేపల్లె, సిర్పూర్ కాగజ్‌గగర్, కాచిగూడ నుంచి మిర్యాలగూడ, వికారాబాద్ నుంచి గుంటూరు మధ్య నడిచే పలు రైళ్లు రద్దు కానున్నాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.